తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

హైదరాబాద్ : fb.com/vaartha Digital

11-5-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 100 పేజీలు: 10+4 వెల: 6.50



హైదరాబాద్‌లో ఆదివారం హెచ్ఐసిసిలో జరిగిన సమావేశంలో ప్రధాని మోడీకి జ్ఞాపికను అందజేస్తున్న సిఎం రేవంత్. చిత్రంలో గవర్నర్ శివప్రతాప్ శుక్లా

# రేవంత్‌రెడ్డి! అభివృద్ధిలో నాతో నడవండి

## రైల్వే బడ్జెట్‌లో రూ.5,500 కోట్లిచ్చాం

## పలు నిర్మాణ పనులను ప్రారంభించిన ప్రధాని నరేంద్రమోడీ

## ఇది అభివృద్ధి ఉత్సవం.. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం కాదు

## మీది పెద్ద మనసు, తెలంగాణ ప్రజలను ఆశీర్వదించాలి: సిఎం రేవంత్‌రెడ్డి

## మోడీ విజన్‌లో తెలంగాణ అభివృద్ధి చెందుతుంది: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే10:** మూడోసారి ప్రధాని అయ్యాక తొలిసారి తెలంగాణ పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీ ఆదివారం హైటెక్ సిటీలోని హెచ్ఐసీసీ నుంచి పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు వర్చువల్‌గా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రారంభించిన కొత్త ప్రాజెక్టులు దేశవ్యాప్తంగా వేలాది ఉద్యోగాలను సృష్టించనున్నాయన్నారు. మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తోందని ఆయన స్పష్టం చేశారు. అభివృద్ధి ప్రాజెక్టుల ద్వారా ఆర్థిక వృద్ధితో పాటు ఉపాధి అవకాశాలూ విస్తరిస్తాయని చెప్పారు.దేశాభివృద్ధిలో నగరాల పాత్ర అత్యంత కీలకమని ప్రధాని మోదీ తెలిపారు.ముఖ్యంగా సైబరాబాద్ ప్రాంతం ఐటీ, దాని అనుబంధ రంగాల్లో ప్రపంచ స్థాయి కేంద్రంగా ఎదిగిందని ప్రశంసించారు. సైబరాబాద్ సామర్థ్యం అంతర్జాతీయ స్థాయికి చేరుకుంది. ఇప్పుడు దేశంలోనే అతిపెద్ద ఉపాధి కేంద్రాల్లో ఒకటిగా మారింది. సైబరాబాద్ అభివృద్ధి కోసం వేలాది కోట్లు కేటాయించాం. అంతర్జాతీయ పెట్టుబడులు ఆకర్షించేలా మరింత తీర్చిదిద్దుతాం అని చెప్పారు. కాగా, ఉమ్మడి ఏపీలో రైల్వేకు కేవలం వెయ్యి కోట్ల రూపాయలే ఇచ్చారు.మేంరైల్వే బడ్జెట్‌లో తెలంగాణకు రూ. 5,500 కోట్లు కేటాయించాం. ఇంకా రూ.50వేల కోట్ల విలువైన

>>2

# తెలంగాణలోనూ బిజెపికి పవర్

## బెంగాల్ ఉత్సాహం ఇక్కడి ప్రజల్లోనూ కనిపిస్తోంది..



ఆదివారం పెరేడ్‌గ్రౌండ్స్ బహిరంగ సభలో డప్పు వాయిస్తున్న ప్రధాని మోడీ

## దేశమంతా మార్పుకోరుతోంది

## ఏ రాష్ట్రంలోనూ కుటుంబ పాలన వద్దంటున్నారు

## మావోయిస్టులను కాపాడుతున్న కాంగ్రెస్

## బంగారం యేడాదిపాటు కొనకండి

## బహిరంగ సభలో ప్రధాని మోడీ



మోడీ బహిరంగ సభకు హాజరైన అశేష ప్రజానీకం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే10:** పశ్చిమ బంగాల్‌లో తొలిసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పడిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పశ్చిమబంగాల్‌లో బీజేపీ చరిత్రాత్మక విజయం సాధించిందని గుర్తు చేశారు. అక్కడి ప్రజలు చేసిన ప్రతిజ్ఞ ప్రకారం బీజేపీని గెలిపించుకున్నారని కొనియాడారు. తెలంగాణ ప్రజల నుంచి కూడా అలాంటి ఉత్సాహమే కనిపిస్తోందని చెప్పారు. తెలంగాణలో ఈసారి వచ్చేది బీజేపీ ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం సాయంత్రం పరేడ్ గ్రౌండ్స్‌లో బిజెపి ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రధాని మోడీ ప్రసంగించారు. అంతకుముందు తన కోసం కార్యకర్తలు తెచ్చిన పెయింటింగ్స్‌ను సేకరించాలని

>>2



ఆదివారం చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో సిఎంగా ప్రమాణం చేస్తున్న విజయ్

# దళపతి విజయ్

## చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో అశేష అభిమానుల మధ్య సిఎంగా ప్రమాణం

## మరో 9 మంది మంత్రులు కొలువులోకి

## కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా పలువురు ప్రముఖులు హాజరు

**చెన్నై, మే 10:** తమిళనాట రాజకీయ పార్టీని స్థాపించిరెండున్నరేళ్లలోపే అధికారంలోకి తీసుకువచ్చిన టివికె చీఫ్ విజయ్ ఆదివారం ముఖ్యమంత్రిగాప్రమాణ స్వీకారంచేసారు.నగరంలోని జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియంలో జరిగిన ఈకార్యక్రమంలో గవర్నర్ విశ్వనాథ్ అర్లేకర్ విజయ్‌చేత రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయించారు. 1967 తర్వాత డిఎంకె, అన్నాడిఎంకెలు కాని రాజకీయ పార్టీగా టివికె రికార్డుసాధించిన తరుణంలో టివికె విజయ్ ముఖ్యమంత్రిగా పాలన పగ్గాలుచేపట్టారు. ఆయనతోపాటు తొమ్మిది మంది

>>2

## ఈ యేడాది యథావిధిగా

# ఇంటర్ అడ్మిషన్లు

## విలీనం ప్రక్రియ వాయిదా

## అసెంబ్లీలో చర్చ తర్వాతే నిర్ణయం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే10:** ఈ ఏడాది యథావిధిగా ఇంటర్మీడియట్ ప్రవేశాలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రవేశాలకు సమయం తక్కువగా ఉండడం, ఇంటర్మీడియట్‌ను పాఠశాల విద్యలో విలీనం చేసే ప్రక్రియకు పలు సాంకేతిక సమస్యలు అడ్డుగా ఉండడంతో విద్యార్థుల ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా వెంటనే ప్రవేశాల ప్రక్రియను చేపట్టాలని సీఎం సూచించారు. ఇంటర్మీడియట్‌ను రద్దు చేసి సీబీఎస్ఈలో మాదిరే 11, 12 తరగతులు నిర్వహించాలని.. ఫలితంగా డ్రాపౌట్స్ సంఖ్య గణనీయంగా తగ్గుతుందని తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. సీబీఎస్ఈతో పాటు మెజారిటీ రాష్ట్రాలు 11, 12 తరగతుల విధానాన్ని అనుసరిస్తున్నాయి. మన రాష్ట్రంలో మాత్రం ఇంటర్మీడియట్ విద్య వేరుగా ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి వరకు చదివిన విద్యార్థుల్లో అత్యధికులు ఆ తర్వాత ఇంటర్మీడియట్‌కు వేరుగా ఉన్న కళాశాలల్లో చేరడం లేదు. అప్పటితో విద్యను నిలిపివేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంటర్మీడియట్‌ను వేరుగా కాకుండా 11, 12 తరగతులుగా కొనసాగించాలని

>>2





హైదరాబాద్‌లో ఎపి సిఎం చంద్రబాబుతో భేటీ అయిన ప్రధాని మోడీ. చిత్రంలో లోకేశ్


ప్రధాని మోడీకి స్వాగతం పలుకుతున్న ఎపి డి.సిఎం పవన్

# చంద్రబాబు, పవన్ నివాసాలకు వెళ్లిన ప్రధాని మోడీ

## పవన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ప్రధాని

## బాబుతో గంటకు పైగా మోడీ భేటీ, తెలంగాణ పరిస్థితిపై చర్చ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే 10:** హెచ్ఐసీసీలో నరేంద్ర మోదీ తన చేతుల మీదుగా వర్చువల్‌గా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు,అనంతరం జూబ్లీహిల్స్ లో ఎపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నివాసాలకు వెళ్లారు. ప్రధాని తొలుత పవన్ కల్యాణ్ ఇంటికి వెళ్లారు. పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకొని పరామర్శించారు. సైనస్ సమస్య కారణంగా పవన్ కల్యాణ్‌కు ఇటీవల శస్త్ర చికిత్స జరిగిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పవన్ ఇంటికి మోదీ వెళ్లి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు అక్కడ 20 నిమిషాల పాటు ప్రధాని ఉన్నారు. ఈ సందర్భంగా మెగాస్టార్,కేంద్ర మాజీ మంత్రి చిరంజీవి ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికారు. తర్వాత నేరుగా జూబ్లీహిల్స్‌లోని నారా చంద్రబాబు నాయుడు నివాసానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రధానికి చంద్రబాబుతో పాటు ఏపీ మంత్రి నారా లోకేశ్ ఆత్మీయ స్వాగతం పలికారు. చంద్రబాబుతో మోదీ సమావేశం గంటకు పైగా కొనసాగింది. తెలంగాణ రాష్ట్ర పరిస్థితిపై చర్చించారని సమాచారం. అంతకుముందు గచ్చిబౌలిలోని సింధు ఆస్పత్రికి చేరుకున్న ప్రధాని నరేంద్ర మోదీ, ఆస్పత్రిని ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం సింధు ఆస్పత్రిని, సింధు ఆస్పత్రిలో రోబోటిక్ శస్త్ర చికిత్సలను పరిశీలించారు. సింధు ఆస్పత్రి ప్రాంగణంలోని ఆలయంలో మోదీ పూజలు చేశారు. పరిసర ప్రాంతాల్లోనూ ఆరోగ్య సేవారంగంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి ఇది ఒక ప్రశంసించదగ్గ ప్రయత్నమని, అత్యాధునిక సాంకేతికతనూ, నవీన ఆవిష్కరణలనూ సమన్వయం చేసేందుకు ఆసుపత్రి బృందం ప్రత్యేక శ్రద్ధ వహించడం చాలా అభినందనీయమని ట్వీట్ చేశారు.

# తెలంగాణలోనూ బిజెపికి పవర్

>> ప్రధాని ఎస్పీజీని ఆదేశించారు. పెయింటింగ్స్ వేసిన చిత్ర కళాకారులకు తిరిగి లేఖలు రాస్తానని చెప్పారు. ప్రియమైన తెలంగాణ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు అంటూ తెలుగులో మాట్లాడి ఆకట్టుకున్నారు. మోదీని చూసిన ఆనందంలో బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలతో సభ ప్రాంగణాన్ని హోరెత్తించారు.

రాజకీయాల్లో గెలుపోటములు సహజమన్న ప్రధాని మోదీ, పశ్చిమ బెంగాల్‌లో ఓడిపోయింది రాజకీయ పార్టీ కాదని, రాజ్యాంగ వ్యతిరేక శక్తులని అన్నారు. టిఎంసీ తానాషాహీ మోడల్‌తో ప్రజలను ఇబ్బంది పెట్టిందని, బెంగాల్ ప్రజలు ఇప్పుడు స్వేచ్ఛావాయువు పీల్చుకుంటున్నారని చెప్పారు. పదేళ్ల క్రితం బెంగాల్‌లో బిజెపి ఎమ్మెల్యేలు ముగ్గురే ఉండేవారని, ఇప్పుడు 200 మందికి పైగా గెలిచారని, పశ్చిమబెంగాల్‌లో అవినీతి, కుటుంబ పార్టీలను ప్రజలు ఓడించారని తెలిపారు. బెంగాల్ విజయోత్సవం తెలంగాణలో కనిపిస్తోందని, ఆ రాష్ట్రంలో ఎలాంటి ఉత్సాహాన్ని చూశామో అచ్చం తెలంగాణలో కూడా అదే ఉత్సాహం కనిపిస్తోందని చెప్పారు. అస్సాంలో బిజెపి హ్యాట్రిక్ విజయాన్ని సొంతం చేసుకుందని, పుదుచ్చేరిలో కూడా ఎన్డీయే రెండెసారి అధికారంలోకి వచ్చిందన్నారు. తెలంగాణ ప్రజలు ఇంత ప్రేమ చూపించటం తన అదృష్టమన్నారు. దేశం మొత్తం మార్పును కోరుకుంటోందన్న ప్రధాని, ఏ రాష్ట్రంలోనూ కుటుంబ పాలనను ప్రజలు కోరుకోవట్లేదని పేర్కొన్నారు. ఈసారి తెలంగాణలోనూ బీజేపీ సర్కార్ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు కూడా కుటుంబ పార్టీలేనని తెలంగాణ అభివృద్ధికి ఎన్డీఏ సర్కార్ కట్టుబడి ఉందన్నారు. తెలంగాణలో జహీరాబాద్ ఇండస్ట్రియల్ కారిడార్ మంజూరు చేసినట్లు మోదీ ప్రకటించారు. దేశం మొత్తానికి 7 పీఎం మిత్ర టెక్స్‌టైల్ పార్కులు ఇస్తే, అందులో ఒకటి తెలంగాణకు ఇచ్చినట్లు గుర్తు చేశారు. కాకతీయ టెక్స్‌టైల్ పార్క్‌తో రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, బీజేపీ దృష్టి ఎప్పుడూ అభివృద్ధి, ఉపాధి మీద మాత్రమే ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్‌ను గెలిపించినందుకు కర్ణాటక ప్రజలు బాధపడుతున్నారని, తెలంగాణలోనూ అలానే ప్రజలు బాధపడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ విధానం మొదట ఓట్లు దండుకో, తర్వాత మర్చిపో అన్నట్లుగా ఉందన్నారు. కాంగ్రెస్ పొత్తులు ఎప్పుడూ అభివృద్ధి నిరోధకులతోనే ఉంటాయని మండిపడ్డారు. మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలో ఉందని, కాంగ్రెస్ ఎక్కడున్నా ఒక్కటే మోడల్ ఎన్నికల ముందు అలవికాని హామీలు ఇస్తారు. తర్వాత సాకులు వెతుకుతారు. తెలంగాణలో కూడా అదే జరుగుతుందన్నారు. కాంగ్రెస్ విద్వేష రాజకీయాలను రెచ్చగొడుతుందని, పార్టీ ఎంఎంసిగా మారిందని ప్రధాని నరేంద్రమోడీ విమర్శిచారు. ఎంఎంసి అంటే ముస్లిం లీగ్ మావోవాది కాంగ్రెస్ పార్టీ అని మోడీ కొత్త పేరు పెట్టారు. దేశంలో మావోయిస్టు ఉగ్రవాదం చివరి శ్వాస తీసుకుంటున్న ప్పటికీ, మావోయిస్టులను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. మావోయిస్టుల హింసతో తెలంగాణ తీవ్రంగా నష్టపోయింది. దేశమంతా మావోయిస్టులు అంతమైనా తెలంగాణలో ఇంకా ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులకు స్వేచ్ఛ ఇవ్వడం లేదు. తెలంగాణలో మావోయిస్టులను అంతం చేయాలంటే బీజేపీ పాలన రావాలి అని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న యుద్ధ పరిస్థితుల వల్ల ఇంధన సంక్షోభం తలెత్తినప్పటికీ దేశంలో పెట్రోల్,డీజిల్ ధరలు పెరగకుండా జాగ్రత్త పడుతున్నామని ప్రధాని తెలిపారు. పెట్రోల్, డీజిల్ పరిమితంగా వినియోగించండి. విదేశీ మారకద్రవ్యాన్ని మనం కాపాడుకోవాలి. ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలి. వర్క్‌ఫ్రమ్ హోమ్, ఆన్‌లైన్ మీటింగ్‌లు పెట్టుకోవాలి. ప్రజా రవాణాను వినియోగించాలి. మధ్యతరగతి ప్రజలు ఖర్చులు తగ్గించుకోవాలి. మధ్యతరగతి ప్రజలు విదేశీ ప్రయాణాలు మానుకోవాలి అని అన్నారు. దేశం నుంచి బయటకు వెళ్లే ధనాన్ని అరికట్టడం ద్వారా ఆర్థిక స్థిరత్వాన్ని సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. బంగారం కొనుగోలుపై ప్రధాని మోడీ కీలక వ్యాఖ్యలు చేశారు. బంగారం ధర భారీగా పెరిగిపోయిందని.. ఏడాదిపాటు ప్రజలు బంగారం కొనడం ఆపేయాలని సూచించారు. ఇక, వంట నూనెల వినియోగాన్ని కూడా తగ్గించుకోవాలని చెప్పారు. అలాగే, ఎరువులు, రసాయనాల వినియోగం తగ్గించాలన్నారు. విదేశాల నుంచి భారీగా రసాయన ఎరువులను దిగుమతి చేసుకుంటున్నామని.. రసాయన ఎరువుల వల్ల భూమికి చాలా నష్టం జరుగుతుందని చెప్పారు. వ్యవసాయంలో డీజిల్‌కు బదులు సౌర పంపులను ప్రోత్సహిస్తున్నామని.. వ్యవసాయంలో స్వదేశీ వస్తువులను ఎక్కువగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. కనీసం ఏడాది పాటు విదేశీ పర్యటనలు తగ్గించుకోవాలని ప్రధాని అన్నారు. విదేశీ మారక ద్రవ్యాన్ని కాపాడుకోవాలని.. రసాయన ఎరువులను తగ్గించుకుంటే విదేశీ ద్రవ్యాన్ని మిగిలించుకోగలమని మోడీ చెప్పారు. తెలంగాణ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని మోదీ పునరుద్ఘాటించారు. అభివృద్ధి చెందిన భారత్‌తో సమానంగా తెలంగాణ, హైదరాబాద్ కూడా పురోగమించేలా చూడటమే తమ ప్రయత్నమని, అందుకోసం వేల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసే అవకాశం లభించిందని తెలిపారు.తెలంగాణలో పర్యటన సందర్భంగా వేల కోట్ల రూపాయల అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేసినట్లు ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు గుర్తుచేశారు. అందులో దేశవ్యాప్తంగా 14 ఇండస్ట్రియల్ కారిడార్లు నిర్మాణంలో ఉన్నాయని, వాటిలో ఒకటి తెలంగాణలో ఏర్పాటు అవుతోందన్నారు. జహీరాబాద్ ఇండస్ట్రియల్ ఏరియాలో వాహన తయారీ నుంచి ఫుడ్ ప్రాసెసింగ్ వరకు ఆధునిక పరిశ్రమల ఎకోసిస్టమ్ రూపుదిద్దుకుంటోందని చెప్పారు. ఇది లక్షలాది యువతకు ఉపాధి కల్పించడంతో పాటు రైతులు, మధ్యతరగతికి వరంగా మారుతుందని అన్నారు.దేశవ్యాప్తంగా ఆమోదించిన ఏడు శిలీ మిత్ర టెక్స్‌టైల్ పార్కుల్లో ఒకటి వరంగల్‌లో ఏర్పాటు అవుతోందని ప్రధాని వెల్లడించారు. ఇది తెలంగాణ వస్త్ర పరిశ్రమకు కొత్త ఊపునిస్తుందని, ముఖ్యంగా పత్తి రైతుల భవిష్యత్తును మార్చే ప్రాజెక్టుగా నిలుస్తుందని పేర్కొన్నారు. పత్తి ఉత్పత్తి, నాణ్యత పెంపు కోసం కేంద్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయల మిషన్‌ను ఆమోదించిందని, దీని ద్వారా తెలంగాణలోని లక్షలాది పత్తి రైతులకు లాభం చేకూరుతుందని చెప్పారు.ప్రపంచ సంక్షోభాల సమయంలో ప్రతి పౌరుడు దేశహితం కోసం కట్టుబడి పనిచేయాలని ప్రధాని నరేంద్ర మోదీ గారు పిలుపునిచ్చారు. ఇది ఒక్క ప్రభుత్వానికి, ఒక్క పార్టీకి సంబంధించిన అంశం కాదని, దేశానికి సంబంధించిన బాధ్యత అని అన్నారు. ప్రతి పౌరుడు, ప్రతి రాజకీయ పార్టీ, ప్రతి సంస్థ దేశ ప్రయోజనాల కోసం ఏకమై పనిచేస్తే భారత్ ప్రతి సంక్షోభాన్ని జయిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. చివరగా సభకు భారీగా తరలివచ్చిన తెలంగాణ ప్రజలకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు.


ఆదివారం సికిందరాబాద్ పెరేడ్‌గ్రౌండ్స్ బహిరంగ సభలో అభివాదం చేస్తున్న ప్రధాని మోడీ. చిత్రంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

# అభివృద్ధిలో నాతో నడవండి

>> ప్రాజెక్ట్‌లు నడుస్తున్నాయి. వీటితో పాటు జాతీయ రహదారులు రెట్టింపయ్యాయి. తెలంగాణకు 6 వందేభారత్ సహా 5 అమృత్‌భారత్ రైళ్లను ఇచ్చాం.ఖాజీపేట జంక్షన్ అభివృద్ధి కోసం వేల కోట్ల రూపాయలు కేటాయించాం అని వివరించారు. తెలంగాణ వికసిస్తే.. దేశం కూడా వికసిస్తుంది. రాష్ట్రాల అభివృద్ధి లేనిదే దేశాభివృద్ధి సాధ్యం కాదు అని మోదీ పేర్కొన్నారు.ఇంధన భద్రతకు మా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఇంధన భద్రతలో మల్కాపూర్ ప్రాజెక్ట్ కీలకం. ప్రపంచం ఇప్పుడు ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం దేశంపై పడకుండా చూసుకున్నాం. రాజకీయాలు మాట్లాడబోనని రేవంత్ అన్నారు.. నేనూ మాట్లాడను. పదేళ్లుగా గుజరాత్‌కే ఎక్కువ నిధులు ఇచ్చారని అంటున్నారు. గుజరాత్‌కు ఎంత ఇచ్చామో తెలంగాణకు కూడా అంతే ఇచ్చేందుకు సిద్ధం. గుజరాత్ తరహాలో చేస్తే మీకు సగం నిధులే వస్తాయి.. ఈ నిధులే మీకు సరిపోతాయా? అని చమత్కారంగా ప్రశ్నించారు. వేదికపై ఉన్న సిఎం రేవంత్‌రెడ్డితో సహా అందరూ నవ్వారు. 'ఈ ప్రతిపాదన నచ్చితే సీఎం రేవంత్ మాతో కలిసి నడవాలి. అభివృద్ధిలో మీరు ఎక్కడికి చేరాలనుకుంటున్నారో అక్కడికి చేరలేదు. రాజకీయంగా కాదు.. అభివృద్ధిలో నాతో కలవండి' అని సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి మోదీ అన్నారు.రాష్ట్రంలో ఇటీవల ప్రారంభించిన అభివృద్ధి ప్రాజెక్టులు.. పరిశ్రమలు, రవాణా, సాంకేతిక రంగాల్లో విస్తృత అవకాశాలను తీసుకురానున్నాయని ప్రధాని తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా యువతకు భారీ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, స్థానిక ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. మౌలిక వసతుల అభివృద్ధి ద్వారా దేశం వేగంగా ముందుకు సాగుతోందని.. తద్వారా రోడ్లు, పరిశ్రమలు, డిజిటల్ మౌలిక వసతులు వంటి రంగాల్లో పెట్టుబడులు పెంచడం ద్వారా భారత్‌ను గ్లోబల్ ఎకనామిక్ పవర్‌గా మార్చే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంతకు ముందు సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఇది అభివృద్ధి ఉత్సవం.. కేంద్ర ప్రభుత్వం కార్యక్రమం కాదు,జాతీయ భద్రత, జాతీయ అభివృద్ధే మనకు అత్యధిక ప్రాధాన్యం' అని చెప్పారు. ముందు భారత దేశం, తర్వాత ప్రజలు, ఆ తర్వాతే పార్టీ అనేది స్పష్టం,ఆ స్ఫూర్తితోనే దేశ నిర్మాణానికి ప్రధానమంత్రి మోదీ.. వికసిత్ భారత్ 2047ను ప్రకటించినప్పుడు, మేము భాగస్వాములయ్యాం. తెలంగాణ రైజింగ్‌కు మీరు పూర్తి సహకారం అందిస్తారనే విశ్వాసం మాకు ఉంది అని పేర్కొన్నారు. తెలంగాణను దేశంలో మొదటి స్థానంలో నిలిపేందుకు మేం ప్రయత్నిస్తున్నాం, కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్క్, రైల్వే ప్రాజెక్టులు ప్రారంభించేందుకు మోదీ వచ్చారు అని పేర్కొన్నారు. అయిదు రాష్ట్రాల ఎన్నికలు ముగిశాయి, మోదీ... ఎన్నికలు పూర్తయ్యాక అభివృద్ధి పనులకు వచ్చారు..మనం అభివృద్ధిపై దృష్టి పెట్టాలి అని పేర్కొన్నారు. మోదీ.. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నాటి ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ సహకారంతో మీరు గుజరాత్ మోడల్‌ను అభివృద్ధి చేశారు.. తెలంగాణ ప్రజలు కూడా రాబోయే పదేళ్లలో మీ సహకారంతో మా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని కోరుకుంటున్నారు. నాటి మన్మోహన్ సింగ్ విధంగా, ఆయన స్ఫూర్తితో మీరు నాకు పూర్తి సహకారం అందిస్తారని విశ్వసిస్తున్నా అని తెలిపారు. 2034లో 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు చేరుకుంటామనే నమ్మకం ఉంది... 2047 వరకు 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు చేరుకుంటామని ఆశిస్తున్నా.. నాడు మన్మోహన్‌సింగ్ ఆశీస్సులు అందించినట్లే మీరు తెలంగాణ ప్రజలకు ఆశీస్సులు అందించాలి అని కోరారు. భారీ ఆర్థిక వృద్ధి, మహా నగరాలు, విశ్వ నగరాల నుంచే వస్తుంది.. మనకు ఢిల్లీ, ముంబయి, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్ ఆరు మహా నగరాలున్నాయి. ఈ దేశం ప్రపంచంలో మొదటి స్థానంలో ఉండాలంటే, యువతకు ఉద్యోగాలు రావాలంటే ఈ మహా నగరాలను అభివృద్ధి చేయాలి..... ఈ ఆరు మెట్రో నగరాలకు సంబంధించిన జాతీయ ప్రాధాన్యత గల అన్ని ప్రాజెక్టులకు కేంద్రం నుంచి అనుమతులు త్వరగా లభించేలా ప్రధానమంత్రి కార్యాలయంలో ప్రత్యేక సింగిల్ విండో టాస్క్ ఫోర్స్ ఉండాలి అని కోరారు. మోదీ... నా రాష్ట్రం, నా ప్రజల కోసం సానుకూల నిర్ణయాల విషయంలో నేను మిమ్మల్ని, కేంద్ర మంత్రులను అనేకసార్లు కలిశాను అని గుర్తు చేశారు. మా రాష్ట్రానికి సంబంధించిన కొన్ని ప్రాజెక్టులకు మీ అత్యవసర అనుమతులు, ఆమోదాలు అవసరం. మూసీ నది, మెట్రో రైలు, రేడియల్ రోడ్లు, హైదరాబాద్ -మచిలీపట్నం వరకు 12 వరుసల రహదారికి సంబంధించి రెండు గంటల పాటు సమయం కేటాయించి సమీక్షించాలి అని కోరారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, సంజయ్ మిత్రులు.. మీకు పెద్ద మనస్సు ఉందని చెబుతున్నారు.. మోదీ... మీకు పెద్ద మనస్సు ఉందని తెలంగాణ ప్రజలకు తెలుసు. నేడు వారు దాన్ని ప్రత్యక్షంగా చూడాలనుకుంటున్నారు. తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన పెండింగ్ పనులు, ప్రతిపాదనలు అన్నింటినీ మీరు ఆమోదిస్తారని తెలంగాణ ప్రజలు ఆశిస్తున్నారు అని పేర్కొన్నారు.. దేశం విషయంలో మేం మీతో కలిసి ఉన్నాం.. మీరు వికసిత్ భారత్ 2047పైన మాట్లాడి, భారతదేశాన్ని 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే అంశంపై మాట్లాడినప్పుడు,మేం మా రాష్ట్ర కోణంలో తెలంగాణ రైజింగ్ 2047'ను దానికి అనుసంధానం చేశాం అని చెప్పారు.

అంతకు ముందు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోదీ చేతుల మీదుగా తెలంగాణలో రూ. 9,400 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిగాయి.వరంగల్‌లో పీఎం మిత్ర పార్క్ ప్రారంభోత్సవం, జహీరాబాద్ పారిశ్రామిక ప్రాంతానికి శంకుస్థాపన చేశారు.

రీజనల్ రింగ్ రోడ్ ఈ ప్రాజెక్టుకు మూడేళ్ల క్రితమే కేంద్రం అనుమతి ఇచ్చింది. భూసేకరణ ప్రక్రియ ముగిసి, కేంద్ర కేబినెట్ ఆమోదం లభించగానే పనులు ప్రారంభమవుతాయి అని చెప్పారు.2014 వరకు తెలంగాణలో 2,400 కి.మీ జాతీయ రహదారులు ఉండగా, గత 11 ఏళ్లలో అదనంగా 2,600 కి.మీ కొత్త హైవేలను కేంద్రం నిర్మించింది. రాష్ట్రవ్యాప్తంగా 42 రైల్వే స్టేషన్ల ఆధునీకరణ పనులు జరుగుతున్నాయని,సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ రూ.220 కోట్ల వ్యయంతో ఈ స్టేషన్‌ను శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ స్థాయి అత్యాధునిక సదుపాయాలతో ఈ ఏడాది చివరికల్లా సిద్ధం చేస్తున్నారని పేర్కొన్నారు, ఇటీవలే చేర్లపల్లి రైల్వే స్టేషన్‌ను కూడా అందుబాటులోకి వచ్చిందన్నారు. రాష్ట్రంలో సమ్మక్కసారక్క సెంట్రల్ యూనివర్సిటీ, రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్, ఎయిమ్స్ ఆసుపత్రి వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు కొనసాగుతున్నాయి.

గతంలో ప్రారంభించిన రామగుండం ఫర్టిలైజర్ పరిశ్రమ మరియు రూ. 13,000 కోట్ల ఎన్‌టీపీసీ పవర్ ప్రాజెక్టులను కేంద్రం తెలంగాణకు అందించిందన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా (బీఆర్ఎస్, కాంగ్రెస్ లేదా కమ్యూనిస్ట్) కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపకుండా తెలంగాణ అభివృద్ధికి సహకరిస్తుందని స్పష్టం చేశారు.ఎన్నికల తర్వాత రాజకీయ భేదాలు పక్కన పెట్టి రాష్ట్ర అభివృద్ధి కోసం కలిసి పనిచేయాలని, ప్రధాని మోదీ ఆశయమైన 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో తెలంగాణ కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు.

# ఉచిత విద్యుత్ ఫైలుపై విజయ్ తొలిసంతకం!

**చెన్నై, మే 10:** తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన విజయ్ ఉచిత విద్యుత్ ఫైలుపై తొలి సంతకం చేశారు. తమిళనాడులో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వడానికి ఉచిత విద్యుత్ ఫైలుపై తొలి సంతకం చేశారు. ఆ తర్వాత మహిళా భద్రతపై, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా, ఉచిత బస్సు ప్రయాణం తదితర హామీలకు సంబంధించిన ఫైళ్లపై సంతకాలు చేశారు. చెన్నైలోని జవహర్ లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియం వేదికగా జరిగిన ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తదితరులు హాజరయ్యారు. తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సి. జోసెఫ్ విజయ్‌కు శ్రీలంక అధ్యక్షుడు అనురకుమార దిస్సనాయకే అభినందనలు తెలిపారు.

## వారం - వర్జ్యం

11-05-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, కృత్తిక కార్తె
నవమి మ.3.18
శతభిష రా.1.25
వర్జ్యం : ఉ.8.10-9.48
దు.మ.12.30-మ.1.21,
2)మ.3.04-మ.3.55
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం:**గత అనుభవం ద్వారా కొన్ని సమస్యల నుండి తప్పించుకోగలుగుతారు. అతిథి మర్యాదలకు ఖర్చు చేస్తారు.

**వృషభం:** కుటుంబసభ్యుల అభివృద్ధికి మీరు ఎక్కువ శ్రమ చేయవలసి వస్తుంది. ప్రయాణాలు అనుకూలంగా ఉంటాయి.

**మిథునం:**మీ గురించి చెడుగా ప్రచారం చేసే వ్యక్తుల నుండి దూరంగా వుండడం మంచి, కాంట్రాక్టులు దక్కుతాయి.

**కర్కాటకం:**అనుకూల ఫలితాలు ప్రతికూల ఫలితాలు సరిసమానంగా ఉంటి. వస్తు భద్రత పట్ల జాగ్రత్త అవసరం.

**సింహం:**నూతన బాధ్యతలు సంతోషం కలిగిస్తాయి. బంధువులతో మాట పట్టింపులు రాకుండా జాగ్రత్త పడండి.

**కన్య :**నిర్వహించ లేక పారిపోతారని ఇతరులు వేసిన అంచనాలు తలక్రిందులు చేస్తాయి.వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**తుల :** ఇష్టం లేకపోయినా, నమ్మకం లేకపోయినా కొందరిని తాత్కాలికంగా నమ్మాల్సిన స్థితి తప్పదు. వస్త్రలాభం.

**వృశ్చికం:** మీ పలుకుబడి అన్ని విధాలుగా ఉపయోగించి ఉద్యోగపరమైన ఒత్తిళ్ళను తట్టుకుంటారు. శుభవార్తలు అందుకుంటారు.

**ధనుస్సు:** అధిక శ్రమ వలన ఆరోగ్య పరంగా కొద్దిపాటి ఒడిదుడుకులు ఉంటాయి. సమావేశాలలో పాల్గొంటారు.

**మకరం:** అన్ని విషయాలలో పురోగతి బాగుంటుంది. లాభాలు మాత్రం చేతి కందవు. సమయం పడుతుంది.

**కుంభం:** ఉద్యోగపరంగా మీ స్థాయి తగ్గనున్నదని శత్రువర్గం ప్రచారం అధికం అవుతుంది. ఋణాలు తీరుస్తారు.

**మీనం:** ఆర్థిక పరమైన ఒత్తిళ్ళు ఉంటాయి. సర్దుబాటు చేసే కొద్ది మరికొన్ని పుట్టు కొస్తాయి. కళా,సినిమా రంగాల వారికి ప్రోత్సాహం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# దళపతి విజయ్


ఆదివారం చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో సిఎంగా ప్రమాణం చేసిన అనంతరం రాహుల్ గాంధీతో కలిసి అభివాదం చేస్తున్న విజయ్

నెహ్రూ స్టేడియంలో ఆదివారం ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారంచేసిన తర్వాత ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. తొలిప్రసంగంలోనే డిఎంకె ప్రభుత్వంపై విమర్శలు సంధించారు. రాష్ట్రం సుమారు రూ.10 లక్షల కోట్ల అప్పుల ఊబిలో ఉందని, ఖజానాను పూర్తిగా తుడిచిపెట్టేశారని సంచలన ఆరోపణలు చేశారు. తన ప్రభుత్వం పారదర్శకంగా ఉంటుందని, అవినీతిని ఏమాత్రం సహించబోనని, తప్పు చేస్తే తన వారిని కూడా ఉపేక్షించనని గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా విజయ్ భావోద్వేగంగా ప్రసంగించారు. సినిమాల్లో ఎలాగైనా నిలదొక్కుకోవాలని కష్టపడిన ఒక సాధారణ అసిస్టెంట్ డైరెక్టర్ కొడుకుగా, నాకు పేదరికం, ఆకలి విలువ బాగా తెలుసు. నేనేమీ రాజుల కుటుంబం నుంచి రాలేదు. మీలో ఒకడిగా, మీ కుటుంబ సభ్యుడిగా, మీ బిడ్డగా, మీ అన్నగా, తమ్ముడిగా నన్ను నేను భావిస్తున్నాను. మీరు కూడా నన్ను అలాగే ఆదరించినందుకే ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నానని అన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, గత ప్రభుత్వం రాష్ట్రంపై మోయలేని అప్పుల భారాన్ని మోపి, ఖజానాను పూర్తిగా ఖాళీ చేసి వెళ్లిపోయింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో మనం బాధ్యతలు స్వీకరించాం. ఇది నిందలు వేయడం కాదు, వాస్తవ పరిస్థితిని ప్రజల ముందుంచాలి. రాష్ట్ర ప్రస్తుత ఆర్థిక పరిస్థితి ఎలా ఉందో ప్రజలకు తెలియజేసేందుకు ఒక శ్వేతపత్రం విడుదల చేస్తాను. మాది పారదర్శకమైన ప్రభుత్వం. ఏదీ దాపరికాలు లేకుండా, ముసుగులు వేసుకోకుండా బహిరంగంగానే వ్యవహరిస్తానని విజయ్ ప్రకటించారు. అవినీతిపై తన వైఖరిని స్పష్టం చేస్తూ, ప్రజాధనం నుంచి ఒక్క పైసా కూడా నేను ముట్టుకోను. ఆ అవసరం నాకు లేదు, అది మీకు బాగా తెలుసు. ఈ విజయ్ తప్పు చేయడు, ఇతరులను చేయనివ్వడు. నా ప్రభుత్వంలో ఉన్నవారైనా సరే, తప్పు చేస్తే ఉపేక్షించేది లేదు. గెలిచాం కదా అని ఆటలు ఆడదామనే ఆలోచన ఎవరికైనా ఉంటే, ఇప్పుడే దాన్ని తుడిచిపెట్టేయండి. ఇక్కడ ఒకే ఒక్క పవర్ సెంటర్ ఉంటుంది, అది నా నాయకత్వంలోనే ఉంటుంది. వేర్వేరు అధికార కేంద్రాలకు తావు లేదని గట్టిగా హెచ్చరించారు. యువతను నాశనం చేస్తున్న డ్రగ్స్ సంస్కృతిని అణిచివేసేందుకు ఇప్పటి నుంచే చర్యలు మొదలుపెడతాను. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు, విద్య, రేషన్, వైద్యం, తాగునీరు, రోడ్లు, బస్సు సౌకర్యాలు వంటి మౌలిక సదుపాయాలపైనే నా పూర్తి దృష్టి ఉంటుందని హామీ ఇచ్చారు. తన ప్రభుత్వానికి మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, సీపీఎం నేతలు ఎంఏ బేబీ, కే. బాలకృష్ణన్, వీసీకే నేత తిరుమావళవన్, సీపీఐ నేత డి.రాజా సహా ఇతర మిత్రపక్షాల నాయకులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఇది ఒక కొత్త ఆరంభం. నిజమైన లౌకిక, సామాజిక న్యాయంతో కూడిన పాలన ఇక్కడి నుంచే మొదలవుతుందని విజయ్ అన్నారు.

>> మంత్రులుగా ప్రమాణస్వీకారంచేసారు. ప్రమాణస్వీకారం సందర్భంగా నెహ్రూ స్టేడియం పరిసరాల్లో పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాట్లుచేసారు. రాజకీయ, సినీ ప్రముఖులు, పారిశ్రామికరంగాల ఉద్దండులు ఎందరో ఈ ప్రమాణ స్వీకారకార్యక్రమానికి హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీనుంచి రాహుల్‌గాంధీ పాల్గొన్నారు. విజయ్‌తోపాటు ఎన్ ఆనంద్, అదవ అర్జున, కెఎ సెంగోట్టియన్,ఎస్‌కీర్తన, కెజి అరుణ్‌రాజ్, పి వెంకటరమణన్, సిఆర్ నిర్మల్‌కుమార్, రాజ్‌మోహన్, టికెప్రభులు మంత్రులుగా ప్రమాణస్వీకారంచేసారు. బిజెపి అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్, మాజీ చీఫ్‌కె అన్నామలైలు కూడా ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా వచ్చారు. వీరితోపాటు విసికె అధ్యక్షుడు పెరుమావళన్, సిపిఐ, సిపిఎం నేతలు బాబీ, రాజా వంటి సీనియర్‌నేతలు కూడా పాల్గొన్నారు. ఐయుఎంఎల్ పార్టీ నాయకులు, ఎన్నికైన ఇద్దరు ఎమ్మెల్యేలు సైతం ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం సచివాలయానికి వెళ్లి తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కాగా జోసెఫ్ విజయ్‌ప్రమాణ స్వీకార కార్యక్రమంలో సినీ నటి త్రిష కృష్ణన్, ఆమె తల్లికి ముందువరుసలోనే సీట్లు కేటాయించారు. అదే వరుసలో విజయ్ తండ్రి చంద్రశేఖరన్, తల్లి శోభ చంద్రశేఖరన్‌లకు సీట్లు ఏర్పాటుచేసారు. వేడుక ప్రారంభానికి ముందే అక్కడకు చేరుకున్న త్రిష విజయ్ తల్లి శోభతో ఆప్యాయంగా మాట్లాడటం అందరినీ ఆకర్షించింది.

**ఏది ఆచరణ సాధ్యమో అదే చేసి చూపిస్తా: తొలిప్రసంగంలో విజయ్**

ఆలోచిస్తాం, అది చేస్తాం, ఇది చేస్తామని చెప్పబోనని, ఏది సాధ్యమో అదే చేస్తామని టివికె అధినేత రాష్ట్ర ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ అన్నారు.

## ఈ యేడాది యథావిధిగా

# ఇంటర్ అడ్మిషన్లు

>> ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గతంలో అధికారులకు సూచించారు. ఇదే అంశాన్ని తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ సైతం తన నివేదికలో పేర్కొంది. ఇటీవల ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు నిలిపివేస్తూ అధికారులు ప్రకటన విడుదల చేయడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, విద్యా శాఖ కమిషనర్ యోగితా రాణాలతో చర్చించారు. విలీనంతో ముడిపడిన పలు సాంకేతిక సమస్యలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాల్సి ఉన్నందున ఈ ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేయాలని నిర్ణయించారు. విలీన ప్రక్రియకు సంబంధించి భాగస్వాములతో విస్తృతంగా సంప్రదింపులు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీపై నియమించిన కమిటీ అధ్యయనం చేసి తన నివేదిక సమర్పించాలని సీఎం సూచించారు. అనంతరం శాసనసభలో చర్చించి తుది నిర్ణయం తీసుకుందామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

వార్త

నిముషాన్ని సంపూర్ణత్వంతో నింపడమే సంతోషం. పశ్చాత్తాపానికీ, ఆజ్ఞలకూ అతీతమైనదే అసలైన సంతోషం.

- ఎమర్సన్

# బంగ రాజకీయాల్లో కొత్త మలుపు!

ఎన్‌డిఏకు నేతృత్వం వహిస్తున్న భారతీయ జనతా పార్టీ ఇప్పుడు పశ్చిమ బంగ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని నెలకొల్పింది. శనివారం ఉదయం ఘడియల్లో సువేందు అధికారి ప్రమాణస్వీకారంతో కొత్తగా కొలువు తీరింది. భారతీయ జనతాపార్టీకి మూలబిందువైన భారతీయ జనసంఘ్ పార్టీకి ప్రాణప్రతిష్ట చేసిన వ్యవస్థాపకులు శ్యామాప్రసాద్ ముఖర్జీ బెంగాల్ వాసి. 1951లో ఏర్పడిన ఈ జనసంఘ్ పార్టీయే 1980లో భారతీయ జనతాపార్టీగా రూపాంతరం చెందింది. ఒక్కో రాష్ట్రంలోనూ ప్రభుత్వాలను ఏర్పరచుకుంటూ నిన్నమొన్నటి ఎన్నికలతో దాదాపు 21రాష్ట్రాలలో ప్రభుత్వాలు ఏర్పర్చుకుంది ఇంతకు ముందు ఎన్ని రాష్ట్రాలలో బిజెపి జైత్రయాత్ర సాగించినా 'పశ్చిమ బంగ' రాష్ట్రంలో జరిగిన అధికార మార్పిడికి ప్రత్యేక కారణముంది. నిన్నమొన్నటి ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అహంకారమేనని చాలా విశ్లేషణల్లో చెప్తుంటారు. కానీ అసలు సిసలుగా చెప్పుకోవాల్సింది ఆమె వ్యవహారశైలితోపాటు చెప్పుకోవాల్సినవి ఇంకా ఉన్నాయి. జాతీయ భద్రత, బెంగాల్‌లో చొరబాట్లు, గోవుల అక్రమ రవాణా వంటి అంశాలు ఆరాష్ట్రాన్ని అతలాకుతలం చేశాయి. అందుకే ఈ రాష్ట్రాన్ని తన కనుసన్నల్లో నడిచే 'డబుల్ ఇంజిన్ సర్కార్' రాష్ట్రంగా చేసుకోవాల్సిన ఆవశ్యకత కేంద్ర ప్రభుత్వానికి ఏర్పడింది. బెంగాల్‌లో తొలి బిజెపి ముఖ్యమంత్రిగా సువేందు అధికారి చరిత్ర సృష్టించారు. బెంగాల్‌ను సామాజిక అవలక్షణాలకు దూరంగా సాధారణ పరిస్థితికి తీసుకురావడానికి ఆయనకే పాలనా పగ్గాలు అప్పగించాల్సిన పరిస్థితి బిజెపికి అనివార్యం. ఎన్‌డిఎ పాలిత రాష్ట్రాల్లో జనతా భద్రత రీత్యా బిజెపి ముఖ్యమంత్రిని కొలువు దీర్చటమే తక్షణావశ్యకం. కొత్త ప్రభుత్వం వ్యక్తిగత అధికారం చుట్టూ తిరగకుండా 'నేను కాదు మనం' అనేభావనతో ప్రజలకు సేవ చేస్తుందని ప్రమాణస్వీకారానికి ముందు కాబోయే ముఖ్యమంత్రిగా సువేందు భరోసా ఇచ్చారు. గత తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజలు భయోత్పాతానికి గురయ్యారని ఇకపై అలాంటి పరిస్థితి ఉండదని స్పష్టం చేశారు. ఒకప్పటి మమతా బెనర్జీకి ఆయన వీర విధేయుడు అయినా ఆమె వైఖరిని వ్యతిరేకించారు. 2020 డిసెంబరులో బిజెపిలో చేరి ఆమె హయాంలోప్రతిపక్ష నాయకునిగా ప్రజలకు అండదండలిచ్చారు. మమతా బెనర్జీ 15 ఏళ్ల పరిపాలనలో ఆమెకు కేంద్ర ప్రభుత్వంతో తగాదాలే సరిపోయాయి. సజావుగా పరిపాలన చేయడం కన్నా ప్రతి విషయంలోనూ వివాదాస్పదంగా వ్యవహరించేవారు.. ఎన్నికల ముందు ఆమె నిర్వహించిన పాత్ర బెడిసికొట్టింది. ఏది చేసినా డ్రమెటిక్‌గా చేయాలనుకునే తీరు బంగ ప్రజలకు నచ్చలేదు. ఎన్నికల కమిషన్ విస్తృత ఓటర్ల తనిఖీ ప్రక్రియను 'సర్' కార్యక్రమంగా చేపట్టారు. దానిని ఆమె పూర్తిగా వ్యతిరేకించింది. చివరికి వ్యక్తిగత ధోరణిలో వ్యాఖ్యానాలు, చాలెంజీలు విసరడం ప్రజలు అంగీకరించలేదు బెంగాల్‌లో పరిశ్రమలవృద్ధి చెప్పుకోదగినంతగా లేదు. రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదాస్పద ధోరణి కారణంగా పెద్దగా పారిశ్రామిక వేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రాలేదు. పాలకులపై నమ్మకం సన్నగిల్లింది. పాలక వర్గంపై అవినీతి ఆరోపణలువచ్చాయి. రాజకీయ హింస చెలరేగింది. 2 దశాబ్దాల క్రితం కమ్యూనిస్టులు పరిపాలించిన నేలపై మమతా బెనర్జీ గట్టిగానే పోరాడారు. ఆమె దూకుడును బట్టి సత్పరిపాలన అందిస్తారనే ఆశపడినప్రజలకు అడియాసే మిగిలింది. ప్రభుత్వ వ్యతిరేక ఓటు జమ అయింది. ప్రజలు మార్పుకోరుకున్నారు. అందుకు తగినట్లుగానే ఓటింగ్ ప్రక్రియ జరిగింది. ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయాలు తమ విజయంపై ప్రభావితం చేసిందని ఆమె గొంతెత్తి అరిచారు. ఓటమి మిగిలాక కూడా ఆమె గద్దెదిగనన్నారు. రాజీనామా చేయను గాక చేయనన్నారు. మొంటి పట్టుపట్టారు. చివరికి అసెంబ్లీ రద్దుచేసి ఇకఆమెతో పనిలేదని గవర్నర్ చెప్పాల్సి వచ్చింది. పరాజయాన్ని ప్రజల తీర్పును హుందాగా అంగీకరించే సంయమనం కోల్పోయారు. ఎన్నికల ముందొకసారి 'ఐప్యాక్' ప్రతినిధులపై ఇ.డి దాడులు జరిపినప్పుడు మమత వ్యక్తిగత ప్రతిష్టకు పోగా సుప్రీంకోర్టు మందలించిందన్న అపప్రధ పొందారు. ఇవన్నీ ఆమె పట్ల ఏకుమేకులయ్యాయి. బంగ రాజకీయ చరిత్రలో 2026ఎన్నికలు ఒక మార్పు. 'సర్' అనే విస్తృత ఓటర్ల గుర్తింపు ప్రక్రియే ఒక ముఖ్య సంస్కరణ. సంక్షేమ పథకాలద్వారా గ్రామీణ మహిళలు, రైతులు పేద వర్గాలపై మొదట్లో తృణమూల్ కాంగ్రెస్ ప్రభావితం చూపింది. ప్రధానంగా యువత సంక్షేమం కాదు. ఉద్యోగాలు కావలన్న నినాదంతో నిరుద్యోగులు ప్రభుత్వంపై ఎదురుతిరిగారు. తమ వద్దనున్న ఓటు హక్కుతో ప్రభుత్వాన్ని మార్చదలచుకున్నారు. అదే చేశారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం లేకపోవడంతో కలిగిన నష్టాలను చవిచూసిన జనం ఈసారి బిజెపికి పట్టం కట్టారు. పశ్చిమ బెంగాల్ రాజకీయాలు ఆదినుంచీ భావోద్వేగాలు, ప్రాంతీయ గౌరవం, సాంస్కృతిక సౌరభం వంటి అంశాలతో ముడిపడి ఉన్నాయి. వాటిని గౌరవిస్తూ కొత్త ప్రభుత్వం పాలనలో ముందుకు సాగాలి. అధికార మార్పు ప్రతీకార రాజకీయాలకు చోటివ్వకుండా ఉన్నప్పుడే బంగ రాజకీయాలు రాణిస్తాయి. ఒకప్పుడు భారతదేశ వాణిజ్యానికి తలమానికంగా ఉన్న కోల్‌కత్తా నుంచి పరిశ్రమలు తరలివెళ్లిపోయాయి. మళ్లీ పెట్టుబడుల సమన్వయంతో పరిశ్రమలు రాగలిగితే నిరుద్యోగ సమస్య తీరగలదు. ఏది ఏమయినా పారదర్శక పాలనను బంగప్రజలు కోరుకుంటున్నారు. కొత్త ప్రభుత్వం ప్రజల్లో వివిధ సామాజిక అంశాలపట్ల విశ్వాసం కల్పించినప్పుడే బెంగాల్ సర్వతోముఖాభివృద్ధిగా సాగుతుంది.

యుద్ధానికి ఎవరూ కారణాలను అన్వేషించరు. ఫలితం ఏమిటనే అందరూ ప్రశ్నిస్తారు.



సెనెకా

పనులను చేయడంలో రహస్యం ఒకటుంది. అదేమిటంటే ఆ పనుల్ని వాయిదా వేయడం కాదు. వెంటనే చేయడం.



ఆడమ్‌స్మిత్

## ప్రజావాక్కు



### మాతృభాషపై తప్పుతున్న పట్టు

మార్చినెలలో జరిగిన పదోతరగతి పరీక్షల్లో మాతృభాషైన తెలుగు సబ్జెక్టులో 41.3 శాతం విద్యార్థులు తప్పారు. బాలికలు కంటే బాలురే ఎక్కువ మంది ఫెయిలవ్వటం గమనార్హం. ఈ నేపథ్యంలో బాలురకు మాతృభాష పట్ల ఏ మాత్రం అనురక్తి లేదని తేటతెల్లమోతోంది. ఈ విద్యా సంవత్సరంలో మన రాష్ట్రంలో పదో తరగతి పరీక్షలను 6,17,827 మంది రాయగా 5,26,677మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అందులో ప్రభుత్వ పాఠశాలలలో చదివిన బాల, బాలికలు అత్యధిక మార్కులు, ర్యాంకులు సాధించటంతో తల్లిదండ్రులందరూ సంతోష పడ్డారు. కానీ పదో తరగతి పరీక్షలలో తప్పిన వారిలో అత్యధిక మంది తెలుగుసబ్జెక్టులో తప్పటం తెలుగు భాషా వేత్తలు, భాషాభిమానుల హృదయాలను తీవ్ర నిరాశ పరుస్తోంది. రాష్ట్రంలో ఐదుకోట్ల మందికి మాతృభాషైన తెలుగు సబ్జెక్టులో ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు సైతం ఫెయిలవ్వటం శోచనీయం.

- జి.సూర్యనారాయణ, కృష్ణాజిల్లా

### ఇలాంటి వ్యక్తులు గవర్నర్ పదవికి అనర్హులు

తమిళనాడులో ప్రజాస్వామ్యం ఖూనీయవుతుంది. గవర్నర్నును తక్షణమే తొలగించాలి. 108మంది శాసన సభ్యులు ఉన్న టీవీకే పార్టీని ప్రభుత్వాన్ని ఏర్పరచమని ఆహ్వానించాలి. ఆపార్టీ నాయకుడు విజయ్ రెండుసార్లు వెళ్ళి గవర్నరును కలిసినా కూడా 118సభ్యుల లిస్ట్ నాకు చూపమని అడగడం ఆయన అహంకారానికి నిదర్శనం. మాజీ ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా ఆహ్వానించాలి అని చెప్పాడు. విజయ్‌కు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన తరువాత మీ బలాన్ని నిరూపించుకో అనిగవర్నరు చెప్పాలి. నిరూపించుకుంటే కొనసాగుతారు. లేదంటే రాజీనామ చేస్తాడు. 'బొమ్మై కమిషన్ తీర్పులో సుప్రీం కోర్టు కూడా చెప్పింది. మరి తమిళనాడు గవర్నరు ఇలా ప్రవర్తించటం అపదవిని దుర్వినియోగ పరచట మే అవుతుంది.

- నార్నెవెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### మనం అభివృద్ధి చెందాలి

దేశంలో దినదిన అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానరంగంతోపాటు సమాజంలో జరుగుతున్న విషయాలను క్రోడీకరించి భవిష్యత్ జీవితంలో మలచుకోవాల్సిన అవసరాలకుఅనుగుణంగా మనంనిరంతరంశ్రమిస్తేనే అందరితోపాటు ముందంజలో ఉంటూఅభివృద్ధి చెందగలం.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### భారీ క్లైమాక్స్ దిశగా విజయ్ 'సర్కార్'

తమిళ హీరో విజయ్ సినిమా 'సర్కార్' అని ఒకటిఉంది. అది ఎలా ఉందో తెలీదు కానీ ఇప్పుడాయన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో మంచి పనితీరు కనపరిచి, సర్కారు ఏర్పాటు చేసే దశకు వచ్చాక క్లైమాక్స్ సీను పలు మలుపులు తిరుగుతూ వస్తోంది. భారీ క్లైమాక్స్ తర్వాత ఆయన హీరోగా వస్తారా, ఒక ప్రధాన పాత్రగా సరిపెట్టుకుంటారా అన్నది ఊహించనలవి కావడంలేదు. అయితే ఈ సీను వరకూ ఆయన సోలో సూపర్ స్టార్‌గానే ఉన్నారు. తమిళనాడులో దశాబ్దాలుగా రెండు పార్టీలే అధికారాన్ని మార్చి మార్చి అందుకుంటున్నాయి. ఈసారి మూడో ప్రత్యామ్నాయంగా విజయ్ టీవీకే పార్టీ స్థాపించి, పొత్తుల్లేని సింగిల్ పార్టీగా ఎన్నికల్లో పోటీ చేసి, సంఖ్యాబలంలో అతిపెద్దపార్టీగా గెలిపించుకున్నాడు. సినిమా తెరను మించి మసాలా పంచుతున్న తమిళ రాజకీయాల క్లైమాక్స్ ఘట్టం ప్రజలకు మాత్రం రుచించనిది.

- డా.డి. వి. జి. శంకరరావు, విజయనగరం

### దెబ్బతింటున్న భక్తుల మనోభావాలు

తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యివాడకంపై వెలువడిన వాస్తవాలు భక్తుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన దినేష్ కుమార్ ఏకసభ్య కమిషన్ నివేదిక ప్రకారం, గతప్రభుత్వ హయాంలో ఎటువంటి నాణ్యత ప్రమాణాలు పాటించకుండానే సుమారు 70 లక్షల కిలోల నెయ్యిని సేకరించడం దిగ్భ్రాంతికరం. ఈ నెయ్యిలో వనస్పతి వంటి కూరగాయల కొవ్వులు ఉన్నాయని ప్రయోగశాల నివేదికలు స్పష్టం చేసినప్పటికీ, ఆ విషయాలను తొక్కిపెట్టడం అత్యంత విచారకరం. తొలుతనెయ్యి స్వచ్ఛతను పరీక్షించడానికి ఎఫ్.ఎస్.ఎస్.ఏ.ఐసూచించిన 'సిటోస్టెరాల్'పరీక్షావిధానాన్ని అమలు చేయాలని అధికారులు భావించినప్పటికీ, ఆ తర్వాత ఆ నిర్ణయాన్నివెనక్కి తీసుకోవడం అనుమానాలకు దారితీసింది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ఇంటర్ విలీనం వద్దు

ప్రస్తుతం ఉన్న ఇంటర్ విద్యను పాఠశాల విద్యలో కలపాలని ఆలోచన సరికాదు. గతంలో 7వ తరగతికి బోర్డు ఎక్జామ్ ఉండేది. ప్రస్తుతం దానిని రద్దుచేసి 10వ తరగతిని బోర్డు ఎగ్జామ్ కొనసాగుతుంది. ఇంటర్ విద్య పాఠశాల విద్యలో కలపడం వలన పోటీ తత్వం తగ్గుతుంది. ఇంటర్మీడియట్ విద్యార్థతతో ఉద్యోగ పోటీ పరీక్షలు రాసేవారు ఆసక్తి లేకుండా ఉంటారు. జూనియర్ లెక్చరర్‌గాఎన్నికైన వారు నిరుత్సాహం పడతారు.

-రాపాక రవీందర్, జనగాం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఫీజుల దోపిడీకి కళ్లెం ఇంకెప్పుడు?

ప్రజలకు నాణ్యమైన ఉచిత విద్య అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. కానీ విద్యా రంగంపై నియంత్రణ కోల్పోయిన పాలకులు దానిని కార్పొరేట్ శక్తుల చేతుల్లో వ్యాపార వస్తువుగా మారనిచ్చారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఉచిత పథకాలపై చూపుతున్న శ్రద్ధ విద్య, వైద్యం వంటి ప్రాథమిక రంగాలపై కనిపించడం లేదు. ఉచిత, నాణ్యమైన విద్య కోసం ప్రజల్లో మరో చైతన్య పోరాటం రావాల్సిన అవసరం ఉంది. విద్యారంగం లోని ఈ వ్యాపారీకరణ, కార్పొరేటీకరణకు అడ్డుకట్ట వేయాలంటే ప్రభుత్వాలే పూర్తి బాధ్యత తీసుకోవాలి. విద్యను పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొచ్చి అందరికీ సమాన అవకాశాలు కల్పించినప్పుడే ఆర్థిక, సామాజిక, రాజకీయ సమానత్వం సాధ్యమవుతుంది. అదే నిజమైన ప్రజాస్వామ్యానికి బలమైన పునాది.



మేకిరి దామోదరం

భారతదేశంలోని ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్ మాత్రమే కాదు పలు ద్వితీయ శ్రేణి నగరాల్లోనూ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఫీజులు తల్లిదండ్రులకు షాక్‌కు గురిచేస్తున్నాయి. అగ్రశ్రేణి స్కూళ్లని చెప్పుకునే కొన్ని విద్యాసంస్థలు విద్యార్థుల నుంచి ఏడాదికి లక్షలల్లో ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఈ భారీ ఫీజులను చూసి తల్లిదండ్రులు, మేధావులు, విద్యావేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమెరికాలోని ఐవీ లీగ్ అండర్‌గ్రాడ్యుయేట్ ట్యూషన్ ఫీజులు లేదా యూరప్‌లోని ఇంటర్నేషనల్ బోర్డింగ్ స్కూళ్ల ఫీజులకు సమానంగా ఇక్కడ ఫీజులు ఉండటం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. భారతదేశంలో విద్య క్రమంగా వ్యాపార వస్తువుగా మారిపోతోంది. కార్పొరేట్ శక్తుల ప్రవేశంతో విద్యారంగంలో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. పలు బడా ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల భారం తల్లిదండ్రుల నడ్డి విరుస్తోంది. చాలామంది తల్లిదండ్రులు తమ వార్షిక ఆదాయానికి మించి పిల్లల చదువుల కోసం ఖర్చు చేస్తున్నారు. ప్రపంచంలోని సింగపూర్, దుబాయ్, న్యూయార్క్ వంటి నగరాల్లో ఉన్న స్కూల్ ఫీజులతో సమానంగా భారత దేశంలో ఫీజులు వసూలు చేస్తున్నా అందుకు తగ్గట్టుగా భారతీయ తల్లిదండ్రుల ఆదాయాలు మాత్రం లేవు. అంతేగాక, లక్షల్లో ఫీజులు చెల్లిస్తున్న పిల్లలకు అందుకు తగిన విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు కూడా అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రైవేట్ పాఠశాలలపై కఠిన నియంత్రణ ఉండాలని విద్యావేత్తలు, నిపుణులు సూచిస్తున్నప్పటికీ ప్రభుత్వాలు మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి. అంతర్జాతీయ స్థాయి ఫీజులు భరించే ఆర్థిక స్థోమత భారతీయ కుటుంబాలకు లేకపోయినా ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి వారిని ఆ దిశగా నెట్టేస్తోంది. విద్యను వ్యాపారంగా మార్చిన కార్పొరేట్ శక్తులు, వాటిని నియంత్రించడంలో విఫలమవుతున్న ప్రభుత్వాలే ఈ పరిస్థితికి ప్రధాన కారణమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భారతదేశంలో చాలామంది తల్లిదండ్రులు తమ వార్షిక ఆదాయంలో 50శాతం నుంచి 130 శాతం వరకు పిల్లల స్కూల్ విద్య కోసం ఖర్చు చేస్తున్నారనే అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. అంటే కొన్ని సందర్భాల్లో వార్షిక ఆదాయం కంటే ఎక్కువ మొత్తాన్ని విద్య కోసం వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మన దేశంలో అంతర్జాతీయ ప్రమాణాల పేరుతో భారీ ఫీజులు వసూలు చేస్తున్న అనేక స్కూళ్లలో మౌలిక వసతులు మాత్రం ఆశించిన స్థాయిలో ఉండటం లేదు. ఒక తరగతి గదిలో సగటున 35 నుంచి 40 మంది విద్యార్థులు కూర్చోవాల్సి వస్తోంది. స్విమ్మింగ్ పూల్స్, ల్యాబ్‌లు, ఆడిటోరియంలు ఉన్నప్పటికీ వాటిని పరిమితికి





మించి విద్యార్థులు వినియోగించాల్సిన పరిస్థితి నెలకొంది. అంతర్జాతీయ ప్రమాణాల విద్య అని ప్రచారం చేస్తున్నా.. ఉపాధ్యాయుల శిక్షణ, బోధనా విధానాలు అందుకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. అదే విదేశాల్లోని అనేక ఇంటర్నేషనల్ స్కూళ్లలో ఒక తరగతి గదిలో 15నుంచి 20 మంది విద్యార్థులు మాత్రమే ఉంటారు. ఫీజులకు తగినట్టుగా సదుపాయాలు, వ్యక్తిగత శ్రద్ధ, నాణ్యమైన విద్య అక్కడ విద్యార్థులకు అందుతుంది. రాష్ట్రంలోనూ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఇష్టారాజ్యంగా ఫీజులను పెంచకుండా నియంత్రిస్తామనే మాటలు సంవత్సరాలుగా వినిపిస్తున్నా అవి ఆచరణలోకి రావడం లేదు. మరో విద్యాసంవత్సరం ప్రారంభానికి సమయం దగ్గరపడుతున్నప్పటికీ, ఫీజుల నియంత్రణపై స్పష్టమైన చర్యలు కనిపించకపోవడంతో తల్లిదండ్రుల గుండెల్లో ఆందోళన పెరుగుతోంది. గత కొన్నేళ్లుగా ఫీజుల నియంత్రణ కోసం కమిటీలు ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నా చట్టపరమైన చర్యల విషయంలో మాత్రం చిత్తశుద్ధి కనిపించడం లేదు. దేశంలోని అనేక నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లోనే స్కూల్ ఫీజులు అధికంగా ఉన్నాయని కొన్నిఅధ్యయనాలు పేర్కొంటున్నాయి. రాష్ట్రంలోని కొన్ని కార్పొరేట్ పాఠశాలలు ఇంజినీరింగ్ విద్యకు సమానంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. నియంత్రణ లేకపోవడంతో కొన్ని చోట్ల ప్రతి ఏడాది 20నుంచి 30 శాతం వరకు ఫీజులు పెంచుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పిస్తామని హైకోర్టులో అంగీకరించిన రాష్ట్ర ప్రభుత్వం వాటి అమలులో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలుఉన్నాయి. విద్యా హక్కు చట్టం-2009లోని సెక్షన్ 12(1)(సి) ప్రకారం అన్‌ఎయిడెడ్ ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు 25శాతం సీట్లను బలహీన వర్గాలు, అనాథలు, ఎయిడ్స్ బాధిత కుటుంబాల పిల్లలకు కేటాయించాలి. ఇందుకు అయ్యే ఖర్చును ప్రభుత్వం తిరిగి చెల్లించవచ్చు. దేశంలోని పలు రాష్ట్రాలు ఇప్పటికే ఈ నిబంధననుఅమలు చేస్తున్నప్పటికీ మన రాష్ట్రంలో మాత్రం సవరణల పేరుతో అమలు నిర్లక్ష్యానికి గురవుతోంది. ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యను కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు సమిష్టి బాధ్యతగా రాజ్యాంగంలో పొందుపరిచాయి. ప్రజలకు నాణ్యమైన ఉచిత విద్య అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. కానీ విద్యా రంగంపై నియంత్రణ కోల్పోయిన పాలకులు దానిని కార్పొరేట్ శక్తుల చేతుల్లో వ్యాపార వస్తువుగా మారనిచ్చారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఉచిత పథకాలపై చూపుతున్న శ్రద్ధ విద్య, వైద్యం వంటి ప్రాథమిక రంగాలపై కనిపించడం లేదు. ఉచిత, నాణ్యమైన విద్య కోసం ప్రజల్లో మరో చైతన్య పోరాటం రావాల్సిన అవసరం ఉంది. విద్యారంగంలోని ఈ వ్యాపారీకరణ, కార్పొరేటీకరణకు అడ్డుకట్ట వేయాలంటే ప్రభుత్వాలే పూర్తి బాధ్యత తీసుకోవాలి. విద్యను పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొచ్చి అందరికీ సమాన అవకాశాలు కల్పించినప్పుడే ఆర్థిక, సామాజిక, రాజకీయ సమానత్వం సాధ్యమవుతుంది. అదే నిజమైన ప్రజాస్వామ్యానికి బలమైన పునాది. ●

# లోపాలను తొలగిస్తేనే మూడో డిస్కమ్ సక్సెస్

గువ్వల పవన్ కుమార్

తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జి.ఒ.ఎమ్ఎస్.నం.44 ప్రకారం మూడో డిస్కమ్ ఏర్పాటు నిర్ణయం విద్యుత్ రంగంలో ఆర్థిక స్థిరత్వాన్ని పెంచడం, ముఖ్యంగా వ్యవసాయం, లిఫ్ట్ ఇరిగేషన్, మిషన్ భగీరథ వంటి సబ్సిడీ వినియోగదారులకు సేవలను అందించడం అనే లక్ష్యంతో తీసుకోబడింది. ప్రస్తుతం రాష్ట్రంలో టిజిఎస్‌పిడిసిఎల్ 15జిల్లాలు, టిజిఎన్‌పిడిసిఎల్ 18 జిల్లాలకు సేవలు అందిస్తుండగా, కొత్త డిస్కమ్‌కు సుమారు 29 లక్షలకుపైగా కనెక్షన్లు బదిలీ చేయాలని ప్రభుత్వ ఉత్తర్వులు సూచిస్తున్నాయి. ఈ పరిమాణంలో సంస్థాగత మార్పు తీసుకురావడం చిన్న విషయం కాదు. అందుకే ప్రభుత్వం స్పష్టంగా విధానపరమైన మార్గదర్శకాలను అమలు చేయాలని, సంబంధిత వర్గాలతో చర్చలు జరిపి సందేహాలను నివృత్తి చేయాలని సూచించింది. అయితే ఈ కీలక దశలో ఉన్నతాధికారులు అనుసరిస్తున్న విధానం బాధాకరం. ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలలో ముఖ్యంగా ఉద్యోగుల వ్యవహారాల్లో స్పష్టత, పారదర్శకత అవసరమని పరోక్షంగా వెల్లడైంది. మూడో డిస్కమ్‌కు సుమారు 2,000 మంది సిబ్బంది అవసరమని అంచనా వేసి, వారిని ప్రస్తుత సంస్థల నుంచి బదిలీ చేయాలని ప్రణాళికలో పేర్కొనబడింది. కానీ అదే సమయంలో ఖాళీ అయ్యే పోస్టులను తొలగించాలనే నిబంధనను ఉన్నతాధికారులు ఒక సాధనంగా ఉపయోగించుకుంటూ, మాతృ సంస్థల కేడర్ నిర్మాణాన్ని క్రమంగా తగ్గించే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇది సంస్కరణ కంటే సంస్థల బలహీనతకు దారి తీసే చర్యగా కనిపిస్తోంది. ప్రత్యేకంగా గమనించాల్సిన అంశం ఏమిటంటే, కొత్త డిస్కమ్ ఏర్పాటు కోసం అవసరమైన పోస్టులను ప్రభుత్వం నుంచి కొత్తగా మంజూరు చేయించుకోవచ్చు. అలాంటి చర్య తీసుకుంటే ప్రస్తుత విద్యుత్



సంస్థలపై ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండదు. కానీ ప్రస్తుత పరిస్థితిలో ఉన్నతాధికారులు అనుసరిస్తున్న విధానం వేరే దిశలో ఉంది. ఇప్పటికే ఉన్న పోస్టులను మళ్లించడం, ఉద్యోగులను ఆకర్షించడానికి ప్రమోషన్లు ఆఫర్ చేయడం వంటిచర్యలు తక్షణంగా సిబ్బంది కొరతను తీర్చినప్పటికీ, చట్టపరమైన సంక్లిష్టతలను సృష్టించే ప్రమాదం ఉంది. ముఖ్యంగా సేవా నియమావళి, కేడర్ నిష్పత్తులు, సీనియారిటీ వంటి అంశాలు పూర్తిగా పక్కన పడుతున్నాయి. ఇందులో అత్యంత ఆందోళనకరమైన విషయం మాతృ సంస్థలలో పోస్టుల రద్దు. ఒకసారి పోస్టులను రద్దు చేస్తే, ఆ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల ప్రమోషన్ అవకాశాలు మూసుకుపోతాయి. ఇది ఉద్యోగులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇప్పటికే ఉన్న ప్రమోషన్ నిష్పత్తులు, నియమాలు దెబ్బతినడంతో వారి కెరీర్ పురోగతి నిలిచిపోయే ప్రమాదం ఉంది. దీని ప్రభావం ఉద్యోగులపై మాత్రమే కాకుండా, సేవల నాణ్యతపై కూడా పడే అవకాశం ఉంది. ఇక ఉద్యోగ సంఘాల పాత్రను పరిశీలిస్తే, వారు ఈ సంస్కరణకు వ్యతిరేకంగా నిలవడం లేదు. వారి ప్రధాన డిమాండ్ ఒక్కటే న్యాయం జరగాలి, సేవా నియమావళి పాటించాలి. భవిష్యత్తు ప్రమోషన్ అవకాశాలు దెబ్బతినకూడదు. తగిన ప్రమోషన్లు కల్పించి, కేడర్ నిర్మాణాన్ని కాపాడితే, మూడో డిస్కమ్‌కు సేవలు అందించడానికి తాము సిద్ధంగా ఉన్నామని వారు స్పష్టంగా తెలిపారు. అంటే సమస్య సంస్కరణలో కాదు, దాని అమలులో ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఉన్నతాధికారులు తక్షణం స్పందించాల్సిన అవసరం ఉంది. ఉద్యోగ సంఘాలతో సార్థక చర్చలు జరిపి, వారి ఆందోళనలను పరిష్కరించి, కొత్త పోస్టులకు ప్రభుత్వ అనుమతి తీసుకుని, పారదర్శక విధానంతో ముందుకు వెళ్లాలి. లేకపోతే మూడో డిస్కమ్ ఏర్పాటు అనే మంచి ఉద్దేశ్యం, అమలు లోపాల కారణంగా ఉద్యోగుల భవిష్యత్తును దెబ్బతీసే నిర్ణయంగా మారిపోతుంది. సంస్కరణలు విజయవంతం కావాలంటే అవి న్యాయం, నిబంధనలు, విశ్వాసం అనే మూడు సూత్రాలపై నిలవాలి. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు ఈ మూడు సూత్రాలను విస్మరిస్తున్నాయి. ●

# ప్రజల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వాలు!

బొల్లిముంతసాంబశివరావు

నేపాల్లో కేపీశర్మ ఓలీ ప్రజావ్యతిరేక విధానాలు, అవినీతి వెడల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. ఓలీ పాలనలో ఉపాధిలేమి, నిరుద్యోగం వల్ల యువతలో తీవ్ర అసంతృప్తి ఏర్పడింది. ఉపాధిలేమితో సతమతమవుతున్న యువతలో తిరుగుబాటు ఆలోచన మొదలైంది. జెన్జెడ్ పేరుతో కేపీ శర్మ ఓలీ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ యువత ప్రదర్శనలు చేపట్టారు. ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగించినా ప్రదర్శనలు తీవ్రమైనాయి. ప్రభుత్వం ఉద్యమకారులపై జరిపిన కాల్పుల్లో 19మంది మరణించారు. జెన్జెడ్ ఉద్యమకారులకు దేశమౌలిక సమస్యల వెడల అవగాహనలేదు. యువత ఆందోళన ప్రధాని, మంత్రుల ఇళ్లముట్టడి రూపం తీసుకోవడంతో చివరికి ఓలీప్రభుత్వం రాజీనామా చేసింది. ఆ తర్వాత మార్చి5,2026లో జరిగిన ఎన్నికల్లో జెన్జెడ్‌మూమెంట్/ప్రొటెస్ట్ పేరుతో ఎన్నికల్లో పాల్గొన్న యువత విజయం సాధించారు. మార్చి 27న బాలేంద్రషా ప్రధానిగా ప్రభుత్వం ఏర్పడింది. బాలేంద్ర షా ప్రభుత్వం ప్రజల మౌలికసమస్యలను ఎలా పరిష్కరిస్తుందో చెప్పలేదు. మౌలికసమస్యల వెడల ప్రభుత్వానికి అవగాహనలేదని అది తెలియచేస్తున్నది. నేపాల్ ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలు, సాగు భూమి, ఉపాధి, నిరుద్యోగం, పేదరికం. ఈసమస్యలు పరిష్కారం కాకుండా దేశాభివృద్ధి ముందుకుసాగదు. నేపాల్ వ్యవసాయిక దేశం. దేశంలోని 62శాతం కుటుంబాలు, వ్యవసాయంపై ఆధారపడి ఉన్నాయి. 2021- 22 లెక్కల ప్రకారం దేశ జనాభాలో 77శాతం వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు. వ్యవసాయ గణాంకాల ప్రకారం సుమారు 2.89 మిలియన్ల రైతు కుటుంబాలు 12 లక్షల హెక్టార్ల భూమికి సాగునీటి సౌకర్యం పొందారు. సాగు నీరు అందే భూమి చాలాతక్కువ. జలవనరులు అపారంగా ఉన్నా అత్యధిక భూములకు నీటిసౌకర్యం లేకపోవడానికి కారణం ప్రాజెక్టుల నిర్మాణం చేయకపోవడమే. నేపాల్ సగటు కుటుంబ భూమి విస్తీర్ణం 0.54హెక్టార్లు. పెద్ద రైతుల వద్ద5 హెక్టార్ల పైగా ఉంది. అసలు భూమి లేని కుటుంబాల సంఖ్య 12,13,812గా తాజా కమిషన్ నివేదిక డేటా తెలియచేస్తున్నది. భూకేంద్రీకరణ పెద్దఎత్తున లేకపోయినా, నేపాల్ భౌగోళిక పరిస్థితుల్లో అది ఎక్కువగానే గుర్తించాలి. భూమి వ్యత్యాసాలు సామాజిక, ఆర్థిక అసమానతలకు దారితీసింది. ప్రభుత్వాల భూసంస్కరణల చట్టాలు, ఆచరణలో అమలు జరగలేదు. భూసమస్య నేపాల్ ప్రజల ముఖ్యమైన మౌలిక సమస్యగా నేటికీ ఉంది. ఇది పరిష్కారం కావాలి. నేపాల్ ప్రజలు తీవ్రమైన ఉపాధిలేమి సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఈ సమస్య యువతను వెంటాడుతోంది. 2025-26 సంవత్సరాల్లో నిరుద్యోగరేటు 20శాతం కన్నా ఎక్కువగా ఉంది. దేశ జనాభాలో79శాతం ప్రజలు గ్రామీణ ప్రాంతంలో నివసిస్తున్నారు. వీరిలో నిరుద్యోగం 24.66శాతంగాఉంది. దేశంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేకపోవడం వల్ల ప్రతిరోజు వేలాది మంది యువత గల్ఫ్ దేశాలకు, మలేసియా, భారతదేశాలకు వలసలుపోతున్నారు. నేపాల్ ఆర్థికవ్యవస్థకు వలస ప్రజలు పంపే డబ్బులు, ఆ దేశ జీడీపీలో 1/3ఉందంటే వలసల తీవ్రత తెలుపుతున్నది. వలసవెళ్లిన వారు అనధికార లేదా అసంఘటిత



రంగంలో పనిచేస్తూ శ్రమదోపిడీకి గురౌతున్నారు. విద్యా వ్యవస్థకు, పరిశ్రమల అవసరాలకు మధ్య సమన్వయం లేకపోవడం వల్ల చాలామంది పట్టభద్రులు ఉద్యోగాలు పొందలేకపోతున్నారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక యువత నిరాశ, నిస్పృహలోజీవిస్తున్నారు. నేపాల్లో పేద, ధనిక వ్యత్యాసాలు తీవ్రంగా ఉన్నాయి. దేశజనాభాలో 10శాతంగా ఉన్న ధనిక కుటుంబాలు జాతీయసంపదలో 39.1శాతం సంపద కలిగి ఉంటే, దిగువ అత్యల్పంగాఉన్న 10శాతం ప్రజలవద్ద 2.6సంపద మాత్రమే ఉంది. ఇది ఆ దేశంలో ఆర్థికవ్యత్యాసాలకు అద్దంపడుతున్నది. పేదరిక తీవ్రతను తెలియచేస్తున్నది. ఈదేశంలో అపారంగా సహజవనరులు న్నాయి. ఇనుప ఖనిజం, రాగి, జింక్, కోబాల్టురియు బంగారం లాంటి లోహాలున్నాయి. ఇవికాకుండా సున్నపురాయి, మాగ్నసైట్, మార్బుల్, గార్నెట్మరియులూర్మాలిన్, క్వార్ట్జ్ మొదలైన రత్నాల నిల్వలున్నాయి. వీటిని దేశప్రయోజనాలకు ఉపయోగించే విధానాలు అమలు జరపడంలో దేశ పాలకులు విఫలం అయ్యారు. అంతేకాకుండా ఖనిజసంపద మైనింగ్ రంగాన్ని ప్రైవేటీకరించడం అనేది ఆ దేశ ఆర్థిక సంస్కరణల్లో అనేక మార్పులు తెచ్చింది. ప్రపంచవ్యాప్తంగా ఆర్థికసరళీకరణ విధానాల్లో భాగంగా, నేపాల్లో కూడా పాలకులు ఆ విధానాలు అమలు జరిపారు. 1990ల నుండి ప్రభుత్వరంగ సంస్థలను, ప్రైవేట్ రంగానికి అప్పగించడం ప్రారంభం అయింది. నేపాల్లోని అన్ని ఖనిజవనరులు ప్రభుత్వ యాజమాన్యంలోనే ఉన్నా, ప్రైవేట్ కంపెనీలకు ఖనిజాలను వెలికితీసే హక్కును (లైసెన్సు) ప్రభుత్వాలు కల్పించాయి. అందుకోసం మైనింగ్ నియంత్రణ 1985నాటి గనుల చట్టం1999నాటి గనుల, ఖనిజాల నియమాల ద్వారా జరుగుతున్నది. ప్రభుత్వరంగసంస్థలను ప్రైవేటీకరణ ప్రక్రియ చేపట్టింది. 2025-26 సంవత్సరం నాటికి సుమారు 40 ట్రిలియన్ నేపాలీ రూపాయల విలువైన రాయి, ఇతర ఖనిజ నిక్షేపాలు దేశం కలిగి ఉంది. నేపాల్ ఆర్థికవ్యవస్థలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల, విదేశీ కంపెనీల ప్రభావం పెరుగుతూ ఉంది. విదేశీపెట్టుబడుల్లో 59.7శాతం పారిశ్రామికరంగంలో ఉంటే, 30శాతం జలవిద్యుత్ ప్రాజెక్టుల్లో, 29.4శాతం తయారీ రంగంలో ఉన్నాయి. నేపాల్లో 58దేశాలు పెట్టుబడులు పెడుతున్నాయి. ముఖ్యంగా భారతదేశం, చైనా, యూరప్ దేశాలనుంచి పెట్టుబడులు ఎక్కువగా ఉన్నాయి. పెట్టుబడులకోసం నేపాల్ పాలకులు 100శాతం విదేశీ యాజమాన్యానికి అనుమతి ఇస్తున్నారు. వచ్చే లాభాలను ఎటువంటి ట్యాక్సులు లేకుండా వారి స్వదేశాలకు తరలించుకుపోయే అవకాశం కల్పించింది. ఆవిధంగా నేపాల్ పాలకులు విదేశీ పెట్టుబడి దారుల ప్రయోజనాలను కాపాడుతూ వస్తున్నారు. ఫలితంగా విదేశీపెట్టుబడిదారుల ఆధిపత్యం నేపాల్లో కొనసాగుతూ ఉంది. డెన్మార్క్, యూరోపియన్యూనియన్, చైనా వంటి దేశాల బహుళజాతి సంస్థలు నేపాల్ సహజవనరుల పట్ల దశాబ్దాలుగా కన్నువేశాయి. అనేక అంతర్జాతీయబ్రాండ్లు నేపాల్లో పనిచేస్తున్నాయి. వీటి స్థానిక విభాగాలను నేపాల్ వ్యాపారవేత్తలు లేదా మేనేజింగ్ డైరెక్టర్లు నిర్వహిస్తారు. ఈ సంస్థలు నేపాల్లో వ్యాపారాలు చేస్తూ లాభాలు తరలించుకుపోతున్నాయి. అవినీతి రూపుమాపడం గురించి మాత్రమే మాట్లాడుతూ, ఆ అవినీతిలోనే బాలేంద్రషాప్రభుత్వం కూరుకుపోతున్నది. అవినీతి ఆరోపణలతో పోలీసుతోసహా ఇద్దరు మంత్రులు పదవుల నుంచి వైదొలిగారు. ప్రజాసమస్యలను ప్రభుత్వం గాలికి వదిలేసింది. నెలాపదిరోజుల్లోనే ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత ఏర్పడింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రదర్శనలు ప్రారంభం అయ్యాయి. ప్రజాసమస్యలు పట్టని బాలేంద్రషా ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీల నాయకులపైకేసులు బనాయిస్తున్నది. సోషలిస్టు ఆర్థికవిధానాలు, వర్గదృక్పథం లేని ఏ ఉద్యమం, ఏప్రభుత్వం వల్ల ఏ దేశంలో కూడా ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం కావు. ●

# ఎన్డీయే పక్షనేతగా హిమంత



## అధికారికంగా ప్రకటించిన జెపి నడ్డా

## గవర్నర్‌తో భేటీ, రేపే ప్రమాణం

**గువహటి, మే 10:** అసోంలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం మూడోసారి కొలువుదీర నుంది. హిమంత బిశ్వ శర్మ వరుసగా రెండోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు. అధికార వర్గాల సమాచారం ప్రకారం మే 12న అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆదివారం గువ హటిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వ హించిన బిజెపి ఎమ్మెల్యేలు, ఎన్‌డియే నేతల సమావేశంలో బిజెపి శాసనసభా పక్ష నేతగా, ఎన్‌డియే కూటమి నేతగా హిమంత బిశ్వ శర్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ విషయాన్ని బిజెపి మాజీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జెపి నడ్డా అధికారికంగా ప్రకటించారు. అసోంలో ఎన్‌డియే శాసనసభ పక్ష నేత ఎన్నిక కోసం బిజెపి అధిష్ఠానం కేంద్ర పరిశీలకులుగా నియమించిన కేంద్ర మంత్రి జెపి నడ్డా, హర్యానా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీలు ఆధ్వర్యంలోనే ఈ తంతు ముగిసింది.

కూటమి శాసనసభ పక్ష నేతగా ఎన్నికైన తర్వాత, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ కాబోయే ముఖ్య మంత్రి హిమంత బిశ్వ శర్మ అసోం గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్యను కలిశారు. రాజ్‌భవన్ సందర్శన సమయంలో, అసోం బిజెపి అధ్యక్షుడు దిలీప్ సైకియా, ఆర్థిక మంత్రి అజంతా నేగ్‌తో సహా పలువురు సీనియర్ బిజెపి నాయకులు, ఇతర పార్టీ కార్యకర్తలు శర్మ వెంట ఉన్నారు. అసోంలోని ఎన్‌డియే కూటమిలో కీలక భాగ స్వామ్య పక్షమైన 'అసోం గణపరిషత్' అధ్యక్షుడు, అసోం మంత్రి అయిన అతుల్ బోరా కూడా గవర్నర్‌తో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. కొత్త అసోం ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమం మే 12న గువహటిలోని ఖానాపరా వెటర్నరీ కళాశాల మైదానంలో జరగనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, దేశవ్యాప్తంగా బిజెపి పాలిత రాష్ట్రాల ముఖ్య మంత్రులు ఈ భారీ వేడుకకు హాజరవుతారని భావిస్తున్నారు. ఈశాన్య భారతదేశంలో బిజెపి తన రాజకీయ బలాన్ని ప్రదర్శించే వేదికగా భావిస్తున్న ఈ కార్యక్రమానికి పలువురు కేంద్ర మంత్రులు, అసోంలోని వివిధ ప్రాంతాల నుండి సీనియర్ ఎన్‌డియే నాయకులు, పార్టీ కార్యకర్తలు కూడా పాల్గొనే అవకాశం ఉంది.



# ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ముగిస్తాం..

## కీలక దశకు చర్చలు:పుతిన్

**మాస్కో, మే 10:** నాలుగేళ్ల క్రితం ప్రారంభమైన రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ముగింపు దశకు చేరుకున్నట్లు కనిపిస్తోంది. త్వరలోనే ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగిస్తామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించారు. శనివారం రష్యాలోని మాస్కోలో జరిగిన విక్టరీ డే సెలబ్రేషన్స్‌లో పుతిన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్ యుద్ధంపై కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే ఉక్రెయిన్ యుద్ధం ముగిసే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉక్రెయిన్‌తో శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ యుద్ధం ముగించేందుకు యురోపియన్ యూనియన్‌తో కూడ చర్చలు జరుపుతానని పుతిన్ వెల్లడించారు. ఇయు అండతోనే ఉక్రెయిన్.. రష్యాపై యుద్ధం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా యురోపియన్ యూనియన్ (ఇయు)తో చర్చల కోసం జర్మనీ మాజీ ఛాన్స్‌లర్ గెర్హార్డ్ ష్రోడెర్ పేరును పుతిన్ సూచించారు. ఈ చర్చల ద్వారా ఇయుతో రక్షణ ఒప్పందం కుదుర్చుకుంటామన్నారు. ఇటీవలే అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో కూడా పుతిన్ చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఉక్రయిన్‌తో కాల్పుల ఒప్పందానికి అంగీకరించారు. అలాగే, రెండు దేశాల మధ్య 1,000 మంది సైనిక ఖైదీల అప్పగింతకు కూడా అంగీకరించారు. యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా, ఉక్రెయిన్ మధ్య కుదిరిన కీలక ఒప్పందం ఇది. ఈ యుద్ధం 2022, ఫిబ్రవరిలో ప్రారంభమైంది. నాలుగేళ్లుగా ఇంకా యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఈ యుద్ధంలో రష్యాకు ఉత్తర కొరియా సైన్యం కూడా సహకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. తాజాగా మాస్కోలో జరిగిన విక్టరీ పెరేడ్‌లో కొరియా సైనికులు కూడా పాల్గొనడం ఈ ప్రచారానికి బలం చేకూర్చింది.

# వెన్నంటి నడిచిన కేబినెట్ మంత్రులు

## విజయ్‌తోపాటు తొమ్మిది మంది ప్రమాణ స్వీకారం




**చెన్నై,మే 10:** దశాబ్దాల ద్రవిడ పార్టీల ఆధిపత్యం తర్వాత తమిళనాడు రాజకీయాల్లో ఒక కొత్త శకానికి పునాదులు పడ్డాయి. నటన నుంచి రాజకీయాల్లోకి వచ్చిన విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కజగం టీవీకే కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతోపాటు వెనువెంటనే తొమ్మిది మంది మంత్రులుగా ప్రమాణంచేసారు. వీరంతా విజయ్‌కు ఆదినుంచి వెన్నంటి నడిచినవారే కావడం విశేషం. ఆదివారం ఉదయం చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో కాంగ్రెస్‌నేత రాహుల్ గాంధీ సమక్షంలో విజయ్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మరో 9 మంది టీవీకే ఎమ్మెల్యేలు కూడా మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. విజయ్ పార్టీని ప్రారంభించక ముందే ఆయన అభిమాన సంఘాల సమాఖ్యకు అధ్యక్షుడిగా ఆనంద్ వ్యవహరించారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నైలోని త్యాగరాయనగర్ నియోజకవర్గం నుంచి ఆనంద్ పోటీ చేశారు. డీఎంకే అభ్యర్థి రాజా అన్బళగన్‌ను ఆయన ఓడించారు. 6 అడుగుల 7 అంగుళాల ఎత్తుతో ఆకట్టుకునే మాజీ జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు ఆధవ్ అర్జున. తమిళనాడుకు చెందిన రాజకీయ వ్యూహకర్త. విల్లివాక్కం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీవీకే అభ్యర్థిగా ఆధవ్ అర్జున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. విజయ్ కేబినెట్‌లో ఏకైక మహిళా మంత్రిగా కీర్తన ఎంపికయ్యారు. తమిళనాడులోని బాణసంచా పరిశ్రమకు కేంద్రమైన శివకాశి నియోజకవర్గం నుంచి టీవీకే అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. టీవీకేలో కీలక నేత డాక్టర్ టీకే ప్రభు దంత వైద్యుడు. కారైకుడి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. విజయ్ తొలి కేబినెట్‌లో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అన్నాడీఎంకేలో అత్యంత సీనియర్ నేత కేఏ సెంగోట్టయ్యన్ ఐదు దశాబ్దాల అనుబంధం తర్వాత గత సంవత్సరం ఆ పార్టీ నుంచి బహిష్కరణకు గురయ్యారు. విజయ్ పార్టీలో చేరి తమిళనాడులో రాజకీయ ప్రకంపనలు సృష్టించారు. న్యాయవాది అయిన పి వెంకటరమణన్ చెన్నైలోని కీలకమైన మైలాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీవీకే ఎమ్మెల్యేగా గెలుపొందారు. టీవీకే కోశాధికారిగా ఆయన వ్యవహరిస్తున్నారు టీవీకే ఐటీ, సోషల్ మీడియా శాఖ డిప్యూటీ జనరల్ సెక్రటరీగా నిర్మల్ కుమార్ మదురైలోని తిరుప్పరన్‌కుండ్రం నియోజకవర్గం నుంచి ఎన్నికల్లో పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. నటుడు, స్టాండ్‌అప్ కమెడియన్, ప్రేరణాత్మక వక్తగా బహుముఖ పాత్రలు పోషించిన రాజమోహన్ అరుణ్మొగం చెన్నైలోని ఎగ్మోర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి టీవీకే ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

విజయ్ తొలి కేబినెట్‌లో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

## బాధ్యతలు స్వీకరించిన వెంటనే కీలకమార్పులు




తమిళనాడు నూతన ముఖ్యమంత్రిగా, తమిళగ వెట్రి కళగం టీవీకే అధ్యక్షుడు విజయ్ ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించిన గంటల వ్యవధిలోనే ఆయన తన కార్యాలయం సీఎంఓలో కీలక నియామకాలు చేపట్టారు. ఇద్దరు సీనియర్ ఐఏఎస్ అధికారులను తన సహాయకులుగా నియమిస్తూ తొలి ఉత్తర్వులపై సంతకాలు చేశారు. ఆరోగ్యశాఖ కార్యదర్శిగా పనిచేసిన సీనియర్ ఐఏఎస్ అధికారి పి.సెంథిల్ కుమార్‌ను ముఖ్యమంత్రికి ప్రధాన కార్యదర్శి స్పెషల్ సెక్రటరీ1గా నియమించారు. అదేవిధంగా, ఆది ద్రావిడ సంక్షేమ శాఖ కార్యదర్శిగా ఉన్న జి.లక్ష్మీ ప్రియను ముఖ్యమంత్రికి రెండో ప్రత్యేక కార్యదర్శి స్పెషల్ సెక్రటరీ2గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలోనే మూడో ప్రత్యేక కార్యదర్శి నియామకం కూడా ఉంటుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. సాధారణంగా తమిళనాడు ముఖ్యమంత్రి కార్యాలయంలో ముగ్గురు ప్రత్యేక కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తారు. అంతకు ముందు, జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం విజయ్ నేరుగా సచివాలయానికి చేరుకున్నారు. అక్కడ పోలీసులు ఆయనకు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి ఛాంబర్‌లోకి ప్రవేశించిన ఆయన, తొలిసారిగా సీఎం కుర్చీలో కూర్చునే ముందు కాస్త భావోద్వేగానికి గురయ్యారు. ఆ సమయంలో సీనియర్ మంత్రి కె.ఏ. సెంగోట్టయ్యన్ ఆయనను ప్రోత్సహించడంతో, విజయ్ చిరునవ్వుతో తన కుర్చీలో ఆసీనులయ్యారు. అసెంబ్లీ కార్యదర్శి శ్రీనివాసన్‌తో పాటు పలువురు సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు నూతన ముఖ్యమంత్రిని కలిసి అభినందనలు తెలిపారు. ఈ నియామకాలను గత డీఎంకే ప్రభుత్వం నుంచి పరిపాలన మార్పులో భాగంగా చూస్తున్నారు. స్టాలిన్ హయాంలో ఉదయచంద్రన్, షణ్ముగం, అను జార్జ్ వంటి అధికారులు సీఎంఓలో పనిచేసిన విషయం తెలిసిందే.



# యోగి కేబినెట్‌లోకి మరో ఆరుగురు

## రానున్న ఎన్నికల నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణ

**లక్నో, మే 10:** ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తన మంత్రివర్గాన్ని విస్తరించారు. కొత్తగా ఆరుగురికి అవకాశం కల్పించారు. ఆదివారం లోక్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ ఆనందీబెన్ పటేల్ ఆ ఆరుగురితో మంత్రులుగా ప్రమాణస్వీకారం చేయించారు. కొత్తగా మంత్రివర్గంలోకి చేరిన వారిలో భూపేంద్ర చౌదరి, మనోజ్ పాండే, కృష్ణ పాశ్వాన్, కైలాష్ సింగ్ రాజ్‌పుత్, హన్స్‌రాజ్ విశ్వకర్మ, సురేంద్ర దిలేర్ ఉన్నారు. ఈ కీలకమైన విస్తరణలో, భూపేంద్ర చౌదరి, మనోజ్ పాండే క్యాబినెట్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. అదే సమయంలో, కృష్ణ పాశ్వాన్, కైలాష్ సింగ్ రాజ్‌పుత్, హన్స్‌రాజ్ విశ్వకర్మ, సురేంద్ర దిలేర్ సహాయ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. తన బృందాన్ని విస్తరించడంతో పాటు, ముఖ్య మంత్రి యోగి అజిత్ సింగ్ పాల్, సోమేంద్ర తోమర్‌లను స్వతంత్ర బాధ్యతలతో కూడిన సహాయ మంత్రులుగా పదోన్నతి కల్పించారు. వచ్చే ఏడాది ప్రారంభంలో రాష్ట్రంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ముందు మంత్రి వర్గాన్ని విస్తరించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

**అఖిలేష్ సెటైర్లు:** యోగి ఆదిత్యనాథ్ మంత్రివర్గ విస్తరణపై సమాజ్‌వాదీ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ ఇది కేవలం 'కాలక్షేపం' చేయడానికి చేసే వ్యాయామం అని సెటైర్లు వేశారు. బిజెపిలో ముఖ్యమంత్రి పాత్ర కేవలం 'చీటీలు చదవడం' వరకే పరిమితమైందని వ్యాఖ్యానిస్తూ, ఆయన పార్టీ నాయకత్వ శైలిని కూడా విమర్శించారు.

# వీళ్లూ ఓ తల్లి కన్నబిడ్డలే..

## శ్వేతసౌధం మహిళా ప్రతినిధికి ఇరాన్ సందేశం



**వాషింగ్టన్, మే 10:** వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ ఇటీవల ఓ పండంటి బిడ్డకు జన్మనిచ్చారు. ఈ విషయాన్ని ఆమె సోషల్ మీడియా వేదికగా పంచుకొని ఆనందం వ్యక్తం చేశారు. చిన్నారికి వివియానా అని పేరు పెట్టినట్లు వెల్లడించారు. లీవిట్ పోస్ట్‌పై అమెరికాలోని ఇరాన్ ఎంబసీ స్పందిస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపింది. అదే సమయంలో ఫిబ్రవరి 28న మినాబ్‌లోని ఒక పాఠశాలపై అమెరికా చేసిన దాడిలో 160 మందికిపైగా విద్యార్థులు మరణించిన విషయాన్ని గుర్తు చేసింది. 'పిల్లలు అమాయకులు. వారికి ప్రేమించటం తప్ప ఇంకేమీ తెలియదు. మినాబ్‌లోని పాఠశాలలో మీబాస్ హత్య చేసిన పిల్లలు కూడా మీలాంటి తల్లులు నవమాసాలు మోసి కన్నవారే కదా.. మీరు మీ బిడ్డను ముద్దుపెట్టుకునే ముందు ఆ తల్లుల గురించి ఒకసారి ఆలోచించండి' అని ఇరాన్ ఎంబసీ రాసుకొచ్చింది.

ఇరాన్‌పై ఇజ్రాయెల్–అమెరికా తొలిరోజు చేసిన దాడుల్లో మినాబ్ నగరంలోని ఓ ప్రాథమిక పాఠశాలను తోమహాక్ క్షిపణితాకింది. ఈ ఘటనలో 160మందికిపైగా చిన్నారులు, 14మంది టీచర్లు ప్రాణాలు కోల్పోయారు. అనంతరం సామూహిక సమాధులు తవ్వి వారందరినీ ఒకే దగ్గర పూడ్చిపెట్టిన దృశ్యాలను ఇరాన్ అధికారులు సోషల్ మీడియాలో షేర్‌చేశారు. దీనిపై అప్పట్లో కరోలిన్ లీవిట్ మాట్లాడుతూ అమెరికా ఎప్పుడూ పౌరులను లక్ష్యంగా చేసుకోదని అన్నారు. ఈ విషయంపై తమ యుద్ధ విభాగం దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ప్రమాణ స్వీకారోత్సవంలో మెరిసిన త్రిష



**చెన్నై, మే 10:** తమిళనాడు ముఖ్యమంత్రిగా తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత సి. జోసెఫ్ విజయ్ ప్రమాణ స్వీకారం చేస్తున్న వేళ, ప్రముఖ నటి త్రిష కృష్ణన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆదివారం చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. నీలిరంగు కంచి పట్టుచీర, జడలో మల్లెపూలు, వజ్రాలు, కెంపుల నెక్లెస్‌తో సాంప్రదాయబద్ధంగా ముస్తాబై అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ చారిత్రక ఘట్టాన్ని చూసేందుకు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని కార్యక్రమానికి ముందు త్రిష పేర్కొన్నారు. ఆమె వెంట తల్లి ఉమా కృష్ణన్ కూడా ఉన్నారు. ఎన్నికల ఫలితాల రోజు నుంచి త్రిష తన మిత్రుడు విజయ్‌కు మద్దతుగా నిలుస్తున్నారు. ఫలితాల రోజు నాల్గవతేదీ తన పుట్టినరోజున తిరుపతిలో ప్రత్యేక పూజలు చేశారు. విజయ్ పార్టీ ఆధిక్యం ఖరారయ్యాక చెన్నైలోని ఆయన నివాసానికి కూడా వెళ్లారు. అంతకుముందు, పోలింగ్ రోజున గిల్లి సినిమా నేపథ్య సంగీతంతో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టి పరోక్షంగా తన మద్దతు తెలిపారు. మరోవైపు, విజయ్ భార్య సంగీత విడాకుల కోసం పిటిషన్ దాఖలు చేసిన తర్వాత, విజయ్ త్రిష సంబంధంపై ఊహాగానాలు మొదలయ్యాయి. ఈ వార్తలపై ఇద్దరూ మౌనం పాటిస్తున్నప్పటికీ, పలు సందర్భాల్లో కలిసి కనిపించడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడు ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి త్రిష హాజరు కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# తమిళనాట ఏకైక మహిళామంత్రి కీర్తన



**చెన్నై, మే 10:** రాజకీయ వ్యూహకర్త స్థాయి నుంచి పిన్నవయసులోనే టివికెలో చేరి మంత్రిగా ఎదిగిన కీర్తన ఇపుడు అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. దళపతి విజయ్ నేతృత్వంలోని తమి టీవీకే ప్రభుత్వం కొలువుదీరిన వేళ, ఆయన కేబినెట్‌లో సాధించిన 29 ఏళ్ల యువతిగా, ఏకైక మహిళగా కీర్తన రికార్డు సాధించారు. విరుదునగర్ జిల్లాలోని భారత బాణసంచా రాజధానిగా పేరుగాంచిన శివకాశీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. విరుదునగర్ జిల్లాలో 1996లో పుట్టిన కీర్తన, తన ప్రాథమిక విద్యాభ్యాసాన్ని ప్రభుత్వ తమిళ మీడియం పాఠశాలలో పూర్తి చేశారు. ఆ తర్వాత మదురై కామరాజ్ యూనివర్సిటీ అనుబంధ కళాశాల నుంచి బీఎస్సీ మ్యాథమెటిక్స్‌లో పట్టా పొందారు. ఉన్నత చదువులపై ఆసక్తితో పుదుచ్చేరి యూనివర్సిటీలో చేరి 2019లో ఎంఎస్సీ స్టాటిస్టిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. చదువులో చురుగ్గా ఉండే ఆమె, ప్రజా జీవితంపై ఆసక్తితో రాజకీయ వ్యూహరచన రంగంలోకి అడుగుపెట్టారు. ఐప్యాక్ మరియు షోటైమ్ కన్సల్టింగ్ వంటి ప్రఖ్యాత పొలిటికల్ కన్సల్టెన్సీ సంస్థల్లో డిజిటల్ క్యాంపెయిన్ స్ట్రాటజిస్ట్‌గా పనిచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ, పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, తమిళనాట ద్రవిడ మున్నేట్ర కజగం వంటి బలమైన పార్టీల ఎన్నికల వ్యూహరచనలో పాలుపంచుకున్నారు. ఈ అనుభవంతో ముఖ్యమంత్రులు స్టాలిన్, మమతా బెనర్జీ, చంద్రబాబు నాయుడు వంటి నేతల పనితీరును దగ్గర నుంచి గమనించారు. ఈ అనుభవమే పాలన, అధికార యంత్రాంగం, బ్యూరోక్రసీ పనితీరుపై తనకు లోతైన అవగాహన కల్పించిందని ఆమె ఒక సందర్భంలో తెలిపారు.



# విభేదాలున్నా ఇండియా కూటమి చెక్కు చెదరదు: చిదంబరం

**చెన్నై, మే 10:** తమిళనాట రాజకీయాల్లో డిఎంకెను కాదని విజయ్ టివికెకు కాంగ్రెస్ మద్దతివ్వడంతో డిఎంకె ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ తరుణంలో ఇండియా కూటమికి బీటలు తప్పవన్న వాదనలపై కేంద్ర మాజీ మంత్రి చిదంబరం స్పందించారు. రాష్ట్ర స్థాయిలో విభేదాలు తలెత్తినా ఇండియా కూటమికి ఎలాంటి నష్టం వాటిల్లదని చిదంబరం ధీమా వ్యక్తం చేశారు. తన దృష్టిలో ఇండియా కూటమి కొనసాగుతుంది. డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ కూటమికి వ్యతిరేకంగా ఒక్క మాట కూడా మాట్లాడలేదు. కేవలం తమిళనాడులో కాంగ్రెస్‌తో పొత్తు ముగిసిందని మాత్రమే చెప్పారని తెలిపారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పొత్తుల మధ్య తేడా ఉంటుందని ఆయన వివరించారు. కేరళలో కాంగ్రెస్, సీపీఎంలు ప్రత్యర్థులుగా ఉన్నా, ఢిల్లీ స్థాయిలో ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌లోనూ మమతా బెనర్జీ కూటమిని బలోపేతం చేస్తానని పునరుద్ఘాటించారు. కాబట్టి కూటమి కొనసాగకపోవడానికి కారణం కనిపించడం లేదని ఆయన పేర్కొన్నారు. డీఎంకే కూటమిలో కొనసాగుతుందని తాను ఆశిస్తున్నట్లు చిదంబరం తెలిపారు. అంతేకాదు, విజయ్ నేతృత్వంలోని టీవీకేని కూడా ఇండియా కూటమిలోకి తీసుకురావాలని ప్రయత్నించాలని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

# వస్తూనే డబ్బుల్లేవని మాట్లాడొద్దు: మాజీ సిఎం స్టాలిన్ కౌంటర్



**చెన్నై, మే 10:** తమిళనాడు నూతన ముఖ్య మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన టీవీకే అధినేత విజయ్‌కు డీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూనే, తీవ్రమైన రాజకీయ విమర్శలతో కూడిన హెచ్చరికలు జారీ చేశారు. తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు విజయ్‌కు నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే మీరు సంతకం చేసిన ఉత్తర్వులను కూడా నేను స్వాగతిస్తున్నాను. వస్తూనే ప్రభుత్వం దగ్గర డబ్బు లేదని మాట్లాడటం మొదలుపెట్టవద్దు. అవన్నీ ఉన్నాయి. ప్రజలకు ఇవ్వాలన్న మనసు, పరిపాలనా దక్షత మాత్రమే కావాలి. గత ఐదేళ్లలో మేము కోవిడ్, వరదలు వంటి ఎన్నో సమస్యలను, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వివక్షను ఎదుర్కొని లెక్కలేనన్ని ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేశాం. గత ప్రభుత్వం రూ. 10లక్షల కోట్ల అప్పు చేసి, ఖజానాను ఖాళీ చేసి వెళ్లిపోయిందని మీ మొదటి ప్రసంగంలోనే ఆరోపించారు కదా. తమిళనాడు అప్పులు అనుమతించిన పరిధిలోనే ఉన్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి గత ఫిబ్రవరి బడ్జెట్‌లోనే మేము స్పష్టంగా చెప్పాం. ఆ విషయం మీకు తెలియదా ఆ తర్వాతే కదా మీరు ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చింది మీకు ఓటు వేసిన ప్రజలను మళ్లీ తప్పుదోవ పట్టించి మోసం చేయకండి. ఆచరణ సాధ్యమైన వాటినే హామీలుగా ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన మీరు ఇప్పుడిప్పుడే ప్రభుత్వ పాలనలోకి అడుగుపెడుతున్నారు. మాలాగా మీరు కూడా ప్రజలకు ఇచ్చిన హామీలను ఎలా నెరవేర్చాలనే మెలకువలను నేర్చుకుంటారని నేను నమ్ముతున్నాను. ఓటు వేసిన ప్రజలతో పాటు, నేను కూడా అదే ఆశిస్తున్నాను. మీ పాలనలో తమిళనాడు అభివృద్ధి ప్రయాణం కొనసాగాలని మరోసారి ఆకాంక్షిస్తూ, నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నానంటూ స్టాలిన్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

# మనందరి మొదటి శత్రువు బిజెపియే

## పార్టీకేడర్‌తో మమతా బెనర్జీ



**కోల్‌కత్తా, మే 10:** మనందరి మొదటి శత్రువు బీజేపీయేనని, కాబట్టి అందరం కలిసి ఆ పార్టీపై పోరాటం చేద్దామని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించింది. సువేందు అధికారి నేతృత్వంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ఈ సందర్భంగా మమతా బెనర్జీ మాట్లాడుతూ, బీజేపీని వ్యతిరేకించే పార్టీలన్నీ ఏకం కావాలని సూచించారు. విద్యార్థి సంఘాలు, ఎన్జీవోలు కూడా మద్దతివ్వాలని కోరారు. బీజేపీని తీవ్రంగా వ్యతిరేకించే వామపక్షాలు, ప్రతిపక్షాలతో పాటు జాతీయ పార్టీలు కూడా కమలం పార్టీపై పోరాటానికి కలిసి రావాలని పిలుపునిచ్చారు. శత్రువుకు శత్రువు మిత్రుడు అని ఆలోచించే సమయం ఇది కాదని అన్నారు. మనందరి మొదటి శత్రువు బీజేపీయే అన్నారు. బీజేపీ వంటి దుష్ట శక్తులు రాష్ట్రంలోకి ప్రవేశించాయని విమర్శించారు. తమ పార్టీ కార్యకర్తలపై దాడులుచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్ నాయకులతో పాటు వివిధ పార్టీల నాయకులు తనతో మాట్లాడారని వెల్లడించారు. తాను ఎవరి సానుభూతిని కోరుకోవడం లేదని, యుద్ధంలో ఎవరు గెలుస్తారనేది భవిష్యత్తు నిర్ణయిస్తుందని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ పార్టీకి అన్యాయం జరిగిందని మమతా బెనర్జీ ఆరోపించారు.



## పూర్తిస్థాయిలో వందేమాతరం ఆలాపన

**చెన్నై, మే 10:** తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణస్వీకారం చేయడానికి ముందు వేదికపై వందేమాతరగేయాన్ని పూర్తిగా ఆలపించారు. ఈ సందర్భంగా గాయకులు వందేమాతరంలోని మొత్తం ఆరు చరణాలను పాడటం అందరి దృష్టిని ఆకర్షించింది. సాధారణంగా అన్ని అధికారిక కార్యక్రమాల్లో వందేమాతరంలోని రెండు భాగాలను మాత్రమే ఆలపిస్తారు. అయితే ఇకపై అందులోని ఆరు చరణాలను పాడాలని కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. అందువల్లనే ప్రమాణస్వీకారం సమయంలో తమిళనాడు కొత్త ప్రభుత్వం ఈ విధానం పాటించింది.




## పాక్‌లో అర్థరాత్రి పోలీస్‌స్టేషన్‌పై ఆత్మాహుతి దాడి..

# 15 మంది పోలీసులు మృతి

**ఇస్లామాబాద్, మే 10:** పాకిస్థాన్‌లోని అశాంతి నిలయమైన ఖైబర్ ఫఖ్తున్‌ఖ్వా ప్రావిన్స్‌లో శనివారంరాత్రి ఉగ్రదాడి జరిగింది. బన్నూ జిల్లాలోని ఫతేఖేల్ పోలీసు స్టేషన్‌ను లక్ష్యంగా చేసుకొని శనివారం జరిగిన భారీ ఆత్మహుతి దాడిలో 15 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారని సమాచారం. ఆదివారం బలూచిస్థాన్‌లో జరిగిన వరుస దాడులతో పాకిస్థాన్ రక్తసిక్తమైంది. పేలుడు ధాటికి సమీపంలోని నివాసగృహాలు కుప్పకూలడంతో భారీగా ఆస్తి నష్టం సంభవించిందని తెలుస్తున్నది. పేలుడు ధాటికి అనేకమంది అధికారులు శిథిలాల కింద చిక్కుకుపోయారు. డిఐజి సజ్జాద్‌ఖాన్ పర్యవేక్షణలో రాత్రంతా సహాయక సహాయక చర్యలు కొనసాగాయి. పేలుడు జరిగిన వెంటనే డజన్ల కొద్దీ సాయుధ ఉగ్రవాదులు పోలీసుస్టేషన్‌ను అన్ని వైపుల నుంచి చుట్టుముట్టారు. దీంతో భద్రతా సిబ్బందికి, ఉగ్రవాదులకు మధ్య గంటల తరబడి కాల్పులు జరిగాయి. ఈ భీకర పోరాటంలోనే 15 మంది పోలీసులు వీరమరణం పొందారని తెలుస్తోంది. గాయపడిన వారిని వెంటనే స్థానిక ఆస్పత్రులకు తరలించారు. ఈ దాడిని ఖైబర్ ఫఖ్తూన్‌ఖ్వా ముఖ్యమంత్రి ముహమ్మద్ సోహైల్ అఫ్రిది తీవ్రంగా ఖండించారు. అమరవీరుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ఆయన గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. 'ఉగ్రవాదంపై పోరాటం కేవలం ఒక ప్రాంతానిది కాదు, ఇది దేశం మొత్తానిది. బలవంతంగా రుద్దిన కొనిన తప్పుడు విధానాల వల్లే దేశం నేడు అభద్రతా ఊబిలోకి నెట్టబడింది. మన పోలీసుల త్యాగాలను వృథాకానివ్వం' అని అఫ్రిది స్పష్టం చేశారు. ఆత్మాహుతి దాడి తీవ్రతకు పోలీసు స్టేషన్ పరిసరాల్లోని నివాసగృహాల పైకప్పులు కూలిపోయాయి. స్థానికులు భయాందోళనతో పరుగులు తీశారు. ప్రస్తుతం ఆ ప్రాంతాన్ని భద్రతా దళాలు తమ అధీనంలోకి తీసుకుని గాలింపు చర్యలు ముమ్మరం చేస్తున్నారు.

**బలూచిస్థాన్‌లో 'బిఎల్‌ఎఫ్' మారణహోమం:** ఒక వైపు బన్నూలో ఈ దారుణం జరుగుతుండగానే, మరోవైపుబలూచిస్థాన్ లిబరేషన్ ఫ్రంట్ (బిఎల్‌ఎఫ్) ఆదివారం వరుస దాడులకు తెగబడింది. బలూచిస్థాన్‌లోని ఖరాన్, వాషక్, మస్తుంగ్ సమా పది ప్రాంతాల్లో భద్రతా బలగాలే లక్ష్యంగా దాడులు జరిగాయి. ఈ ఘటనల్లో 10 మంది పాకిస్థానీ సైనికులు, నలుగురు రాష్ట్ర ఏజెంట్లు మరణించినట్లు బిఎల్‌ఎఫ్ ప్రకటించింది. సైనిక స్థావరాలు, కాన్వాయ్‌లపై రాకెట్లు, గ్రెనేడ్ లాంచర్లతో విరుచుకుపడ్డామని ఆ సంస్థ వెల్లడించింది.

## డిజిపి కార్యాలయం వద్ద బిఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆందోళన

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:**: కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసుకు సంబంధించి పోలీ సులు సరైన విధంగా స్పందించడం లేదని ఆరోపిస్తూ బిఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆదివారం నాడు డిజిపి కార్యాలయం వద్ద ఆందోళన చేబట్టి ంది. బిఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో పలువురు నాయకులు పాల్గొ న్నారు. సాయి భగీరథ్ 17 యేళ్ల బాలికను మద్యం తాగించి పలుమార్లు అత్యాచారం చేసి నట్లు ఆధారాలున్నా పోలీసులు కేవలం కేసు నమోదు వరకే పరిమితం అవడం సరైంది కాదని శ్రీనివాస్ యాదవ్ ఈ సందర్భంగా తెలిపారు. మైనర్ బాలిక పట్ల కేంద్ర మంత్రి కుమారుడు దారుణంగా వ్యవహరించడాన్ని పోలీసు శాఖ సమర్థించడం ఎంతవర కు న్యాయమని ఆయన ప్రశ్నించారు. సాయి భగీరథ్‌పై నమోదైన కేసులో పోలీసుల విచారణ వేగ వంతంగా సాగాలని, నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని, బాధిత బాలికకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో బిఆర్ఎస్‌వి విద్యార్థి విభాగం నాయకులు తుంగబాలు, పడాల సతీష్, నితీష్, జంగయ్య, శ్రీనునాయక్, రాహుల్, రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు. కాగా డిజిపి కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న బిఆర్ఎస్‌వి విద్యార్థి విభాగం నాయకులను పోలీసు లు అరెస్టు చేసి చిక్కడపల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. చిక్కడపల్లి పోలీసుస్టేషన్‌లో స్థానిక బిఆర్ఎస్ నాయకులు వారిని పరామర్శించారు.

## జాతీయ రహదారుల అభివృద్ధిలో వేగం పెంచండి



### ఎన్‌హెచ్ఎఐ చైర్మన్ సంతోష్‌కుమార్‌యాదవ్‌తో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** జాతీయ రహదారుల అభివృద్ధిలో వేగం పెంచాలని ఎల్‌బి నగర్ నుంచి హాయత్‌నగర్ వరకు 7.1కి.మి నిర్మించే డబుల్ డక్కర్ రోడ్‌కు సహకరించాలని ఆర్అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఛైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్ తో ఆదివారం హైదరాబాద్ రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమా టోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి భేటీ అయ్యారు. రీజినల్ రింగ్ రోడ్డు, హైదరాబాద్ విజయవాడ(ఎన్ హెచ్ 65) విస్తరణ పనులు ప్రారంభం పై ప్రత్యేకంగా చర్చించారు. నిత్యం యాక్సిడెంట్స్ తో డెత్ రోడ్ గా పిలువబడుతున్న హైదరాబాద్ విజయవాడ రహదారి 8లేన్ విస్తరణ పనులు వీలైనంత త్వరగా చేపట్టాలని కోరారు. ఇదే రహదారిలో ఎల్బీనగర్ నుండి హాయత్ నగర్ వరకు నాగపూర్ తరహాలో 7.1కి.మీ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి, డిపిఆర్ మోర్త్ కు పంపిన విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. హైదరాబాద్ విజయవాడ, రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం టెండర్ ప్రక్రియ పూర్తి చేసి అతి త్వరలో పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎన్‌హెచ్ ఎఐ ఛైర్మన్ మంత్రికి వివరించారు. రాష్ట్రంలో ఎన్ హెచ్ ఎఐ ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న, చేపట్టబోయే పలు ప్రాజెక్టుల అంశాలు ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో కీలక భాగస్వామ్యంగా నిలిచే ప్రాజెక్టులు త్వరగా పూర్తయేలా చూడాలని ఎన్‌హెచ్ఎఐ ఛైర్మన్‌ను మంత్రి కోరారు.

రాష్ట్రంలోని పలు ఎన్ హెచ్ ఎఐ ప్రాజెక్ట్స్ పై చర్చించి వాటి సాధ్యాసాధ్యాల నివేదికలు పరిశీలించారు. మంత్రి వెంట రోడ్లు భవనాలు శాఖ స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్,ప్రత్యేక కార్యదర్శి ప్రావిణ్య,సి.ఈ లు ధర్మారెడ్డి,రాజేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## తెలంగాణలో బిజెపిని అధికారంలోకి తీసుకొచ్చి తీరుతాం

### కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** ప్రధాని మోడి నాయకత్వంలో నితిన్ నబిన్ ఆధ్వర్యంలో తెలంగాణలో బిజెపిని అధికారంలోకి తీసుకొచ్చి తీరుతామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. జై శ్రీరాం...జై



తెలంగాణ.... నినాదాలతో కాంగ్రెసోళ్ల చెవుల్లో రక్తం కారాలే అన్నారు. జై శ్రీరాం అంటే డబ్బులే కాదు.....కాంగ్రెస్, బిఆర్ఎస్ గుండెల్లో రాళ్లు కూడా పడుతున్నయని, జై శ్రీరాం నినాదాలతో బెంగాల్‌లో అరాచకాలు పోయాయి....జై శ్రీరాం నినాదంతోనే బెంగాల్‌లో అధికారంలోకి వచ్చిందన్నారు. బెంగాల్ తరువాత మన నెక్స్ట్ టార్గెట్ తెలంగాణే అన్నారు. బెంగాల్ గెలుపుతో ఆ పార్టీల నేతల్లో వణుకు మొదలైందని, కాంగ్రెస్, బిఆర్ఎస్ పునాదులు కదులుతున్నయని అన్నారు. ఢిల్లీ నుండి మోడీ నిధులు తెస్తుంటే... కాంగ్రెసోళ్లు తెలంగాణ సొమ్మును ఢిల్లీకి పంపుతున్నారని అన్నారు. హిందీ మాట్లాడే మోడీ నిధుల వరద పారిస్తుంటే....తెలుగు మాట్లాడే రేవంత్ రెడ్డి నిధులు ఢిల్లీకి దోచిపెడుతున్నారని మండిపడ్డారు. మోడీ 12 లక్షల కోట్లు ఇస్తే....రేవంత్ రెడ్డి తెలంగాణకు చిప్ప చేతికిచ్చాడని, బిజెపి కార్యకర్తల పోరాటాలవల్లే గడీలు బద్దలయ్యాయని అన్నారు. బిజెపి కార్యకర్తల బలిదానాలను, త్యాగాలను వృధాగా పోనివ్వం అన్నారు. దేశం, ధర్మం కోసం ఎందాకైనా కొట్లాడాలనే ఆర్ఎస్ఎస్ ఉగ్గుపాలతో పెరిగినోళ్లం, మీ తాటాకు చప్పుళ్లకు బెదిరే ప్రసక్తే లేదన్నారు. భయపెడితే భయపడటానికి నేను ఫామ్ హౌస్‌లో ఎలుకను అనుకుంటున్నరా? అంటూ ప్రశ్నించారు. అయ్య ఆస్తి మీద.. అయ్య పేరు మీద ఎదిగిన నాయకుణ్ణి కాదు. బిజెపి సైనికులం...మోడీ శిష్యులం అన్నారు. ప్రాణం పోయినా తప్పు చేయమన్నారు. తప్పు చేసే వాళ్లను వదిలిపెట్టబోం అన్నారు. బిజెపి తలదించుకునే పని నేను అసలే చెయ్యం, అవినీతి, అక్రమాలు, అరాచకాలు చేస్తూ తెలంగాణను ముంచినోళ్లే ఎదురుదాడి చేస్తుంటే, ఏ తప్పు చేయనోళ్లం ఊకుంటమా? అన్నారు. అగ్గి పుట్టిద్దాం, ఆ అగ్గిలో అవినీతి, కుటుంబ పార్టీలను కాల్చి బూడిద చేద్దామని, మీరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా నాయల్దీ తగ్గేది లేదు. బరబార్ బరి గీసి నిలబడతా... కలబడతామని బండి సంజయ్‌కుమార్ అన్నారు.

## తెలంగాణ అభివృద్ధికి సహకరించండి

### ప్రధానమంత్రి నరేంద్రమోడీకి మహేష్‌కుమార్ బహిరంగ లేఖ

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** తెలంగాణ ఏర్పాటుపై సమయం సందర్భంలేకుండా విషం చిమ్మడం కేంద్రంలోని బిజెపి పాలకులు మానుకొని సమగ్ర అభివృద్ధికి సహకారం అందించాలని ప్రధానమంత్రి నరేంనరదమోడీకి టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనల కోసం ఆదివారం హైదరాబాద్‌కు వచ్చిన ప్రధానమంత్రి నరేంద్రమోడీకి టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ బహిరంగలేఖ రాస్తూ పలు కీలక అంశాలను ప్రస్తావించారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్2కు వెంటనే కేంద్ర ఆమోదంచి రూ.38,595 కోట్ల మెట్రో విస్తరణ ప్రాజెక్టును జాయింట్ వెంచర్‌లో చేపట్టాలని విజ్ఞప్తి లేఖలో డిమాండ్ చేశారు. జాతీయ స్థాయి అర్బన్ రివర్ రీస్టోరేషన్ ప్రాజెక్టుగా గుర్తిస్తూ మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు ప్రత్యేక ఆర్థిక సహాయం ఇవ్వాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. బాపూఘాట్ గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ అనుమతులు ఇవ్వాలని అభ్యర్థించారు. రీజినల్ రింగ్ రోడ్ ఉత్తర భాగానికి ఫైనాన్షియల్ అనుమతులు వెంటనే ఇవ్వాలని కోరారు. దక్షి ణ భాగం నిర్మాణానికి కూడా కేంద్ర అనుమతులు మంజూరు చేయాలన్నారు. రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టును 100 శాతం కేంద్ర నిధులతో చేపట్టాలని డిమాండ్ చేశారు. హైదరా బాద్– అమరావతి–బందర్ పోర్ట్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మించాలని లేఖలో పేర్కొ న్నారు. హైదరాబాద్–బెంగళూరు హైస్పీడ్ కారిడార్ అభివృద్ధికి కేంద్రం చొరవ చూపాలని కోరారు. రేడియల్ రోడ్ల నిర్మాణానికి రూ.45 వేల కోట్ల సహాయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ సిగ్నల్ ఫ్రీ ప్రాజెక్టుకు కేంద్ర నిధులు మంజూరు చేయాల్సిన అవసరం గుర్తుచేశారు ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లకు కేంద్ర సహ కారం కోరారు.

హైదరాబాద్ ఫ్యాబ్ సిటీకి సెమీ కండక్టర్ మిషన్ కింద ప్రాధాన్యం ఇవ్వాలనీ కోరారు. కేంద్ర పరిశీలనలో ఉన్న సెమీకండక్టర్ ప్రాజెక్టులకు తుది ఆమోదం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు మహారాష్ట్ర నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ ఇచ్చేట్లు చూడాలని కేంద్రాన్ని మహేష్‌కుమార్ అభ్యర్థించారు. తెలంగాణ విభజన హామీలను పూర్తిగా అమలు చేయాలని, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని పూర్తి స్థాయి యూనిట్‌గా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. కొత్త జిల్లాలకు కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ పాఠశాలలు మంజూరు చేయాల్సిన ఆవశ్యకత లేఖలో వివరించారు. తెలంగాణకు నిధులు, అనుమతులు ఇస్తేనే మోదీకి రాష్ట్రంపై ప్రేమ ఉందని భావిస్తామనీ, లేదంటే తెలంగాణ ప్రజలు బిజెపి ద్రోహులుగా చూస్తారని హెచ్చరించారు. తెలంగాణ ఏర్పాటుపై గతంలో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను, తేజస్వీ సూర్యా తెలంగాణను పాకిస్తాన్‌తో పోల్చారని విమర్శపై తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ తన నిరసన ను తెలిపింది..తెలంగాణపై బిజెపి నేతలు విషం చిమ్మడం ఆపాలని, రాష్ట్ర సాధనకోసం తమ ప్రాణాలను తాగ్యం చేసిన అమరవీరులకు గౌరవం ఇవ్వాలని కేంద్రాన్ని కోరిన మహేష్‌కుమార్‌గౌడ్ లేఖలో కోరారు.

## బండి సంజయ్‌ని బర్తరఫ్ చేయాలి

### పిసిసి మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను మంత్రిమండలి నుంచి బర్తరఫ్ చేసి బాధిత బాలికకు న్యాయం చేయాలని టిపిసిసి మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ 'భేటీ పడావో భేటి బచావో' కార్యక్రమంమహిళలకు భద్రత గౌరవం కల్పించాలనే చిత్త శుద్ధిలేని వృథా ప్రయాస కార్యక్రమం కేవలం ప్రచారం కోసం చేస్తున్నరాని ఆమె దుయ్యబట్టారు. దేశంలో బిజెపి పాలిత రాష్ట్రాలలో 47 మంది ఎమ్మెల్యేలు మహిళలపై అత్యాచారాల ఆరోపణలు ఎదుర్కొంటున్నవారే ఉన్నారని ఆమె ఆరోపించారు. అలాంటి ప్రజా ప్రతినిధులను పెరోల్‌పై విడుదల చేసి బిజెపి అగ్రనాయకత్వం భుజాలపై చేతులువేసుకొని తిరుగుతుంటే భద్రత ఎలా ఉంటుందని ఇలాంటి నేరాల నియంత్రణ చేయడం ఎలా జరుగుతోందని ప్రశ్నించారు. బండి సంజయ్ కొడుకు 50వేల రూపాయలు బాధిత కుటుంబంకు ఇచ్చానని ఇంకా ఐదు కోట్లు డిమాండ్ చేస్తున్నారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారని ఆయన ఏ తప్పు చేయకపోతే ఎదుటివాళ్ళు బెదిరింపు వసూళ్ళకు దిగితే ఎందుకు ఇచ్చావని ఆమె ప్రశ్నించారు. ముందు బండిసంజయ్ కొడుకు భగీరథ్‌ను అరెస్టు చేయాలని కోరారు. బండి సంజయ్ కొడుకు అరాచకాలు చేయడం సరికాదని సంజయ్ నీ కేంద్రమంత్రిగా బర్తరఫ్ చెయ్యాలనీ సంజయ్ కొడుకుని అరెస్ట్ చెయ్యాలనీ ఆయన సంజయ్ కొడుకుని సమర్థించుకోవడం సరికాదు అని ఆమె చెప్పారు. రాష్ట్రంలో మహిళలను కాపాడాల్సిన బాధ్యతగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్తుందనీ కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తపన పడుతున్న రాష్ట్రంలో ఇలాంటి నేరాలకు బిజెపి నాయకగణం ఇలాంటి తప్పుడు పనులకు పాల్పడటం సరికాదని ఆమె ఆవేదన చెందారు.

## బండి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** మైనర్ బాలికపై లైగింక వేధింపులకు పాలనపడిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయాలని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడడాన్ని సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. భగీరథ్‌పై ఫోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసి చేతులు దులుపుకోవడం కాకుండా హోంశాఖ, డీజీపీ ఈ కేసు విషయంలో కఠినంగా వ్యవహరించాలని, తక్షణమే అరెస్ట్ చేసి, బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. వేధింపులపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన బాధితురాలి కుటుంబంపైనే కరీంనగర్‌లో అక్రమంగా కేసులు బనాయించారని, నిందితుడి వేధింపులు, పోలీసుల వేధింపులు తట్టుకోలేక బాలిక రెండుసార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. భగీ రథ్‌పై గతంలోనూ మహేంద్ర యూనివర్సిటీలో ర్యాగింగ్ కేసులున్నాయని, బండి సంజయ్ తన రాజకీయ, అధికార బలంతో కేసును ఉపసంహరించు కోవాలంటూ బాధితులపై దాడులు జరిపే అవకాశం ఉందన్నారు. ఈ కేసును కూడా పక్కదోవ పట్టించే పరిస్థితి కనపడుతోందని, బాధితురాలు, ఆమె కుటుంబానికి తక్షణమే పూర్తిస్థాయి రక్షణ కల్పిస్తూ, బాలిక కుటుంబంపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని జాన్ వెస్లీ డిమాండ్

## తెలంగాణలో రాజకీయ మార్పునకు నాంది పలకాలి

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** సికిందరాబాద్ పెరేడ్ గ్రౌండ్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో పాల్గొన్న ప్రజల ఉత్సాహం తెలంగాణలో రాజకీయ మార్పునకు నాంది పలుకుతోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పేర్కొన్నారు. సభా ప్రాంగణంలో ఉన్న ప్రజలకంటే రెట్టింపు సంఖ్యలో ప్రజలు బయట ఉన్నారని, ఇది ప్రజల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పట్ల ఉన్న అపారమైన అభిమానానికి నిదర్శనమన్నారు. ఈ సభ కార్యకర్తల సభ అని, తెలంగాణ ప్రజలు లక్షలాదిగా తరలివచ్చి ప్రధాని నరేంద్ర మోడీకి ఘన స్వాగతం పలికారని తెలిపారు. సికింద్రాబాద్‌లో జరిగిన ఈ భారీ జనసంద్రం, రాబోయేది భారతీయ జనతా పార్టీ ప్రభుత్వమే అన్న స్పష్టమైన సంకేతమని



పేర్కొన్నారు. మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా తెలంగాణకు వచ్చిన ప్రధాని మోడీకి రాష్ట్ర ప్రజలు ఇచ్చిన అద్భుత స్వాగతానికి తెలంగాణ ప్రజలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీకి తెలంగాణతో ప్రత్యేకమైన అనుబంధం ఉందని రాంచందర్ రావు పేర్కొన్నారు. హైదరాబాద్ రాష్ట్రం నిజాం పాలన నుంచి భారతదేశంలో విలీనమైన చారిత్రాత్మకమైన సెప్టెంబర్ 17 తేదీనే మోడీ జన్మదినం కూడా కావడం తెలంగాణ ప్రజలకు మరింత గొప్ప భావోద్వేగ అనుబంధాన్ని కలిగిస్తోందన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో ఎంతో ముఖ్యమైన రోజని, అదే రోజు దేశ ప్రధానమంత్రి జన్మదినం కావడం విశేషమని చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణతో పాటు దేశ అభివృద్ధికి దోహదపడే రూ.9,700 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని మోడీ దేశానికి అంకితం చేయడం పట్ల భారతీయ జనతా పార్టీ తెలంగాణ తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. తెలంగాణలో ప్రస్తుతం జరుగుతున్న పోరాటం జాతిని విభజించే శక్తులపై పోరాటమని ఆయన స్పష్టం చేశారు. దక్షి ణాది, ఉత్తరాది పేరుతో దేశాన్ని విభజించే రాజకీయ శక్తులతో పాటు కుటుంబ పాలన పేరుతో దేశాన్ని, రాష్ట్రాన్ని దోచుకుంటున్న కాంగ్రెస్ వంటి పార్టీలకు వ్యతిరేకంగా బిజెపి పోరాటం కొనసాగిస్తోందని స్పష్టం చేశారు.

## ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించడానికి నేడు తుది గడువు

### అపరాధ రుసుం రూ.7వేలతో అవకాశం

### ఇంటర్ బోర్డు సెక్రటరీ

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫీజు చెల్లింపు గడువును రూ. 7వేల అపరాధ రుసుంతో చెల్లించడానికి అవకాశం కల్పిస్తూ ఇంటర్ బోర్డు నిర్ణయం తీసుకుంది. అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు అపరాధ రుసుంతో చెల్లించడానికి నేటి(సోమవారం) వరకు అవకాశం కల్పిస్తున్నట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రెండుసార్లు అపరాధ రుసుం రూ. 2వేలు, రూ. 3వేలతో అవకాశం కల్పించగా.. రూ. 7వేల అపరాధ రుసుంతో చెల్లించడానికి నేటి వరకు అవకాశం కల్పించినట్టు బోర్డు కార్యదర్శి ప్రకటనలో పేర్కొన్నారు.

ఇప్పటి వరకు సుమారు 4 లక్ష మంది వరకు ఫీజును చెల్లించినట్టు అధికారులు చెబుతున్నారు. మొదటి సంవత్సరంలో ఇంప్రూవ్‌మెంట్‌తోపాటు, ఫెయిలైన విద్యార్థులు కలిపి జనరల్, ఒకేషనల్ విద్యార్థులు 2,70,141 మంది ఫీజు చెల్లించగా.. సెకండియర్ విద్యార్థులు 1,30,856 మంది ఫీజును చెల్లించారు. రాష్ట్రంలో ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. పరీక్షల ఫలితాలను ఏప్రిల్ 12న విడుదల చేయగా.. ఏప్రిల్ 13 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఫీజు చెల్లించడానికి అవకాశం కల్పించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 4,89,123 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా.. వారిలో 3,23,807 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 5,07,948 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైతే వారిలో 3,58,490 మంది ఉత్తీర్ణత సాధించారు. రీకౌంటింగ్ కోసం 7వేల దరఖాస్తులు రాగా.. రీవెరిఫికేషన్ కోసం 38వేలు దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

## తెలంగాణ శీఘ్ర అభివృద్ధికి ఆర్థిక చేయూత ఇవ్వండి: మల్లు రవి

హైదరాబాద్,మే10,ప్రభాతవార్త: తెలంగాణ వేగిరతరంగా అబివృద్ధి చెందేందుకు ఆర్థికంగా కేంద్రం చేయూత ఇవ్వాలని తెలంగాణ దిశ(డిస్ట్రిక్ డవలప్‌మెంట్ కోఆర్డినేషన్ అండ్ మానిటరింగ్)కమిటి మెంబర్ ఎంపి మల్లు రవి డిమాండ్ చేశారు. మల్లు రవి ప్రధానమంత్రికి లేఖ రాసూనత రీజినల్‌రింగ్ నిర్మాణంకు వందశాతం నిధులు మంజూరు చేయాలని అనుమతులు కూడా ఇవ్వాలని కోరారు. ఉత్తర దిశ రింగ్‌రోడ్‌కు వెంటనే ఆర్థిక పరమైన అనుమతులు జారీచేయాలని కోరారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంకు జాతీయహోదా ఇవ్వాలని, హైదరాబాద్ మెట్రో రెండవ దశ పనులకు వెంటనే అనుమతి ఇవ్వాలని కోరారు బాపు ఘాట్ సరోవర్‌కు రక్షణశాఖ నుంచి అనుమతులు ఇవ్వాలని మూసీ నది పునర్జీవనం కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని కోరుతూ లేఖ రాసినారు. హైదరాబాద్–బెంగుళూర్ హైస్పీడ్ కారిడార్ ఏర్పాటు, సిగ్నల్‌ఫ్రీ హైదరాబాద్ కారిడార్ రేడియల్ రోడ్లకు 45వేల కోట్లు మంజూరు చేయాలనీ కోరారు. మొత్తంగా 16డిమాండ్లతో లేఖ రాసారు.

## ఫ్యూచర్‌సిటీ నుంచి బందర్ పోర్టుకు గ్రీన్‌ఫీల్డ్ అనుమతి ఇవ్వండి

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**హైదరాబాద్,మే10,ప్రభాతవార్త:** ఫ్యూచర్ సిటీ నుంచి బందర్ పోర్టు కు గ్రీన్ ఫీల్డ్ హైవే కి అనుమతి ఇవ్వాలని ప్రభుత్వవిప్ ఆదిశ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం సిఎల్‌పిలో మాట్లాడుతూ తుమ్మడిహట్టి వద్ద ప్రాణహితపై బ్యారేజి నిర్మించడానికి మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌తో మాట్లాడి అనుమతి ఇప్పించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ మెట్రో విస్తరణకు అనుమతి కోసం చాలా కాలం గా కేంద్రాన్ని అడుగుతున్నామనీ కానీ చెన్నై,పూనె నగరాల్లో మెట్రో విస్తరణ కు కేంద్రం అనుమతి ఇచ్చిందనీ మనకు ఇవ్వలేదని ఆయన వాపోయారు. రీజనల్ రింగ్ రోడ్డు కు ఇప్పటి వరకు అనుమతులు రాలేదనీ వెంటనే ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వం పదేళ్ళలో చేసిన కాళేశ్వరం అక్రమాలు పవర్ ప్లాంట్ల నిర్మాణం, విద్యుత్ కొనుగోళ్ల పైన సిబిఐ విచారణకు తెలంగాణ ప్రభుత్వం సిఫార్సు చేసిందనీ, విచారణ మొదలయ్యేలా చూడాలనీ ఆయన ప్రధాని మోడీని కోరారు.

## తెలంగాణపై శీతకన్ను తగదు

### ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** తెలంగాణ అభివృద్ధిలో కేంద్రం పాలు పంచుకుంటుందన్న భావన ప్రతి పౌరుడికి కలిగేలా సమాఖ్య విధానంలో కేంద్రం పెద్దన్న పాత్ర పోషించాలి కానీ తెలంగాణ పైన శీతకన్ను చూపిస్తూ అభివృద్ధిని అడ్డుకొనే ప్రయత్నం చేయవద్దని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ కోరారు. ఆదివారం సిఎల్‌పిలో విలేఖరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రధాని మోదీ రెండు కళ్లలా చూడాలని, రాజకీయ విభేదాలతో ముడిపెట్టకుండా వివిధ ప్రాజెక్టుల అనుమతులు, నిధులు ఇవ్వడంతోపాటు పాలమూరు రంగారెడ్డి కి జాతీయ హోదా ఇస్తే సంతోషిస్తామనీ తెలిపారు. డబల్ ఇంజన్ సర్కార్ అయితేనే సహకరిస్తామన్న భావన వద్దనీ ఎందరో అమరవీరుల త్యాగఫలం తెలంగాణ ఏర్పాటైందనీ భారత ప్రధానమంత్రిమోదీ, బిజెపినాయకులు తెలంగాణ పైన ప్రేమ పెంచుకోవాలే కానీ రాష్ట్రఏర్పాటును తల్లిని చంపి బిడ్డను బ్రతికించారని, పాకిస్తాన్‌తోపోల్చి కించపరిచే మాటలతో తెలంగాణీయులను ద్వితీయశ్రేణిపౌరులుగా తిరస్కారభావంతో చూడవద్దని కోరారు. బిఆర్ఎస్ పాలనలోని అక్రమాలపై కేంద్రం వెంటనే స్పందించాలని, కాళేశ్వరం పైన సిబిఐ విచారణ వెంటనే ప్రారంభమయ్యేలా చొరవ చూపించాలనీ అన్నారు. విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు, విద్యుత్ కొనుగోళ్లపైన సిబిఐ విచారణ కు రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేసిందనీ దీనిపైన కేంద్ర ప్రభుత్వం స్పందించి అక్రమార్కులను కటకటాల వెనక్కి పంపాలని కోరారు.



ధర్నాలో పాల్గొన్న మధుసూదనచారి, కోదండరామ్, శ్రీనివాస్‌గౌడ్, సత్యం, శంకరయ్య, జాజుల తదితరులు

## మళ్లీ కొండెక్కిన కోడికూర ధరలు

### స్కిన్‌లెస్ కిలో చికెన్ ధర ట్రిబుల్ సెంచరీ క్రాస్

### బెంబేలెత్తిపోతున్న సామాన్యులు

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** మళ్లీ కోడికూర ధరలు కొండెక్కి కూర్చు నున్నాయి. దాదాపు 20 రోజులపాటు సామాన్యుడికి అందుబాటులో ఉన్న చికెన్ ధరలు మళ్లీ భారీగా పెరగడంతో సామాన్యవర్గాలకు చెందిన మాంసాహారులు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో స్కిన్ లెస్ చికెన్ ధర రికార్డు స్థాయికి చేరడంతో సామాన్యులు చికెన్ సెంటర్ల వైపు వెళ్లాలంటేనే జంకుతున్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా హైదరాబాద్‌తోపాటు పలు జిల్లాల్లో చికెన్‌లైవ్ బర్డ్ ధర కిలో రూ.190 – రూ. 220,వరకు ఉండగా స్కిన్ చికెన్ కిలో రూ.300 – రూ.320,ధర పలుకుతోంది. ఇక స్కిన్ లెస్ చికెన్ ధర కిలో రూ. 340 – రూ.360కు చేరింది. చికెన్ ధరలు ఇలా అమాంతం పెరగడానికి ప్రధానంగా మూడు కారణాలు కనిపిస్తున్నాయని పౌల్ట్రీ వ్యాపారులు విశ్లేషిస్తున్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల కోళ్ల మరణాల సంఖ్య పెరిగింది. ఎండల వేడికి కోళ్ల బరువు తగ్గడం, సకాలంలో పెరగక పోవడంతో మార్కెట్‌కు సరఫరా గరిష్టంగా పడిపోయింది. కోళ్ల మేత ధరలు పెరగడం, రవాణా ఖర్చులు భారం కావడంతో ఆ ప్రభావం నేరుగా వినియోగ దారుడిపై పడుతోంది. శుభకార్యాల సీజన్ కావడంతోపాటు మార్కెట్‌కు వచ్చే కోళ్ల సంఖ్య తగ్గడం వల్ల డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరా లేక ధరలు భగ్గుమంటున్నాయి. చికెన్ ధరలతో పాటు కోడిగుడ్ల ధరలు కూడా సామాన్యుడికి భారంగా మారుతున్నాయి. గతంలో రూ.5గా ఉన్న గుడ్డు ధర ఇప్పుడు పలు ప్రాంతాల్లో రూ. 7 నుండి రూ.8 వరకు విక్రయిస్తున్నారు. పౌల్ట్రీ రంగం ఎదుర్కొంటున్న సవాళ్ల వల్ల ఈ పెరిగిన ధరలు మరికొన్ని రోజులు ఇలాగే కొనసాగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

## బిసి ప్రధాని మోడీ 80 కోట్ల మంది బిసిలకు ఏంచేశారో చెప్పాలి

### అఖిలపక్షాలు, బిసి సంఘాలు డిమాండ్

**హైదరాబాద్ (సైఫాబాద్), మే 10, ప్రభాతవార్త:** తాను బిసినని చెప్పుకుంటున్న ప్రధాని నరేంద్రమోడీ 11యేళ్ల పాలనలో దేశంలోని 80 కోట్లమంది బిసిలకు ఏంచేశారో చెప్పాలని పలువురు బిసి ప్రజాప్రతినిధులు, బిసి సంఘాల నాయ కులు ప్రశ్నించారు. దేశంలో జంతువులకు లెక్కలు ఉన్నాయి కాని అత్యధిక జనాభా కలిగిన బిసిలకు మాత్రం లెక్కలు లేవని, ఎస్సీ, ఎస్టీల కులగణన మాదిరిగానే బిసిల జనగణన చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. నరేంద్రమోడీ తెలంగాణ రాష్ట్ర పర్యటన సందర్భంగా అఖిల పక్ష పార్టీలు, బిసి సంఘాల జెఎసి ఆధ్వర్యంలో ఆదివారం గన్‌పార్కు ఎదుట ధర్నా, నిరసన కార్యక్రమం జరిగింది. ఈ నిరసన కార్యక్రమంలో శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే వి.శంకరయ్య, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, సిపిఎం నాయకుడు అబ్బాస్ ప్రసంగించారు. చట్టసభలలో బిసిలకు 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని, బిసిలకు ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి బడ్జెట్‌లో రెండు లక్షల కోట్లు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు.

## తెలంగాణపై బిజెపి సవతితల్లి ప్రేమ

### రాష్ట్ర హితం ఆలోచించని ఆ పార్టీ ఎంపిలు

### ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** నరేంద్రమోడీ నాయకత్వంలోని బిజెపి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ పైన మొదటి నుంచి సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారనీ, ఏడు మండలాలను ఆంధ్రాకు ఇచ్చారనీ, పాలమూరు రంగారెడ్డికి జాతీయ హోదా ఇస్తామని ఎన్నికల సమయంలో చెప్పారుకాని ఆ తర్వాత ఆ ఊసే లేదు ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం సిఎల్‌పి కార్యాలయంలోని మీడియా సెంటర్‌మాట్లాడుతూ ఈ 12 యేళ్లలో కేంద్రం నుంచి తెలంగాణ కు తీసుకువచ్చిన నిధులు ఎంతో తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి మంత్రులు, ఎంపిలు చెప్పాలనీ డిమాండ్ చేశారు. పోలవరానికి జాతీయ హోదా ఇవ్వడంతో అక్కడ పనులు వేగంగా జరుగుతున్నాయనీ తెలిపారు. మా పాలమూరు బిడ్డలు భారతదేశంలో లేరా? ఎందుకింత నిరక్ష్యమనీ ఆగ్రహం వ్యక్తంచేశారు. గుజరాత్ లో గిఫ్ట్ సిటీ పెట్టి పారిశ్రామిక రాయితీలు ఇస్తున్నారనీ హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ కు కూడా రాయితీ లు ఇస్తే బాగుండేదనీ ఆయన అభిప్రాయపడ్డారు. మెట్రో విస్తరణకు కేంద్రం సహకారం లేకపోవడంతో సొంత నిధులతో చేపట్టాల్సి వస్తోందనీ వాపోయారు. మోడీని చూడగానే తెలంగాణ బిజెపి నాయకులు నోరుమెదపడం లేదనీ, కేంద్రం ఇచ్చే గ్రాంట్లు, నిధులు అన్నింట్లో ఆంధ్రప్రదేశ్ తో పోల్చినప్పుడు తెలంగాణకు అన్యాయం జరుగుతోందని అభిప్రాయపడ్డారు. ఆంధ్రకు నిధుల వరద పారుతోంది ఎనిమిది మంది బిజెపి ఎంపిలను గెలిపించిన తెలంగాణ ను మాత్రం నిర్లక్ష్యంచేస్తున్నారని దుయ్య బట్టారు. తెలంగాణ బిజెపి ఎంపీల నోరు పెద్ద దిప్రతిపక్షాలను విమర్శిస్తున్నారేగానీ రాష్ట్రం కోసం నిధు లు, ప్రాజెక్టులు తీసుకువద్దామన్న ఆలోచన చేయడం లేదనీ ఆరో పించారు. పదేళ్ల అనేక అక్రమాలకు పాల్ప డిన కెసిఆర్‌ను అరెస్టు చేయడంలేదని దీనితోనే ఫెవికాల్ కంటే ధృడమైన బిజెపి,బిఆర్ఎస్ బంధం బయట పడుతోందని ఆరోపించారు. అమరావతి నిర్మాణం కోసం వేల కోట్లు ఇస్తున్న కేంద్రం భారత్ ఫ్యూచర్ సిటీ కి రూపాయి ఇవ్వకపోగా దాని నిర్మాణానికి బిజెపి నాయకులు అడ్డు పడుతున్నారనీమరోవైపు ఆ పార్టీ ఎంపీలు రాష్ట్ర హితం కోసం ఆలోచడం లేదని తెలంగాణ ప్రజలు బాధపడుతున్నారనీ ఆయన వివరించారు.




# సుప్రియా సూలేకు త్రుటిలో తప్పిన ప్రాణాపాయం

**ముంబయి, మే 10:** ఎన్సీపి శరద్‌పవార్ విభాగం నేత, బారామతి ఎంపి సుప్రియాసూలే శనివారం కారు ప్రమాదం నుంచి త్రుటిలో బయట పడ్డారు. ముంబై-పుణె ఎక్స్‌ప్రెస్‌వేపై ఆమె ప్రయాణిస్తున్న కారును మరో వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. తాను సీటు బెల్ట్ ధరించడం వల్లే సురక్షితంగా ఉన్నానని సుప్రియా సూలే స్వయంగా వెల్లడించారు. ఈ ఘటనలో ఆమెతో పాటు కారులో ఉన్న సిబ్బందికి ఎలాంటి గాయాలు కాలేదు. సుప్రియా సూలే శనివారం పుణె నుంచి ముంబైకి కారులో ప్రయాణిస్తుండగా ఖలాపూర్ టోల్ ప్లాజా దాటిన తర్వాత ఈ ప్రమాదం జరిగింది. ఓ ఎస్‌యూవీ వాహనం నిర్లక్ష్యంగా, అతివేగంతో వచ్చి ఆమె కారును పక్క నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆమె కూర్చున్న వైపు డోర్ తీవ్రంగా దెబ్బతింది. ప్రమాదం తర్వాత సూలే సోషల్ మీడియా ద్వారా స్పందించారు. ప్రమాదం జరిగినప్పుడు భయం వేసింది. రోడ్లపై ఇతరుల నిర్లక్ష్యపు డ్రైవింగ్ కూడా మన ప్రాణాలకు ముప్పు తెస్తుంది. సీటు బెల్ట్ పెట్టుకోవడం వల్లే మేమంతా సురక్షితంగా ఉన్నామని పేర్కొన్నారు. ఈ ఘటనపై సుప్రియా సూలే ఎలాంటి ఫిర్యాదు చేయనప్పటికీ, పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేశారు. నిర్లక్ష్యంగా, అతివేగంగా వాహనం నడిపినందుకు గుజరాత్‌కు చెందిన ఎస్‌యూవీ డ్రైవర్‌పై ఖలాపూర్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గతంలో తన స్నేహితుడు, పారిశ్రామికవేత్త సైరస్ మిస్త్రీ కారు ప్రమాదంలో మరణించినప్పటి నుంచి సుప్రియా సూలే రోడ్డు భద్రత, ముఖ్యంగా సీటు బెల్ట్ ప్రాముఖ్యతపై విస్తృతంగా ప్రచారం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ ప్రమాదం రోడ్డు భద్రత నియమాలను పాటించాల్సిన ఆవశ్యకతను మరోసారి గుర్తు చేసిందని ఆమె అన్నారు.

# వేదికపై డప్పు కొడుతూ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపిన ప్రధాని

## భారీగా జనం హాజరుతో విజయవంతమైన బిజెపి బహిరంగ సభ

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** ప్రధాని మోది బహిరంగసభ నేపథ్యంలో సికింద్రాబాద్ కాషాయమయమైంది. ప్రధాని మోదీకి పరేడ్‌గ్రౌండ్‌లో ఘన స్వాగతం లభించింది. వందే మాతరం, జిందాబాద్ మోది నినాదాతలో ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నేతలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. తన కాన్వాయ్ నుంచే ప్రజలు, కార్యకర్తలకు ప్రధాని అభివాదం చేశారు. వేదిక మీద ఉన్న బిజెపి రాష్ట్ర నేతలు ప్రధానిని శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా బిజెపి ఎస్సి మోర్చా నేత అశోక్‌తో కలిసి ప్రధాని డప్పు వాయించి అలరించారు. లయబద్ధంగా, నైపుణ్యంతో ప్రధాని డప్పు వాయించడంతో పార్టీ నేతలతోపాటు ప్రజలు, కార్యకర్తలు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. డప్పు కొడుతూ ప్రధాని మోది బిజెపి శ్రేణుల్లో మరింత ఉత్సాహాన్ని నింపారు. ప్రధాని బహిరంగసభకు పెద్ద సంఖ్యలో ప్రజలు, బిజెపి కార్యకర్తలు హాజరయ్యారు. సభా ప్రాంగణంతోపాటు రోడ్ల మీద కూడా పెద్ద ఎత్తున జనం హాజరయ్యారు.

**ప్రధానిపై చిన్నారుల అభిమానం..**

పరేడ్‌గ్రౌండ్ సభ ప్రారంభానికి ముందు తన కోసం చిన్నారులు తీసుకొచ్చిన పెయింటింగ్స్‌ను ప్రధాని మోది ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆ చిత్రాలను సేకరించాలని ఎస్పిజి అధికారులను ఆదేశించారు. సేకరించిన పెయింటింగ్స్‌పై చిత్రకారుల చిరునామా ఉంటే వారికి స్వయంగా లేఖలు రాస్తానని తెలిపారు.

**పార్టీ నేతలతో ప్రత్యేక సమావేశం రద్దు**

ప్రధాని మోది తెలంగాణ పర్యటనలో స్వల్ప మార్పు చోటుచేసుకుంది. షెడ్యూల్ మేరకు ఎపి డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్‌ను, ఆ తర్వాత సిఎం చంద్రబాబుతో భేటీ అనంతరం ప్రధాని బేగంపేట విమానాశ్రయానికి వెళ్లి అక్కడ వేచి ఉన్న బీజేపీ శ్రేణులను, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించాల్సి ఉంది. అయితే సమయాభావం కారణంగా ఆ కార్యక్రమాన్ని రద్దు చేసుకున్న ప్రధాని నేరుగా సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌కు చేరుకుంటున్నారు. భారీ సంఖ్యలో ప్రజలు హాజరైనా బహిరంగ సభకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రధాని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.



# కుటుంబ, అవినీతి పాలన నుండి తెలంగాణను కాపాడుకోవాలి

## ఆరు గ్యారెంటీలను గాలికొదిలేసిన రేవంత్ సర్కార్: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** బిఆర్‌ఎస్ కుటుంబ, కాంగ్రెస్ అవినీతి రాజకీయాల నుంచి తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. పదేళ్ల కేసీఆర్ కుటుంబ పాలనలో, గత రెండున్నరేళ్లుగా సోనియాగాంధీ కుటుంబ కాంగ్రెస్ పాలనలో తెలంగాణ బందీగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు పరేడ్‌గ్రౌండ్‌లక్ష బహిరంగసభ వేదికపై నుండి ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా గాలికొదిలేసిందని, రాష్ట్ర నిధులను ఢిల్లీకి మోయడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి వేల కోట్ల రూపాయల నిధులు కేటాయిస్తున్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ విమర్శలతో తప్పుడు ఆరోపణలు చేస్తోందని ఆయన మండిపడ్డారు. రాజ్యాంగబద్ధమైన ఎన్నికల కమిషన్ అమలు చేస్తున్న సర్ కార్యక్రమానికి వ్యతిరేకంగా తెలంగాణ సిఎం పదవిలో ఉన్న రేవంత్‌రెడ్డి ముస్లింలను రెచ్చ గొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాల వాటా నిధులను 10శాతం మేర పెంచిన ఘనత ప్రధాని మోదీదన్నారు. సన్నబియ్యం పథకానికి కేంద్ర ప్రభుత్వం 80 శాతం నిధులు అందిస్తోందని తెలిపారు. తెలంగాణలో జాతీయ రహదారుల అభివృద్ధి కోసం రూ.1.85 లక్షల కోట్లు మంజూరు చేశా మని, రాష్ట్రానికి ఐదు వందే భారత్ రైళ్లు, ఆరు అమృత భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఇచ్చామని పేర్కొన్నారు. అలాగే 42 రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తున్నామని, తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులను కేటాయించామని తెలిపారు. ఈ అభివృద్ధి పనులు రాహుల్ గాంధీ ఇచ్చారా? లేక కేసీఆర్ తెచ్చారా? అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. బీజేపీ ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేసే పార్టీ అని స్పష్టం చేశారు. అందుకే ప్రజలు వరుసగా మూడుసార్లు కేంద్రంలో బీజేపీకి అధికారాన్ని ఇచ్చారని, ప్రస్తుతం దేశంలోని 21 రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలు ఉన్నాయని వివరించారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో ఎనిమిది ఎంపీ స్థానాలు గెలిచామని, రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. తెలంగాణకు కేంద్రం ఏమిచ్చిందని ప్రశ్నిస్తున్న వారికి రాష్ట్రంలో అభివృద్ధి పనులే సమాధానమని పేర్కొన్నారు. బీజేపీ ఏ హామీ ఇచ్చినా తప్పకుండా అమలు చేస్తుందని, కాంగ్రెస్‌లా మాట ఇచ్చి మోసం చేసే పార్టీ కాదన్నారు. ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ దిగజారి మాట్లాడుతోందని విమర్శించారు.

# కాంగ్రెస్, బిఆర్ఎస్‌కు ఇక నిద్రలేని రాత్రులే

## ప్రధాని నరేంద్ర మోడీ ట్వీట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 10:** తెలంగాణ పర్యటన ముగిసిన తర్వాత ప్రధాని నరేంద్రమోడీ థాంక్యూ హైదరాబాద్ అని ట్వీట్ చేశారు. హైదరాబాద్ సభలో ప్రజల ఉత్సాహంతో కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌కు ఇక నిద్రలేని రాత్రులే ఉంటాయని పేర్కొన్నారు. ఔట్‌డేటెడ్ పాలిటిక్స్, దుష్పరిపాలనతో తెలంగాణ ప్రజలు విసిగిపోయారని, బిజెపియే వారి ఎంపిక అని అన్నారు.

# కాంగ్రెస్, బిఆర్ఎస్ తోడుదొంగలు

## ఆ పార్టీల పాలనలో ప్రజల చేతికి చిప్ప వచ్చింది

### బిజెపి ఒబిసి మోర్చా జాతీయ అధ్యక్షుడు ఎంపి లక్ష్మణ్

**హైదారబాద్, మే 10, ప్రభాతవార్త:** బిఆర్‌ఎస్, కాంగ్రెస్ ఈ రెండు పార్టీల పాలనలో తెలంగాణ ప్రజల చేతికి చిప్ప చేతికి వచ్చిందని బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు , ఎంపి లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో ఉమ్మడి ఎపికి రూ.1000 కోట్లు కేటాయిస్తే.. ఇప్పుడు కేవలం తెలంగాణకే వేల కోట్లు మోడీ ఇచ్చారని వివరించారు. కాంగ్రెస్ అంటే.. కరప్షన్ అని మండిపడ్డారు.మొసలి కన్నీరు కార్చే వీళ్ళు ఎస్సీ, ఎస్టీ, మహిళలకు తీవ్ర అన్యాయం చేశారని దుయ్యబట్టారు. బెంగాల్ ఎన్నికల్లో మహిళలు అంతా కలిసి మమతను ఓడించారని, బిజెపికి పట్టం కట్టారని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో తెలంగాణలోనూ బిజెపిని అధికారంలోకి తేవాలని పిలుపునిచ్చారు.

# 12న కెసిఆర్ కీలక సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 10:** ఈనెల 12వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఎర్రవెల్లి నివాసంలో, బిఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన కీలక సమావేశం జరగనున్నది.ఈ సమావేశంలో బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్,పార్టీ ప్రధాన కార్యదర్శులు, మండలి, శాసనసభాపక్షాల ఉప నాయకులు పాల్గొంటారు. మధ్యాహ్నం లంచ్ అనంతరం జరగనున్న ఈ సమావేశంలో.. పార్టీ సంస్థాగత నిర్మాణం, సభ్యత్వం, పార్టీ ఇన్చార్జిల నియామకం సహా పార్టీ బలోపేతం తదితర ముఖ్య విషయాలపై చర్చ జరుగుతుందని పార్టీ నేతలు పేర్కొన్నారు.

# నకిలీ పోస్టులు పెడితే ఖబడ్దార్

## ఎమ్మెల్యే రాజాసింగ్ హెచ్చరిక

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ తన పేరుతో సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తన పేరును వాడుకుంటూ నకిలీ ఖాతాల ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆయన ఆదివారం హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత కొంత కాలంగా ఫేస్ బుక్, ఇన్ స్టాగ్రామ్ వంటి వేదికల్లో నకిలీ ఖాతాల ద్వారా అభ్యంతరకరమైన వ్యాఖ్యలు, కల్పిత వార్తలు పోస్టు చేస్తున్నట్లు గుర్తించారు. తప్పుడు ఐడీతో పోస్టులు చేస్తున్న ఫేస్ బుక్ ఐడీలను తన ఫిర్యాదులో పేర్కొంటూ ఇలాంటి చర్యలు శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఉన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రజలకు తన సోషల్ మీడియా ఖాతాలపై క్లారిటీ ఇచ్చారు.

# కాంగ్రెస్‌కు ఎటిఎంలా తెలంగాణ

## బెంగాల్‌కే బాద్ తెలంగాణలో బిజెపి సర్కార్

### బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**హైదారబాద్, మే 10, ప్రభాతవార్త:** జైశ్రీరామ్ అని బరాబర్ నినదిస్తామని బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. జైశ్రీరామ్ అంటే పైసలు వస్తాయా అని కాంగ్రెస్ విమర్శిస్తోందని దుయ్యబట్టారు. హిందువులను, శ్రీరాముడిని తూలనాడిన మమతా బెనర్జి, స్టాలిన్, కెసిఆర్‌కు పట్టిన గతే రేవంత్‌కు పట్టబోతోందని హెచ్చరించారు. రేవంత్ ప్రభుత్వం ఢిల్లికి మూటలు మోసేందుకే పరిమితమైందని మండిపడ్డారు. తెలంగాణ కాంగ్రెస్‌కు ఎటిఎంగా, బంగారుగుడ్డు పెట్టే బాతుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మజ్లిస్‌కు కట్టబెట్టేందుకే జిహెచ్ఎంసిని మూడు ముక్కలు చేశారని దుయ్యబట్టారు. రిజర్వేషన్ల బిల్లును అడ్డుకుని ఎస్సి ఎస్టిబిసిలను మోసం చేసిన ఇండియా కూటమికి తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నేరాల్లో తెలంగాణ అగ్రగామిగా ఉన్న విషయాన్ని సైబర్ క్రైమ్ నివేదిక వెల్లడించిందన్నారు. రేవంత్ ప్రభుత్వం తెలంగాణలో గుళ్లను కూలుస్తూ హిందూ వ్యతిరేకతను చాటుకుంటోందని మండిపడ్డారు. వరి, మొక్కజొన్న కొనుగోళ్లు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి ఏ పార్టీతో పొత్తులు ఉండవని ఏలేటి స్పష్టం చేశారు.కుటుంబ పాలన దేశంలో అంతరించిపోతోందని, కమలం వికసిస్తోందని అశ్వమేధ యాగం మొదలైందని ప్రకటించారు. బెంగాల్‌కే బాద్ తెలంగాణమే బిజెపి సర్కార్ అని స్పష్టం చేశారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించే సత్తా రేవంత్‌కు లేదు

## బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎంపి ఈటల

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను పరిష్కరించే సత్తా రేవంత్‌రెడ్డికి లేదని బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎంపి ఈటల రాజేందర్ విమర్శించారు. నాడు కుటుంబ పాలనతో కెసిఆర్ రాష్ట్రాన్ని దోచుకుంటే నేడు రేవంత్ సర్కారు పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోతోందని ఆరోపించారు. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న భూములను అమ్ముకుని ఢిల్లీకి లక్షల కోట్లను ముట్టజెప్పాలన్న యావ తబితే రేవంత్ సర్కారుకు ప్రజా సమస్యల పరిష్కారంపై ధ్యాస లేదని మండిపడ్డారు. ఈ మేరకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోది తెలంగాణకు వందల కోట్లు ఇస్తే.. పత్రికల్లో ప్రకటనలను రాష్ట్ర ప్రభుత్వం, ప్రధాని ఢిల్లీ వెళ్లగానే ఏం ఇచ్చారని ప్రశ్నిస్తుందని దుయ్యబట్టారు. కేంద్రం లక్షల కోట్ల నిధులను తెలంగాణకు ఇచ్చిందని, కేంద్రం నిధులు లేకపోతే పంచాయతీ, మున్సిపాలిటీల్లో కార్మికులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి రేవంత్ సర్కార్‌దని దుయ్యబట్టారు. అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పాలనలో ఇబ్బందులు పడుతున్నారని, తెలంగాణను కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌నుండి రక్షించడం బిజెపితోనే సాధ్యమన్నారు. పశ్చిమ బెంగాల్‌లో ప్రజల ఆత్మగౌరవం బిజెపి రూపంలో గెలిచిందని, రాబోయే రోజుల్లో తెలంగాణలోనే అవే ఫలితాలు రిపీట్ కాబోతున్నాయన్నారు.

# ప్రధాని మోడీ మా ఇంటి రావడం గొప్ప అనుభూతిని కలిగించింది

## ఆయన చూపిన ఆదరణ ఎంతో విలువైనది, ఎప్పటికీ గుర్తుంచుకుంటాను

### ఎక్స్‌లో ట్వీట్ చేసిన ఎపి డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసానికి భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రావడం గొప్ప అనుభూతిని కలిగించిందని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. తన ఆరోగ్య పరిస్థితి గురించి వ్యక్తిగతంగా తెలుసుకోవడానికి ప్రధాని సహృదయంతో విచ్చేయడం ఆయనలోని ఆప్యాయత, అనురాగం, మానవతావాద నాయకత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయన్నారు. ప్రధాని తన ఇంటికి రావడంపై పవన్ కళ్యాణ్ ఎక్స్ వేదికగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ ట్వీట్ చేస్తూ.. నా సతీమణి అన్నా కొణిదల, మా పిల్లలైన కొణిదల అకీర నందన్, కొణిదల ఆద్య, కొణిదల పోలినా అంజని, మాస్టర్ కొణిదాల మార్క్ శంకర్‌లతో కలిసి సాదరంగా స్వాగతం పలికే గొప్ప గౌరవం నాకు దక్కింది. నా ఆరోగ్య పరిస్థితి గురించి వ్యక్తిగతంగా తెలుసుకోవడానికి ఆయన సహృదయంతో విచ్చేయడం ఆయనలోని ఆప్యాయత, అనురాగం, మానవతావాద నాయకత్వాన్ని ప్రతిబింబిస్తునాయి. ఆయనకు తీరిక లేని కార్యక్రమాలు, అపారమైన బాధ్యతలు ఉన్నప్పటికీ, సమయం కేటాయించిన ఇంటికి వచ్చి అండనిచ్చారు. ప్రధాన మంత్రి మోడీ చూపిన ఈ ఆదరణను ఎంతో విలువైనదిగా భావిస్తాను. ఎప్పటికీ గుర్తుంచుకుంటాను .ఏప్రిల్ 19న నా శస్త్రచికిత్స జరిగిన వెంటనే, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వ్యక్తిగతంగా ఫోన్ చేసి నా ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు, ఈ క్లిష్ట సమయంలో నాకు హృదయపూర్వక భరోసా, మద్దతును అందించారు. ఇప్పుడు నేను కోలుకుంటున్న సమయంలో, నా నివాసానికి ప్రధాని రావడం అనేది నేను ఎప్పటికీ గుర్తుంచుకునే సందర్భమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రతి ఒక్కరినీ తమ కుటుంబ సభ్యుల్లా చూస్తారు. ఆయన తన ఆలోచనలు, చేతలలో ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమానికే ప్రాధాన్యత ఇస్తారు. ఇదే ఆయన్ని నిజంగా విశిష్టమైన వ్యక్తిగా నిలుపుతుంది. దేశానికి నాయకత్వం వహించే అపారమైన బాధ్యతను మోస్తున్నప్పటికీ, ఆయన కరుణ, వ్యక్తిగత శ్రద్ధ, ప్రజలతో ఆయనకున్న భావోద్వేగ అనుబంధం ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయన్నారు. ప్రధానమంత్రి శ్రద్ధకు, ఆయన సుహృద్భావంతో కూడిన మాటలకు, మాతో గడిపిన విలువైన సమయానికి నేను ఎంతగానో చలించిపోయాను. ఆయన ఆశీస్సులు, మార్గదర్శనం, ఆప్యాయమైన మద్దతు నాకు ఎప్పటికీ ప్రత్యేకంగా నిలిచిపోతాయి. ఈ చిరస్మరణీయ పర్యటనకు, ఆయన నిరంతర మార్గదర్శనానికి, ప్రోత్సాహానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ట్వీట్ చేశారు.




# తమిళ ప్రొటెం స్పీకర్‌గా చోళవందాన్ ఎమ్మెల్యే కరుప్పయ్య

**చెన్నై, మే 10:** తమిళనాడు అసెంబ్లీ ప్రొటెం స్పీకర్‌గా టీవీకేఎమ్మెల్యే ఎం.వి. కరుప్పయ్య నియమితులయ్యారు. సోమవారం నాడు, కొత్తగా ఎన్నికైన సభ సమావేశం కానున్న నేపథ్యంలో, ఈ నియామకం జరిగింది. గతంలో అన్నాడీఎంకేలో కీలక నేతగా ఉన్న ఆయన, ఆ పార్టీలో ప్రాధాన్యత తగ్గడంతో ఈ ఏడాది ప్రారంభంలో విజయ్ నేతృత్వంలోని టీవీకేలో చేరారు. చోళవందాన్ నియోజకవర్గ ఎమ్మెల్యే అయిన కరుప్పయ్యను ప్రొటెం స్పీకర్‌గా నియమించారు. ఆయన కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో ప్రమాణ స్వీకారం చేయించడంతో పాటు, సభ తొలి సమావేశాలను పర్యవేక్షిస్తారు. 1980 నుంచి అన్నాడీఎంకేలో ఉన్న కరుప్పయ్య, 2011లో ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే, 2016, 2021 ఎన్నికల్లో టికెట్ లభించకపోవడంతో అసంతృప్తికి గురయ్యారు. ఈ క్రమంలో టీవీకేలో చేరారు. 2026 ఎన్నికల్లో టీవీకే అభ్యర్థిగా చోళవందాన్ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ఎమ్మెల్యేందరితోనూ ప్రమాణస్వీకారంచేయించి, పూర్తికాలపు స్పీకర్ ఎన్నిక పూర్తయ్యేవరకూ ఆయనే స్పీకర్‌గా కొనసాగుతారు.

# జనగణనలో ఒబిసి కాలమ్ పెట్టకపోవడం మోడీకి తగదు

## ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదారబాద్, మే 10, ప్రభాతవార్త:** జనగణనలో ఒబిసి కాలమ్ పెట్టకపోవడం భారత ప్రధానమంత్రి ఒబిసిలకు సమాధానం చెప్పాలని ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ ఒబిసి రిజర్వేషన్ విషయంలో తెలంగాణ ప్రభుత్వంతీసుకొన్న నిర్ణయంకు మోడీ స్పందిచి సహకరించాలని ఆయన కోరారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన బిల్లును,మహిళా రిజర్వేష్‌బిల్లును రెండింటిని కలిపిపెట్టడం వల్లే ఇండి కూటమి వ్యతిరేకించిందని మహిళా రిజర్వేషన్ బిల్లు విడిగా తీసుకొస్తే ప్రత్యేక సమావేశం పెడితే మద్దతు ఇస్తామని మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకం కాదని ఆయన తెలిపారు. 2026జనాభాలెక్కల ప్రకారం మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీపై స్పష్టత ఇవ్వాలని కోరారు.విభజన చట్టం సమస్యలు పరిష్కరించాలని కోరారు. వికసిత్ భారత్‌లో భాగంగా మూడు ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ చేయాలనే సిఎం రేవంత్‌కు సహకరిస్తే2047 నాటికి భారత్ 30 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా రూపొందుతోందని చామల తెలిపారు.

# శివారు హైదరాబాద్‌లో వెహికల్ రికవరీ ఏజెంట్ హత్య

**హైదరాబాద్ (సరూర్‌నగర్), మే 10, ప్రభాతవార్త:** శివారు హైదరాబాద్‌లో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ఆదివారం ఉదయం వెంకటాపూర్ బురాన్‌ఖాన్ చెరువు సమీపంలో ఉస్మాన్‌నగర్ వద్ద అసంపూర్తి నిర్మాణం జరిగిన పాత కట్టడం వద్ద ఓ యువకుని శవం కనిపించడంతో గమనించిన స్థానికులు బాలాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. ఈ నేపథ్యంలో సంఘటనా ప్రాంతానికి చేరుకొన్న పోలీసులు విచారణ జరిపి హతుడు కుర్మల్‌గూడ ఇందిరానగర్‌లో నివసిస్తున్న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం లక్నో సుల్తాన్‌పూర్ ప్రాంతానికి చెందిన ఆదిత్ పాండే (24)గా నిర్ధారించారు. ప్రైవేటుగా వాహనాల జప్తు చేసే ఉద్యోగి (వెహికిల్ రికవరీ ఏజెంట్) అయిన పాండేను మున్నా అనే వ్యక్తి తీసుకెళ్ళినట్లు పోలీసుల దర్యాప్తులో తెలిసింది. రికవరీల విషయంలో జరిగిన గొడవలో కక్ష పెట్టుకొని హత్య చేసి ఉండవచ్చని భావిస్తున్నారు. హత్యకు గురైన పాండే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. సంఘటనా స్థలాన్ని శంషాబాద్ డిసిపి రాజేశ్ ఆదిభట్ల ఎసిపి ప్రదీప్‌కుమార్‌రెడ్డి, బాలాపూర్ ఇన్స్‌పెక్టర్ సుధాకర్‌తో కలిసి పరిశీలించారు. కాగా హత్యకు గురైన పాండేకు భార్య, సంవత్సరం వయస్సున్న కూతురు ఉంది. హత్యకు గల కారణాలపై అన్ని కోణాల నుండి దర్యాప్తు జరుగుతున్నదని డిసిపి తెలిపారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంలు సంఘటనా ప్రాంతంలో విచారణ జరిపాయి. కేసును బాలాపూర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



ఆదిత్ పాండే (ఫైల్)

# నాపై రాజకీయ కుట్ర జరుగుతోంది

## కాలమే అన్ని వాస్తవాలను బయటపెడుతుంది

### కేంద్రమంత్రి బండి సంజయ్ ఎమోషనల్ ట్వీట్

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్ర పర్యటనకు వచ్చిన సమయంలో తన ప్రతిష్టను దెబ్బతీయాలని కుట్ర చేస్తున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. కుమారుడిపై ఆరోపణల నేపథ్యంలో ఆయన సోషల్ మీడియాలో ఎమోషనల్ ట్వీట్ చేశారు. తన జీవితం మచ్చలేనిదని స్పష్టం చేశారు. ఎప్పుడూ చట్టాన్ని గౌరవించి, రాజ్యాంగానికి కట్టుబడి ఉన్నట్లు తేల్చి చెప్పారు. అయితే తన ఎదుగుదలను సహించలేక కొందరు రాజకీయంగా ఇబ్బంది పెట్టడానికి కుట్ర చేస్తున్నారని వ్యాఖ్యానించారు. తన ప్రజా జీవితం అంతా చట్టబద్ధంగా, మచ్చలు లేకుండా గడిపానని పేర్కొన్నారు. బండి సంజయ్ కుటుంబసభ్యులను, పిల్లలను రాజకీయాల్లోకి లాగడం ప్రతిపక్ష నేతల ధైర్యం లేని నిస్సహాయతను ఎత్తి చూపుతోందని పేర్కొన్నారు. బిసి సామాజికవర్గం నుండి వచ్చిన తాను కష్టపడి కార్పొరేటర్‌గా, ఎంపీగా, కేంద్ర మంత్రిగా ఎదిగానని, తన ఈ రాజకీయ ప్రయాణాన్ని కొందరు జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. ఈ క్రమంలోనే తనపై, తన కుటుంబంపై రాజకీయ కుట్రకు తెర లేపారని స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థపై పూర్తి విశ్వాసం ఉందని, కాలం అన్ని వాస్తవాలు బయటపెడుతుందని చెప్పారు. సత్యమేవ జయతే అని ట్వీట్‌ను ముగించారు.

# డబుల్ ఇంజిన్ సర్కార్ అధికారంలోకి వస్తేనే.. తెలంగాణ అభివృద్ధి సాధ్యం

## ఎంపి డికె అరుణ

**హైదారబాద్, మే 10, ప్రభాతవార్త:** డబుల్ ఇంజన్ సర్కార్ అధికారంలోకి వస్తేనే.. తెలంగాణ అభివృద్ధి సాధ్యం అవుతుందని ఎంపి డికె అరుణ పేర్కొన్నారు. సికింద్రాబాద్ పెరేడ్‌గ్రౌండ్ బహిరంగ సభలో మాట్లాడారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బిజెపి మూడు రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిందన్నారు. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో నరేంద్ర మోడీపై విశ్వాసంతో బిజెపిని అధికారంలోకి తీసుకువచ్చారని, నెక్స్ట్ టార్గెట్ తెలంగాణ అన్నారు. మోడీని చూసేందుకు తరలివచ్చిన జనంతో హైదరాబాద్, సికింద్రాబాద్ జనసంద్రంగా మారిందన్నారు. గొప్ప నమ్మకం, విశ్వాసం ప్రజల్లో నింపుకున్న నాయకుడు మన నరేంద్ర మోడీ అన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో మళ్ళీ మళ్ళీ బిజెపిని ప్రజలు గెలిపిస్తున్నారని అన్నారు. పశ్చిమ బెంగాల్ లాంటి రాష్ట్రంలో కూడా బిజెపిని గెలిపిం చారంటే నరేంద్ర మోడీ దేశ భవిష్యత్‌ను తీర్చి దిద్దాలని ప్రజలు భావిస్తున్నారని అన్నారు. వికసిత్ భారత్ లక్ష్యం నరేంద్ర మోడీతోనే సాధ్యం అని ప్రజలు విశ్వసిస్తున్నారని అన్నా రు. వికాసిత్ భారత్‌లో ప్రతి రాష్ట్రం అభివృద్ధి చెందాలని తెలంగాణలో పదివేల కోట్లరూపాయలు నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్స వాలు ప్రధాని మోడీ చేశారన్నారు. నీళ్ళు, నిధులు, నియామకాల నినాదం నెరవేరలేదు. బిఆర్ఎస్, కాంగ్రెస్‌లు హామీలతో అన్ని వర్గాలను ప్రజలను మోసం చేశాయని, భవిష్యత్‌లో తెలంగాణ ప్రజల కల సాకారం కావాలని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలంటే, కలలు కన్న తెలంగాణ సాకారం కావాలి అంటే తెలంగాణలో బిజెపి రావాలన్నారు. పశ్చిమ బెంగాల్ మాదిరి తెలంగాణలో బిజెపిని అధికారంలోకి తీసుకువద్దామంటూ పిలుపునిచ్చారు.



# గోదావరిలో మునిగి ఇద్దరు యువకులు మృతి

## ప్రాణాలు తీసిన ఈత సరదా

**ప్రభాతవార్త, ఏటూర్ నాగారం, మే 10:** గోదావరి నదిలో మునిగి ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది . మృతుల బంధువులు తెలిపిన వివరాల ప్రకారం కన్నాయిగూడెం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ నరేష్, సంపత్, రొయ్యూరు గ్రామానికి చెందిన జిట్టా విశ్వవర్ధన్ వయస్సు 19 సంవత్సరాలు ముగ్గురు యువకులు సరదాగా ఈత కొట్టేందుకు గోదావరి నదిలో ఆదివారం దిగగా విశ్వవర్ధన్ నది ప్రవాహంలో చిక్కు కోగా కాపాడేందుకు నరేష్ ప్రయత్నించగా ఇద్దరూ నీట మునిగి చనిపోయారని సంపత్ ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నట్లు తెలిపారు. మృతుల సమాచారం అందుకున్న పోలీసులు గజ ఈతగాళ్ల జాలర్లచే గాలింపు చర్యలు చేపట్టగా నరేష్ విశ్వవర్ధన్ మృతదేహాలను వెలికి తీశారని తెలిపారు . మృతి చెందిన నరేష్‌కు భార్య కుమారుడు కుమార్తె ఉన్నట్లు వారు తెలిపారు. విశ్వవర్ధన్ మృతి చెందడంతో చేతికి అంది వచ్చిన కొడుకు మృతి చెందడంతో వారి కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. యువకుల మృతితో ఆయా గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# టిఎంసిలో కుమ్ములాటలు



**అవినీతి, లాబీయింగ్, వర్గపోరాటాలతోనే ఓటమి**

**మమత, అభిషేక్‌లపై నాయకుల విమర్శల దాడి**

**ముగ్గురు నేతలను ఆరేళ్లు పార్టీ నుంచి బహిష్కరణ**

**కోల్‌కతా, మే 10:** పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ ఘోర పరాజయం పాలవడంతో ఆ పార్టీలో కుమ్ములాటలు, అంతర్గత కలహాలు వెలుగుచూస్తున్నాయి. ఎమ్మెల్యేలు, ఎంపిలతోపాటు, మాజీ మంత్రులు సైతం పార్టీ అగ్రనేతల తీరును బాహాటంగా ఎండగడుతున్నారు. పార్టీ అధినేత్రి మమతా బెనర్జీపైనే మాజీ క్రీడల శాఖ సహాయ మంత్రి, క్రికెట్ మనోజ్ తివారీ విమర్శలు గుప్పించారు. మమత ప్రభుత్వం అవినీతిమయమైనదని తీవ్ర ఆరోపణలు చేశారు. ఎంపి, నటుడు దేవ్ వంటి ఇతర టిఎంసి నాయకులు కూడా పార్టీ నాయకత్వానికి వ్యతిరేకంగా మాట్లాడటం ప్రారంభించారు. కొందరు అయితే, ఈ ఎన్నికల పరాజయానికి ప్రధాన కార్యదర్శి, మమతా మేనల్లుడు అయిన అభిషేక్ బెనర్జీనే కారణమని కూడా నిందించారు.

"లాబీలు, లాబీలు, లాబీలు. పార్టీ లాబీయింగ్, వర్గపోరాటాలతో కలుషితమైంది" అని ముర్షిదాబాద్ జిల్లాలోని హరిహరపారా నుంచి గెలిచిన టిఎంసి ఎమ్మెల్యే నియామోత్ షేక్ అన్నారు. పార్టీలో వర్గపోరాటాలకు నాయకత్వం అవకాశం కల్పించిందని, అదే చివరికి ఓటమికి దారితీసిందని అన్నారు. అలాగే, హుమాయున్ కబీర్‌ని టిఎంసి నుంచి సస్పెండ్ చేయడంతో మైనారిటీల ఆధిపత్యం ఉన్న ప్రాంతాల్లో పార్టీ ఓటమికి ముస్లింల ఓట్లలో చీలికే కారణమని ఎమ్మెల్యే అఖ్రుజ్జమాన్ పేర్కొన్నారు. అదే సమయంలో హిందువుల ఓట్లు బిజెపి వైపు ఏకమయ్యాయి" అని అన్నారు. ఓటమిని అంగీకరించడంలో, ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడానికి నిరాకరించడం మమత నిర్ణయం ప్రజల్లో మరింత చులకన చేస్తోందని అభిప్రాయపడ్డారు. మాల్దా జిల్లాలోని సుజాపూర్ టిఎంసి ఎమ్మెల్యే సబీనా యాస్మిన్ సంస్థాగత లోపాలను అంగీకరించారు, కానీ మరిన్ని వివరాలు చెప్పడానికి నిరాకరించారు. మరో టిఎంసి ఎమ్మెల్యే అయిన అబ్బుర్ రహీం బోక్సీ, ఎన్నికల్లో తమ పార్టీ పరాజయానికి ఎన్నికల సంఘం చేపట్టిన వివాదాస్పద స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కారణమని ఆరోపించారు. కాశీపూర్-బెల్గాచియా అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఓడిపోయిన కోల్‌కతా మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్, అతిన్ ఘోష్, తమ ఓటమికి "మూడు ప్రధాన కారణాలను" పేర్కొన్నారు. "ఒకటి మతపరమైన ధ్రువీకరణ. హిందువులు బిజెపికి ఓటు వేశారు. రెండవది ఎస్ఐఆర్‌లో ఓటర్ల పేర్లను తొలగించడం, మూడవది రాష్ట్రవ్యాప్తంగా తాము ఎదుర్కొన్న భారీ ప్రభుత్వ వ్యతిరేకత" అని వివరించారు. ఇదిలా ఉండగా, ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీ వ్యతిరేక వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై టిఎంసి పార్టీ అధికార ప్రతినిధులు రిజు దత్తా, కృష్ణేందు చౌదరి, కోహినూర్ మజుందార్, పాపియా ఘోష్, కార్తిక్ ఘోష్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేయబడ్డాయి. "పార్టీ క్రమ శిక్షణను ఉల్లంఘించినందుకు" వారిపై క్రమశిక్షణా చర్యలు ఎందుకు తీసుకోకూడదో తెలపాలని పేర్కొన్నారు.



## ప్రధాని పర్యటన ప్రాంతానికి కొద్దిదూరంలోనే జిలెటిన్ స్టిక్స్ లభ్యం

**బెంగళూరు, మే 10:** కర్ణాటకలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటించే ప్రాంతానికి సమీపంలో పేలుడు పదార్థాలు లభ్యం కావడంతో భద్రతా సంస్థలు ఒక్కసారిగా అప్రమత్తమయ్యాయి. బెంగళూరు శివార్లలోని కనకపుర రోడ్డులో ఉన్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ అంతర్జాతీయ కేంద్రానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రావడానికి కొద్ది గంటల ముందు, దీనికి సమీపంలోని ఫుట్‌పాత్‌పై రెండు జిలెటిన్ స్టిక్స్ లభ్యమయ్యాయి. ఆదివారం ఉదయం భద్రతా బలగాలు సాధారణ తనిఖీలు నిర్వహిస్తుండగా, కాగలిపుర సమీపంలోని ఒక ఆశ్రమం వద్ద ఫుట్‌పాత్ పక్కన ఈ అనుమానాస్పద వస్తువులు కనిపించాయి. ఈ పేలుడు పదార్థాలు దొరికిన ప్రాంతం ప్రధాని పాల్గొనే కార్యక్రమ వేదికకు కేవలం 3 కిలోమీటర్ల దూరంలోనే ఉంది.

వెంటనే బాంబు స్క్వాడ్, ఫోరెన్సిక్ బృందాలు రంగంలోకి దిగి ఆ ప్రాంతాన్ని ఆధీనంలోకి తీసుకున్నాయి. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఒక అనుమానితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారని సమాచారం. ఇవి మైనింగ్ కోసం వాడేవా లేక ప్రధాని పర్యటనను లక్ష్యంగా చేసుకున్న కుట్రలో భాగమా అనే కోణంలో దర్యాప్తు జరుగుతోంది.

# సానుకూలంగా కొత్త ఆర్థికం

**పెరిగిన సొంత పన్నుల రాబడి, ఒక్క నెలలో రూ.4,621 కోట్ల ఆదాయం,**

**జీఎస్టీ, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్లలో బలమైన వృద్ధి, గత ఏడాది కంటే 35 శాతం పెరుగుదల**

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వానికి ప్రస్తుత 2026-27 కొత్త ఆర్థిక సంవత్సరం సానుకూలంగా ప్రారంభమైంది. ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఏప్రిల్ నెలలో రాష్ట్ర సొంత పన్నుల రాబడి గణనీయంగా పెరిగింది. జీఎస్టీ వసూళ్లు, ఎక్సైజ్ రాబడి, ఆస్తి రిజిస్ట్రేషన్లలో బలమైన వృద్ధి కారణంగా ఈ పెరుగుదల నమోదైంది. ఆర్థిక సంవత్సరం మొదటి నెలలో కనబరిచిన ఈ బలమైన పనితీరు, నిలకడైన ఆర్థిక వేగం, అధిక వినియోగం, అన్ని రంగాలలో మెరుగైన పన్నుల చెల్లింపును ప్రతిబింబిస్తున్నాయని ఆర్థిక శాఖ అధికారులు తెలిపారు.

తెలంగాణలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు ఏప్రిల్ 2026లో గతేడాది 2025 అదే నెలతో పోలిస్తే 35 శాతం భారీగా పెరిగాయి. ఏప్రిల్ 2025లో సొంత పన్నుల ద్వారా సమకూరిన రూ.3,422 కోట్లుగా ఉన్న ఆదాయం, ఏప్రిల్ 2026లో అది రూ. 4,621 కోట్లకు చేరింది. ఆర్థిక శాఖ అధికారులు తెలిపిన గణాంకాల ప్రకారం, జీఎస్టీ అమలులోకి వచ్చినప్పటి నుండి ఏప్రిల్ నెల వసూళ్లు అత్యధిక నెలవారీ వసూళ్లుగా నిలిచాయి. ఇది మార్చి 2026లో నమోదైన రూ 4,231 కోట్ల మునుపటి రికార్డును అధిగమించింది. రాష్ట్రంలో కొనసాగుతున్న ఆర్థిక విస్తరణ, మెరుగైన పన్నుల చెల్లింపునకు ఈ వృద్ధి నిదర్శనమని ఆ శాఖ తెలిపింది. జనవరి 2026 నుండి గత నాలుగు నెలలుగా తెలంగాణలో జీఎస్టీ వసూళ్లు స్థిరంగా రూ.4 వేల కోట్లకు పైగా కొనసాగుతున్నాయని, ఇది ఆర్థిక కార్యకలాపాల లో బలమైన చురుకుదనాన్ని, స్థిరమైన ఆదాయ వృద్ధిని సూచిస్తోందని అధికారులు తెలిపారు. కీలక రంగాలలో పెరిగిన వ్యాపార కార్యకలాపాలకు, కొత్త పెట్టుబడులను ఆకర్షించిన వ్యాపార అనుకూల వాతావరణానికి, ఇప్పటికే ఉన్న సంస్థల విస్తరణను ప్రోత్సహించిన, వినియోగదారుల వ్యయాన్ని పెంచిన అంశాలకు ఈ పెరుగుదల కారణంగానే ఈ వృద్ధి సాధ్యమైందని వారు పేర్కొన్నారు.

ఆదాయ వసూళ్లను పెంచడంలో కఠినమైన నిబంధనల పాటింపు చర్యలు, మెరుగైన అమలు యంత్రాంగాలు కీలక పాత్ర పోషించాయని అధికారులు తెలిపారు. జీఎస్టీ వసూళ్లలో నిరంతర వృద్ధి రాష్ట్ర బలపడుతున్న ఆర్థిక స్థితిని, తెలంగాణ ఆర్థిక వ్యవస్థ యొక్క స్థితిస్థాపకతను ప్రతిబింబిస్తోందని వారు అన్నారు. ఇక ఏప్రిల్ నెలలో ఎక్సైజ్ శాఖ కూడా బలమైన ఆదాయ వృద్ధిని నమోదు చేసింది. గత ఏడాది ఏప్రిల్‌లో రూ.2,773 కోట్లతో పోలిస్తే, గత నెలలో మద్యం అమ్మకాల ద్వారా రాష్ట్ర ఖజానాకు రూ.2,993 కోట్లు సమకూరాయి. తెలంగాణ వ్యాప్తంగా రికార్డు స్థాయిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవ్వడం వల్ల వేసవిలో బీరుకు అపూర్వమైన డిమాండ్ ఏర్పడటమే ఈ పెరుగుదలకు ప్రధాన కారణమని అధికారులు తెలిపారు. ఇదే సమయంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఏప్రిల్ 2025లో రూ.1,115 కోట్ల ఆదాయాన్ని నమోదు చేయగా, గత నెలలో రూ.1,399 కోట్ల రాబడి నమోదు చేసింది. ఇది రూ. 284.43 కోట్ల పెరుగుదలను సూచిస్తుంది.

ప్రధానంగా హైదరాబాద్, రంగారెడ్డి, మెడ్చల్, భువనగిరి జిల్లాల్లో జరిగిన అధిక విలువ గల ఆస్తుల రిజిస్ట్రేషన్ల కారణంగా ఈ పెరుగుదల ప్రధానంగా చోటుచేసుకుంది. గత ఏడాది ఇదే నెలలో 1.45 లక్షల పత్రాలు నమోదు కాగా, ఈ ఏడాది ఏప్రిల్‌లో సుమారు 1.30 లక్షల పత్రాలు నమోదు అయ్యాయి.

గత నెలలో నమోదైన పత్రాల సంఖ్య తగ్గినప్పటికీ, రాబడి గణనీయంగా పెరిగిందని, ఇది ఆస్తి మార్కెట్‌లో అధిక లావాదేవీల విలువలను సూచిస్తోందని ఆర్థిక శాఖ అధికారులు తెలిపారు.

## మైనార్టీ అభ్యర్థులకు సివిల్స్‌లో ఫ్రీ కోచింగ్

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** సివిల్స్‌కి ప్రిపేర్ అవ్వాలనుకునే నిరుపేద అభ్యర్థులకు తెలంగాణ మైనార్టీ సంక్షేమశాఖ శుభవార్త చెప్పింది. హైదరాబాద్‌లోని తెలంగాణ మైనార్టీస్ స్టడీ సర్కిల్‌లో 2026-27 విద్యా సంవత్సరానికిగాను యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్‌కు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. ఆసక్తి కలిగిన అభ్యర్థుల కోసం ప్రకటన విడుదల చేసింది. అయితే ఇది కేవలం మైనార్టీ వర్గాలకు చెందిన నిరుపేద విద్యార్థులకు మాత్రమే వర్తిస్తుంది. వీరిలో అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 31 వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. మొత్తం 100 సీట్లను ఇందులో భర్తీ చేస్తారు. ఈ సీట్లలో మహిళలకు 33.33 శాతం, దివ్యాంగులకు 5 శాతం సీట్లు కేటాయిస్తారు. ఇక దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకి జూన్ 14న స్క్రీనింగ్ టెస్టు నిర్వహించి, మెరిట్ ఆధారంగా ఎంపిక చేసి ఉచిత కోచింగ్ ఇస్తారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు అన్ని జిల్లాల మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఆఫ్‌లైన్ విధానంలో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారు. కాగా ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, జైన్, బౌద్ధ, పార్సీ వంటి మైనార్టీ అభ్యర్థులు మాత్రమే ఈ ఉచిత కోచింగ్‌కు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని స్పష్టం చేశారు. అలాగే ఈ ఉచిత కోచింగ్ సౌకర్యం పొందాలనే అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.5 లక్షలలోపు ఉండాలని తెలిపారు. మెరిట్‌లో సీటు పొందిన అభ్యర్థులకు ఏడాది పాటు యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణ అందిస్తారు. కోచింగ్ సమయంలో డిజిటల్ తరగతి గదులు, అనుభవజ్ఞులైన బోధనా సిబ్బంది ద్వారా తరగతులు నిర్వహిస్తారు. ఇంటర్నెట్, వైఫై సదుపాయం ఉంటుంది. అవసరమైన వారికి ఉచిత వసతి, భోజన సదుపాయం కూడా కల్పిస్తారు. మరిన్ని వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని, లేదా పని దినాల్లో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 04023236112 ఫోన్ నంబర్‌ను సంప్రదించవచ్చని మైనార్టీ సంక్షేమశాఖ అధికారులు తెలియ చేశారు.

## రూ.9,377 కోట్ల విలువైన పనులకు మోడీ ప్రారంభోత్సవాలు,శంకుస్థాపనలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే10:** ఆదివారం నాటి తెలంగాణ పర్యటనలో మోదీ రాష్ట్రంలో రూ. 9వేల,377 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవం చేశారు. హెచ్ఐసీసీ నుంచి ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించడంతోపాటు శంకుస్థాపనలు చేశారు. హైదరాబాద్-పనాజీ ఎకనమిక్ కారిడార్‌తోపాటు ఎన్‌హెచ్167లో గుడె బల్లూర్ నుంచి మహబూబ్‌నగర్ వరకు 4 వరుసల రహదారి పనులకు ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్ట్ విలువ 3,175 కోట్ల రూపాయలు అని సమాచారం. ఆ తర్వాత జహీరాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా. 2,360 కోట్లతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీకి శంకుస్థాపన చేశారు. 1,243కోట్ల రూపాయలతో పూర్తి చేసిన కాజీపేట- విజయవాడ మల్టీ ట్రాకింగ్ మూడో రైల్వే లైన్ పనులు వర్చువల్‌గా ప్రారంభించారు. వరంగల్‌లో పీఎం మిత్ర టెక్స్‌టైల్ పార్క్‌ను ప్రారంభించారు. హైదరాబాద్ మల్కాపూర్‌లో పెట్రోలియం టెర్మినల్‌ను ప్రారంభించారు. హైటెక్ సిటీలో నూతనంగా నిర్మించిన సింధు ఆసుపత్రిని రిమోట్ ద్వారా ప్రారంభించారు.




ఆదివారం వివిధ అభివృద్ధి పనులకు వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తున్న ప్రధాని మోడీ. చిత్రంలో సిఎం రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, సంజయ్

## ముద్ర రుణాల్లో వెనుకబడిన తెలంగాణ

**21.44 శాతం నమోదు**

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** ముద్ర రుణాల మంజూరులో తెలంగాణ వెనుకబడింది. జనాభా ప్రాతిపదికన జాతీయ సగటుతో పోల్చి చూస్తే, తెలంగాణలో మంజూరైన ముద్ర ఖాతాల సంఖ్య, ఉండాల్సిన సాధారణ స్థాయి కంటే దాదాపు సగం మాత్రమే ఉంది. దీని పర్యవసానంగా, ఈ రుణాలు అందుబాటులో లేకపోవడం వల్ల ఉపాధి ఆశావహులైన యువత ఉద్యోగ అవకాశాలను కోల్పోతుండగా, చిన్న వ్యాపారులు తమ వ్యాపారాలను మరింత విస్తరించుకోలేకపోతున్నారు. ప్రధాన మంత్రి ముద్ర యోజన పథకం ద్వారా చిన్న వ్యాపారాల స్థాపన, విస్తరణకు వీలుగా ఎటువంటి పూచీకత్తు అవసరం లేని రుణాలను అందిస్తుంది. 2015, ఏప్రిల్ నుండి జనవరి ఈ ఏడాది జనవరి వరకూ కలిగిన మధ్య కాలంలో, దేశ వ్యాప్తంగా 56.31 కోట్ల ఖాతాల ద్వారా మొత్తం రూ.37.31లక్షల కోట్ల విలువైన రుణాలు మంజూరుచేయబడ్డాయి. ఇందులో గమనార్హమైన విషయం ఏమిటంటే, లబ్ధిదారులలో 70 శాతం మంది మహిళలే ఉండటం విశేషం. జనాభా పరిమాణాన్ని ప్రామాణికంగా తీసుకుంటే, అత్యధిక ఖాతాల సంఖ్య కలిగిన రాష్ట్రాల జాబితాలో పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, ఒడిశా మొదటి మూడు స్థానాల్లో నిలవడం విశేషం. అయితే, తెలుగు మాట్లాడే నాలుగు రాష్ట్రాలకు మాత్రం ఈ టాప్ 10 జాబితాలో చోటు దక్కలేదు. తెలంగాణలో ముద్ర రుణాల మంజూరు రేటు తక్కువగా ఉందని ప్రస్తావిస్తూ, వివిధ సంస్థలు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తులు సమర్పించినప్పటికీ, ఆ ప్రయత్నాల వల్ల ఎటువంటి ఫలితమూ దక్కలేదని అధికారులు చెబుతున్నారు.

## ఐదున్నర గంటల ప్రధాని పర్యటనలో

# అడుగడుగునా పోలీసు పహారా

**ఎపి సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌లతో భేటీ**

**రెండు చోట్ల కొద్దిసేపు రహదారుల మూసివేత**

**పెరేడ్ గ్రౌండ్స్‌లో బిజెపి బహిరంగ సభ వద్ద భారీ బందోబస్తు**

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం నాడు ఐదున్నర గంటల పాటు హైదరాబాద్ పర్యటనకు వచ్చిన వేళ ఆయన ప్రయాణించిన మార్గాలు, పాల్గొన్న కార్యక్రమాలు, పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన బిజెపి బహిరంగ సభ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం రెండు గంటల 20 నిమిషాల సమయంలో మోదీ కర్నాటక నుంచి బేగంపేట్ విమానాశ్రయానికి విమానంలో విచ్చేశారు. మోదీ రాక సందర్భంగా విమానాశ్రయం వద్ద ఉదయం నుంచే ఆంక్షలు అమలు చేశారు. విమానాశ్రయం పరిసర ప్రాంతాలలో నిషేధాజ్ఞలను విధించారు. ఇందుకోసం ఢిల్లీ నుంచి ఎస్‌పిజి కమెండోలతో పాటు మల్కాజిగిరి పోలీసులు రంగంలో దిగి విమానాశ్రయం పరిసరాలలో పహారా కాశారు. బేగంపేట్ విమానాశ్రయం రాగానే మోదీ నేరుగా మాదాపూర్‌లోని హెచ్ఐసిసికి రోడ్డు మార్గంలో ప్రయాణించి పలు అభివృద్ధి పథకాల కు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డితో పాటు కేంద్ర మంత్రి బండి సంజయ్ సహా పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయం 11 గంటల నుంచే హెచ్ఐసిసి ప్రాంగణంలో నిషేధాజ్ఞలను అమలు చేశారు. బేగంపేట్, హెచ్ఐసిసి మార్గంలో మధ్యాహ్నం 12 గంటల నుంచే పోలీసులను మొహరించి మోదీ ప్రయాణానికి అరగంట ముందు ఆంక్షలు విధించారు. హెచ్ఐసిసిలో జరిగిన కార్యక్రమాల తరువాత మోదీ నేరుగా హైటెక్ సిటీలో ఓ ఆసుపత్రి ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ మార్గంలో వాహనాల రాకపోకలను గంట పాటు నిలిపివేశారు. అనంతరం అక్కడి నుంచి నేరుగా మాదాపూర్‌లో ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఇంటికి మోదీ వెళ్లారు. అక్కడ అరగంట పాటు వుండి, అనంతరం జూబ్లీ హిల్స్‌లోని ఎపి సిఎం చంద్రబాబు నాయుడు ఇంటికి మోదీ వెళ్లారు. ఈ రెండు చోట్ల రహదారులు ఇరుకుగా వుండడంతో ఆ మార్గాలలో వాహనాల రాకపోకలను పోలీసులు కొద్దిసేపు నిలిపివేశారు. దీని తరువాత బేగంపేట్ విమానాశ్రయానికి రోడ్డు మార్గంలో వచ్చిన మోదీ అక్కడ కొందరు బిజెపి ముఖ్య నేతలతో భేటీ అయ్యారు. అనంతరం అక్కడి నుంచి సాయంత్రం ఆరున్నర గంటల ప్రాంతంలో పరేడ్ గ్రౌండ్స్‌లో బిజెపి నిర్వహించిన భారీ బహిరంగ సభలో మోదీ పాల్గొన్నారు. ఇక్కడ సుమారు గంటకు పైగా మోదీ వున్నారు. బిజెపి బహిరంగ సభకు జనం భారీగా రావడం, పార్టీ కార్యకర్తలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వుండేందుకు మల్కాజిగిరి పోలీసులు భారీ బందోబస్తు చేబట్టారు. మోదీ పాల్గొన్న వేదిక వద్ద ఎస్‌పిజి కమెండోలు భద్రతను పర్యవేక్షించగా మిగతా చోట్ల స్థానిక పోలీసులు బందోబస్తును చూశారు. పరేడ్ గ్రౌండ్స్‌లో బహిరంగ సభ ముగిసిన తరువాత మోదీ నేరుగా బేగంపేట్ విమానాశ్రయానికి రోడ్డు మార్గంలో చేరుకుని, రాత్రి ఎనిమిది గంటల సమయంలో వాయుసేన ప్రత్యేక విమానంలో నేరుగా గుజరాత్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా విమానాశ్రయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా మోదీ బేగంపేట్ విమానాశ్రయానికి వచ్చిన సమయంలో మధ్యాహ్నం వేళ ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలు నిరసన తెలపగా వారిని పోలీసులు వెంటనే అరెస్టు చేసి, మరో చోటికి తరలించారు.

## జనగణనలో కులగణన చేపట్టండి

**ప్రధానికి డి.సిఎం భట్టి వినతిపత్రం**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే10:** దేశ వ్యాప్తంగా జరుగుతున్న జనగణనలో బిసి కుల గణనకు సంబంధించి హౌజ్ హోల్డర్స్ కాలం 13లో లేదని , బిసి కుల గణనను కూడా చేర్చాలని ప్రధాని మోదిని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దిన్ కోరారు. ఈ మేరకు ప్రధానికి వీడ్కోలు సమయంలో వారు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రొటోకాల్ ఛైర్మన్ హర్కర్ వేణుగోపాల్ కూడా పాల్గొన్నారు.

**ప్రధానికి ఘనంగా వీడ్కోలు:** తెలంగాణ రాష్ట్ర పర్యటన ముగించుకుని గుజరాత్ వెళ్లిన ప్రధాని నరేంద్ర మోడీకి బేగంపేట ఎయిర్‌పోర్టులో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ ఘనంగా వీడ్కోలు పలికారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తోపాటు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, ఎంపిలు ఈటల రాజేందర్, డికె. అరుణ, కొండా విశ్వేశ్వరరెడ్డి, బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, రామారావుపటేల్ తదితరులు వీడ్కోలు పలికారు.

# బేగంపేట విమానాశ్రయంలో మోడీకి ఘనస్వాగతం

**పటిష్టమైన భద్రత నడుమ రోడ్డు మార్గంలో హెచ్ఐసీసీకి బయలు దేరిన మోడీ కాన్వాయ్**

**నిరసన వ్యక్తం చేసిన అమ్ ఆద్మీ,యూత్ కాంగ్రెస్, అదుపులోకి తీసుకున్న పోలీసులు**



ఆదివారం హైదరాబాద్‌లో కాన్వాయ్ నుంచే ప్రజలకు అభివాదం చేస్తున్న మోడీ



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళ

**హైదరాబాద్ (బేగంపేట) మే 10,ప్రభాతవార్త:** ప్రధానిగా మూడవ సారి బాధ్యతలు చేపట్టిన నరేంద్రమోదీ తొలిసారి తెలంగాణాకు వచ్చే క్రమంలో బేగంపేట విమానాశ్రయంలో కాలు మోపారు. బెంగుళూరు నుంచి ప్రత్యేక విమానంలో బయలు దేరిన ప్రధాని మోదీ గం 2.50 నిలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నారు. ముందు ప్రధాని 2.20లకు ఆయన బేగంపేట విమానాశ్రయానికి చేరుకోవాల్సి నప్పటికీ 30నిమిషాల ఆలస్యంగా గం2.50నిలకు చేరుకున్నారు. బేగంపేటకు చేరుకున్న ప్రధానికి విమానాశ్రయంలో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా,ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క ,మంత్రులు పొన్నం ప్రభాకర్,మహ్మద్ అజారుద్దీన్,డీజీపీ సీ.వీ.ఆనంద్ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు.అక్కడి నుంచి ప్రత్యేక కాన్వాయ్ బయలు దేరి రోడ్డు మార్గంలో బేగంపేట విమానాశ్రయం నుంచి హెచ్ఐసీసీకి బయలు దేరి వెళ్లారు.మోదీ రాక సందర్భంగా బేగంపేట విమానాశ్రయంతో పాటు ఆయన ప్రయాణించే రోడ్డు మార్గం మొత్తాన్ని పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేసారు. ప్రధాని రాక సందర్భంగా బేగంపేట విమానాశ్రయం పరిసరాలను ఎస్‌పీజీ దళాలు తమ అధీనంలోకి తీసుకున్నాయి.ప్రధాని నరేంద్ర మోదీ విమానాశ్రయం నుంచి బయటకు వచ్చి కాన్వాయ్ లో హెచ్ఐసీసీకి బయలు దేరి వెళుతున్న సమయంలో ఆయన అక్కడ ఉన్న వారికి కాన్వాయ్ లో నుంచి అభివాదం చేస్తూ ముందుకు సాగారు.ఇదే సమయంలో అమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేసారు. విమానాశ్రయం ఎదురుగా ప్రకాష్ నగర్ జంక్షన్ లో నినాదాలు చేస్తున్న ఇద్దరు కార్యకర్తలు పోలీసులు అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు.మోదీ కాన్వాయ్ విమానాశ్రయం ప్రకాష్ నగర్ మెయిన్ రోడ్డు దాటగానే మరో మహిళ జెండా పట్టుకుని నినాదాలు చేస్తూ రోడ్డుపైకి చేరుకుంది.మోదీ తెలంగాణాకు ఎందుకు వచ్చారనీ,ఏమిచ్చారని,పెద్దగా నినాదాలు చేసారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిపై కేసు నమోదైన విషయం కూడా అమ్ ఆద్మీ పార్టీ మహిళా కార్యకర్త ప్రస్తావించారు.ఆమె ఆందోళనకు దిగడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆమెను అక్కడి నుంచి తరలించే ప్రయత్నం చేసారు.ఇదే సమయంలో కొంత ఉద్రిక్తత చోటు చేసుకుంది.మహిళ మినహా జైసింగ్,బాబూలాల్, షైన్స్ ంగ్‌ను పోలీసులు గుర్తించారు.సీహెచ్ శైలేందును యూత్ కాంగ్రెస్ నాయకుడిగా పోలీసులు అనుమానిస్తున్నారు.

**కమల మయంగా బేగంపేట :** ప్రధాని మోదీ బేగంపేట రాక సందర్భంగా బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున ప్రధాని మోదీకి ఆహ్వానం పలుకుతూ భారీ ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేసారు.బేగంపేట విమానాశ్రయం నుంచి గ్రీన్ ల్యాండ్స్ జంక్షన్ తో పాటు పరేడ్ మైదానానికి వెళ్లే మార్గం మొత్తం బ్యానర్లు,ఫ్లెక్సీలతో నింపేశారు.దీంతో బేగంపేట నుంచి పరేడ్ మైదానం మార్గం మొత్తం కమల మయమైంది.

# గిరిజనుల సమగ్ర అభివృద్ధికి.. వ్యూహాత్మక ప్రణాళిక

**ఫలితాల ఆధారంగా రాష్ట్రాల పనితీరు**

**గిరిజన వ్యవహారాల కార్యదర్శి రంజనా చోప్రా**

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా గిరిజన వర్గాల సంపూర్ణ, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా కేంద్రం వ్యూహాత్మక ప్రణాళికను అమలు రూపొందించింది. ఈ మేరకు గిరిజన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సమ్మిళిత వృద్ధి, చివరి అంచె వరకు సేవల పంపిణీ, గిరిజన పౌరుల సాధికారత పట్ల నిబద్ధతను ప్రతిబింబించే విధంగా కార్యక్రమాలు చేపట్టినట్లు కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి రంజనా చోప్రా వెల్లడించారు. భారత ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎమ్ఒటిఎ), ధర్తీ ఆబా జనజాతియ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ (డిఎ-జెజియుఎ), ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసి మహా న్యాయ అభియాన్ (డిఎ-జెఎఎన్ ఎంఎఎన్),) గిరిజన అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని అంచనా వేయడానికి కేంద్ర లైన్ మంత్రిత్వ శాఖల సీనియర్ అధికారులు, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖల ముఖ్య కార్యదర్శులతో ఒక జాతీయ సమీక్షా సమావేశాన్ని నిర్వహించింది.

ఇందులో పాల్గొన్న కేంద్ర మంత్రిత్వ శాఖ కార్యదర్శి రంజనా మాట్లాడుతూ గృహవసతి, తాగునీరు, ఆరోగ్య సంరక్షణ, విద్య, జీవనోపాధి, రహదారి అనుసంధానం వంటి హక్కులను సంపూర్ణంగా అందించడం అనేది కేవలం ఒక ఆకాంక్షాత్మక లక్ష్యం కాదని, రాజీపడలేని బాధ్యత అని నొక్కి చెప్పారు. పాక్షికంగా లేదా ఆలస్యంగా పనులు పూర్తిచేయడాన్ని పథకం ఉద్దేశం నుండి విచలనంగా పరిగణిస్తామని, ఇకపై పనితీరు మదింపు కేవలం వ్యయం ఆధారంగా కాకుండా ఫలితాల ఆధారంగా జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. జవాబుదారీ యంత్రాంగాలను బలోపేతం చేసేందుకు, సంబంధిత మంత్రిత్వ శాఖలు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖలతో స్వతంత్ర సమన్వయ సమీక్షా సమావేశాలను నిర్వహించాలన్నారు. అలాగే కేంద్రరాష్ట్ర సమన్వయాన్ని బలోపేతం చేయడాన్ని నొక్కి చెప్పారు.. డిఎజెజియుఎ యొక్క సమన్వయ ఆధారిత నిర్మాణాన్ని హైలైట్ చేస్తూ, ఈ కార్యక్రమం ఒకే గిరిజన నివాస ప్రాంతాలలో బహుళ కేంద్ర రంగ పథకాలను ఏకీకృతం చేస్తుందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయి ధృవీకరణ మరియు పురోగతి పర్యవేక్షణ కోసం, రాష్ట్రాలు ఈ కార్యక్రమంలో చురుకుగా సహయాజమాన్యాన్ని వహించాలని, అలాగే జిల్లా స్థాయిలో, ముఖ్యంగా జిల్లా కలెక్టర్లు, జిల్లా మేజిస్ట్రేట్లు మరియు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారుల మధ్య జవాబుదారీతనాన్ని నిర్ధారించాలని తెలిపారు.

వ్యూహాత్మక ప్రణాళికలో భాగంగా పలు కొత్త కార్యక్రమాలను ప్రకటించారు. వాటిలో సుస్థిర గిరిజన జీవనోపాధుల కోసం సమీకృత పరిరక్షణ, వ్యవసాయ సాంకేతికత, విలువ జోడించిన జీవవనరులు, గిరిజన వైద్యుల సామర్థ్య నిర్మాణం, ప్రాజెక్ట్ దృష్టి కింద గిరిజన ఆరోగ్య పరిశీలన కేంద్రం,

గిరిజన జిల్లాల్లో మలేరియా, కుష్టు వ్యాధి, క్షయ వ్యాధులను లక్ష్యంగా చేసుకున్న వ్యాధి నిర్మూలన కార్యక్రమాలు, గిరిజన బహుళార్థసాధక మార్కెటింగ్ కేంద్రాల ఏర్పాటు, గిరిజన పర్యావరణ పర్యాటక పైలట్ ప్రాజెక్ట్, గిరిజన హోమ్‌స్టే అభివృద్ధి, గిరిజన సౌర సహాయక కార్యక్రమం ఆది కర్మయోగి అభియాన్ సంస్థాగతీకరణపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు.

# మీ గుండె పదిలమేనా ?



శారీరక ఆరోగ్యానికి నడక, యోగా.. ఇలా నచ్చిన వ్యాయామాలను చేస్తుంటాం కదా! వాటిలో శ్వాస వ్యాయామాలకీ చోటివ్వండి వీటితో మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలు పొందొచ్చు అంటున్నారు నిపుణులు.

నేలమీద కూర్చొని దీర్ఘంగా శ్వాస తీసుకోవాలి. తరవాత నెమ్మదిగా నోటితో ఆ గాలిని వదిలేయాలి. లేదా ముక్కు ఒక రంధ్రంతో దీర్ఘశ్వాస తీసుకొని మరోదాని నుంచి వదలాలి. వీటిలో నచ్చినదాన్ని రోజుకు కనీసం 2 నిమిషాలైనా ప్రయత్నించాలి. రోజులో ఇంటిపని, ఆఫీసుపని అంటూ పరుగులు పెడుతుంటాం. ఈ క్రమంలో ఒత్తిడి బారిన పడతాం. దాన్నుంచి బయటపడటానికి శ్వాస వ్యాయామాలు ఉత్తమ పరిష్కారం.ఇవి నాడీ వ్యవస్థను ప్రశాంతంగా ఉంచి ఒత్తిడి, ఆందోళనలను తగ్గిస్తాయి. ప్రతిరోజూ వీటిని జీవనశైలి భాగం చేసుకుంటే ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడుతుంది. అంతేకాదు, ఆస్తమా మొదలైన దీర్ఘకాలిక వ్యాధులకూ ఇది ప్రయోజనకరం. లోతుగా ఊపిరి పీల్చుకుని వదలటం వల్ల శరీరానికి రక్తప్రసరణ బాగా జరుగుతుంది. దాంతో అవయవాల పనితీరు మెరుగుపడుతుంది. రక్తపోటును తగ్గించడానికీ ఇది ఉత్తమ సాధనం. గుండె కూడాఆరోగ్యంగా ఉంటుంది. □

## వేదాంతం

**ఈ రోజుల్లో మనం వేదాంతం** చెప్పేవారిని ఎందరినో చూస్తున్నాం. అయితే వారు నిజంగా వేదాంతులేనా? పరమగురువు చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి వారు ఇలా అంటారు–'మనం నిజమైన వేదాంతులు కావాలంటే ముందు శరీరం, కుటుంబం, సంఘం గురించి పట్టించుకోవాలికదా! కనుక ఆచారాలను పాటించాలి. ఆచారహీనం, న పునంతి వేదాః అనే మాట ఉంది. ఎంత వేదం చదివినా ఆచారం లేకపోకపోతే ఆ వేదం వానిని రక్షించదని అర్థం. పవిత్రమైన గంగాజలం కపాలంలో పోసినా, ఆవు పాలను తోలుతిత్తిలో పోసినా వ్యర్థమే కదా? ఉపన్యాసాలు, పుస్తక పఠనం, రచనలవల్ల పవిత్రుడని భ్రాంతి పడకూడదు. వీరిలో చాలా మంది ఆచారాలకు గుండుసున్న చుట్టినవారే. కనుక వీరి మాటలకు విలువ ఉండదు. ఆత్మానుభవం కలవారి మాటలే జనులలో నాటుతాయి. చాలాకాలం నుండి సత్పురుషులు పాటించినది సదాచారమని, శిష్టాచారమని అంటారు. విద్వాంసులై, జీవితంలో నేరుకొన్నది ఆచరించివారు శిష్టులు. స్వామి వారి మాటలను మనం చాలా జాగ్రత్తగా గమనించాలి. ఎందుకంటే వేదాంతం చెప్పే నేర్పున్న ఏవో నాలుగు శ్లోకాలు వల్లించ గలిగే ప్రతి వ్యక్తికి పాదనమస్కారాలు చేసే స్థితికి దిగజారి ఉన్నాము. ఒక వ్యక్తి ఏమి చెబుతున్నాడు, ఏమి వ్రాస్తున్నాడు. అనేది కాక అతడు ఎలా జీవిస్తున్నాడు అనేది ముఖ్యం. గణితాన్ని, చరిత్రని, సైన్సుని బోధించేవాడు ఎలాంటివాడైనా వానికి ఆయా సబ్జెక్టుల్లో నైపుణ్యం ఉంటే సరిపోతుంది కానీ ఆధ్యాత్మిక విషయాల్లో అలాకాదు. బోధకుని జీవన విధానం ముఖ్యం. దాన్ని గమనించాలి మనం. ముందు అతనికి ఆత్మానుభవం ఉండాలేక ఉత్తమ పాండిత్యముందా? ఆత్మానుభవం ఉంటే దానికి అనుగుణమైన ఆచరణ ఉండి తీరుతుంది. అతడు ఆచరించేది సదాచార మవుతుంది. బోధ, ఆచారణల మధ్య ఏ మాత్రం తేడా ఉండదు. ఎన్నో మంచి విషయాలను ఆచారించి బోధించిన స్వామివారు 'నాకొక సందేహం కల్గుతోంది. నా సంభాషణను లెక్కపెట్టానా? నేను చెప్పిన దానిని పాటించానా? అని సందేహం కల్గుతోంది. నా సంభాషణను లెక్కపెట్టానా? నేను చెప్పిన దానిని పాటించానా? అని అంటారు. అలాంటి ఆత్మ పరిశీలన కావాలి. □

# విరిగిన పాలతో ఇలా !

వేసవిలో వేడికి పదే పదే పాలు విరిగిపోవడం చూస్తుంటాం. అలాగని విరిగిన ప్రతిసారీ వాటిని బయటపడేయలేం. కలాకండ్, పనీర్.. వంటివీ తరచూ చేసుకోలేం. అందుకే ఇవే కాకుండా.. ఈ విరిగిన పాలను వివిధ రకాలుగా ఉపయోగించుకోవచ్చం టున్నారు నిపుణులు. అదెలాగో చూద్దాం ..



బేకింగ్ మిశ్రమాన్ని కలిపే క్రమంలో పెరుగు, బటర్, క్రీమ్ వంటి ఉపయో గించడం సహజమే. అయితే వీటికి బదులుగా విరిగిన పాలనూ వినియోగించవచ్చంటున్నారు నిపుణులు. ముఖ్యంగా బ్రెడ్, ప్యాన్‌కేక్స్, కేక్స్.. వంటి బేకింగ్ మిశ్రమాల తయారీలో ఈ పాలను ఉపయోగిస్తే అవి మరింత రుచికరంగా, పర్‌ఫెక్ట్స్ వస్తాయంటు న్నారు. కొంతమందికి కాలంతో సంబంధం లేకుండా చర్మం పొడిబారుతుం టుంది. పొలుసులుగా ఊడిపోతుంది. ఇలాంటప్పుడు విరిగిన పాల మిశ్రమాన్ని చర్మానికి అప్లై చేసుకొని కాసేపు మర్దన చేసుకోవాల. పావుగంట తర్వాత నీటితో కడిగేసు కుంటే చక్కటి ఫలితం ఉంటుంది. ఈ చిట్కా చర్మానికి మెరుపునూ అందిస్తుంది. విరిగిన పాలలో క్యాల్షియం ఎక్కువగా ఉంటుంది. ఇది మొక్కలు ఏపుగా పెరిగేందుకు దోహదం చేస్తుంది. అందుకే ఈ మిశ్రమాన్ని మొక్కల మొదళ్లలో, ముఖ్యంగా టొమాటో చెట్ల మొదళ్లలో వేస్తే ఆశించిన ఫలితం వస్తుంది. విరిగిన పాలతో పెరుగూ తయారుచేసు కోవచ్చుట. ఈ పాలను మరిగించి గోరువెచ్చగా మారాక.. ఇందులో రెండు టీస్పూన్ల పెరుగు వేస్తే.. కొన్ని గంటలకు గడ్డ పెరుగు తయారవు తుందట! మీరూ ఓసారి ట్రై చేయండి ! చికెన్, మటన్, చేపలు.. తదితర మాంసాహార వంటకాల తయారీలో పెరుగు, మజ్జిగను వాడు తుంటాం. అయితే వీటికి బదులుగా విరిగిన పాలతోనూ ఈ మాంసాన్ని మ్యారినేట్ చేసుకోవచ్చంటున్నారు నిపుణులు. తద్వారా వంటకాల రుచి ఇనుమడిస్తు దంటున్నారు. కాయగూరలు, పండ్లతో తయారు చేసుకునే సలాడ్ డ్రస్సింగ్ కోసమూ ఈ విరిగిన పాలను ఉపయోగించవచ్చుట! □

# పిల్లలను ఇంట్లో ఒంటరిగా వదిలితే..!



కొన్ని సందర్భాల్లో తల్లి దండ్రు లిద్దరూ పిల్లలను వదిలి బయటకు వెళ్లాల్సి వస్తుంటుంది. ఇలాంటప్పుడు పిల్లలు కొన్ని సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. ఈక్రమంలో ముందుగానే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలం టున్నారు నిపుణులు.

**అందులో పోస్ట్ చేయద్దు..** కొంతమంది తాము చేసే ప్రతి పనిని ఇతరులకు తెలియజేయాలనే ఆత్రుతతో సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుంటారు. ఒక్కోసారి ఇవే ప్రమాదకరంగా మారుతుం టాయి. ఇదే విషయాన్ని మీ పిల్లలకు తెలియజేయండి. మీరు మీ పిల్లలను ఇంట్లో వదిలి వెళ్లినప్పుడు వారు ఒంటరిగా ఉన్నారని తెలియజేసే విధంగా ఎలాంటి పోస్టులు పెట్టద్దని చెప్పండి. ఇలాంటిపోస్టులు పెట్టడం వల్ల కలిగే ప్రమాదాన్ని ఉదాహరణ రూపంలో వివరించండి.

**వారొస్తే డోర్ తీయద్దు..** సాధారణంగా పిల్లలను అపరిచితులకు దూరంగా ఉంచుతుంటాం. అలాగే వారు ఏది ఇచ్చినా తీసుకోవద్దని చెబుతుంటాం. ఇదే పద్ధతిని మీరు ఇంట్లో లేని సమయంలోనూ పాటించమని చెప్పాలి. అలాంటి వారెవరైనా వస్తే డోర్ తీయద్దని చెప్పాలి. దీనికోసం మీ ఇంటి చుట్టూ సెక్యూరిటీ కెమెరాలను పెట్టండి. ఇలా చేయడం వల్ల ఎవరు డోర్ బెల్ కొట్టారో ఆరు సులభంగా తెలుసుకోవచ్చు. అలాగే మీరు ఎక్కడున్నా సరే మధ్యమధ్యలో ఈ కెమెరాల మధ్య వాళ్ల ఎలా ఉన్నారో చెక్ చేయడం మర్చిపోవద్దు.

**అత్యవసర నంబర్లు చెప్పండి...** అత్యవసర పరిస్థితుల్లో ఎవరికి ఫోన్ చేయాలో ముందుగానే చెప్పండి. వాటిని ఎమర్జెన్సీ నంబర్లుగా వారి ఫోన్లో సేవ్ చేయండి. మీ సన్నిహితులు, ఇంటి పక్కన ఉన్నవారి నంబర్లను కూడా వారికి చెప్పండి. ఎమర్జెన్సీ లైట్లకు ఎప్పుడూ ఛార్జింగ్ ఉండేలా చూసుకోవాలి. దానిని ఎలా ఉపయోగించాలో పిల్లలకు చెప్పండి. ఎప్పుడైనా కరెంట్ లేనప్పుడు ఇది బాగా ఉపయోగపడుతుంది. కొంచెం పెద్దవారైతే ఇంటర్నెట్‌ని ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. అలాంటి వారికి ఇంటర్నెట్ వాడకానికి సంబంధించిన జాగ్రత్తలను వివరించండి. ఫోన్‌లో లొకేషన్‌ని ఆఫ్ చేయడం, సోషల్ మీడియాలో వ్యక్తిగత విషయాలను పంచుకోకుండా ఉండడం. వంటివి ఇందులో భాగమే. పిల్లలు ఆడుకుంటూ దెబ్బలు తగిలించుకోవడం సహజంగా జరుగుతుంటుంది. ఒకవేళ ఈరు లేనప్పుడు ఇలా జరిగితే వారే సొంతంగా ఫస్ట్ ఎయిడ్ చేసుకునే శిక్షణ ఇవ్వండి. ఇది చాలా సందర్భాల్లో ఉపయోగపడుతుంది. ఇంట్లో ఉండే మందులను వారికి దూరంగా ఉంచండి. □

# కప్పగంతులు వేయించండి !



సెలవుల్లో పిల్లల అల్లరిని నియంత్రించడం తల్లిదండ్రులకు కత్తిమీద సామే. ఒకరికి మించి ఇంట్లో ఉన్నప్పుడు ఆ ఇల్లు కిష్కింద కాండే. ఇలాంటప్పుడు వారి దృష్టిని ఆటలమీదకు మళ్లిస్తే మెదడు, శరీరం చురుగ్గా పనిచేస్తాయి. జ్ఞాపకశక్తీ పెరుగుతుంది. అలాంటిదే ఇది. ఈ ఆట పిల్లల్లో నవ్వుల పువ్వులు పూయిస్తుంది. ఒత్తిడిని దూరం చేస్తుంది. ఈ ఆట ఆడేవారు కింద కప్పల్లా కూర్చుని వాటి మాదిరిగానే గెంతాలి. ఇలా ముందుగా పెట్టుకున్న నిర్ణీత లక్ష్యాన్ని చేరుకోవాలి. ఎవరైతే మొదట దాన్ని పూర్తి చేస్తారో వారే విజేతలు. ఇప్పుడీ ఆట ఫ్రాగ్రెస్, ఫ్రాగ్ జంప్స పేరుతో వాడుకలో ఉంది. □

# కాల్షియం అందించే ద్రాక్ష

**సీజన్‌తో సంబంధం లేకుండా** దొరికే పండ్లలో ద్రాక్ష ఒకటి! పండైనా, ఎండినదైనా ఇది మనకు అందించే పోషకాలెన్నో! శారీరకంగానే కాదు.. మానసికంగానూ ఆరోగ్య ప్రయోజనాలు అందించే దీని గురించి తెలుసుకుందాం..



1. 30 దాటాక కొందరు మహిళల్లో ఎముక బలం తగ్గుతుంది. ద్రాక్షను తరచూ తీసుకోండి. దీనిలో క్యాల్షియం పొటాషియం, మెగ్నీసియం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉండి, ఎముకలను దృఢంగా చేయడంలో సాయపడతాయి. పాలిఫినాల్ రక్తంలోని చెడుకొవ్వులను కరిగించి గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. ద్రాక్షలోని మెలటోనిన్ ప్రశాంతమైన నిద్రను అందిస్తుంది. ఒత్తిడిని దూరం చేస్తుంది. దీనిలోని పోషకాలు అల్జీమర్స్‌నీ దరి చేరనీయవు. యాంటీఆక్సిడెంట్లు ఫ్రీరాడికల్స్, ఎండవల్ల జరిగే నష్టం నుంచి కాపాడతాయి. విటమిన్ సి చర్మం ఆరోగ్యంగా, ప్రకాశవం తంగా తయారయ్యేలా చేయడమే కాదు. రోగనిరోధకతనూ అందిస్తుంది. కెలోరీలు తక్కువ, నీటి శాతం ఎక్కువ. అధిక మోతాదులో ఉండే ఫైబర్ బరువు తగ్గించటంలో సాయపడుతుంది. లుటిన్ కళ్ల ఆరోగ్యాన్ని సంరక్షిస్తుంది. □

# 'రణబాలి' మేకింగ్ గ్లింప్స్ రిలీజ్

తెర



విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ 'రణబాలి'. ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై 'రణబాలి' సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ రోజు హీరో విజయ్ దేవరకొండ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు విషెస్ చెబుతూ 'రణబాలి' మూవీ నుంచి స్పెషల్ మేకింగ్ గ్లింప్స్ రిలీజ్ చేశారు.రణబాలి పాత్రలో విజయ్ దేవరకొండ హార్స్ రైడింగ్ కోసం ఎంతగా హార్డ్ వర్క్ చేశారు, ఎలాంటి కఠినమైన ట్రైనింగ్ తీసుకున్నారు అనేది ఈ బర్త్ డే గ్లింప్స్‌లో చూపించారు. స్టాలియన్ అనే బ్రీడ్‌కు చెందిన గుర్రాలను స్వారీ చేయడం చాలా కష్టం. అయితే సినిమా కోసం ఎంతైనా కష్టపడే విజయ్...చాలా ప్రయత్నాలు చేసి, గాయాలకు తట్టుకుని సక్సెస్ ఫుల్‌గా హార్స్ రైడింగ్ చేయడం ఈ గ్లింప్స్‌లో ఆకట్టుకుంటోంది. 'ఈ సన్నివేశాలు స్క్రీన్ మీద చూసేందుకు చాలా బాగుంటాయి, అందుకే ఇలాంటి కష్టతరమైన సీన్స్ చేస్తున్నాను..' అని విజయ్ చెప్పడం ఆయనకు సినిమా మీద ఉన్న ప్యాషన్‌ను తెలియజేస్తోంది. రణబాలి పాత్రలో విజయ్ చేసే హార్స్ రైడింగ్ సీన్స్, హార్స్‌తో పాటు చేసే భారీ యాక్షన్ సీక్వెన్స్‌లు ఈ మూవీలో హైలైట్ కానున్నాయి. 'రణబాలి' సెప్టెంబర్ 11న వరల్డ్ వైడ్ గ్రాండ్ రిలీజ్‌కు రాబోతోంది. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా "రణబాలి" సినిమా రూపొందుతోంది.



భారతీయ సినిమా చరిత్రలో ఎన్నడూ చూడని సరికొత్త విజువల్ వండర్‌ను ప్రేక్షకులకు అందించబోతున్నారు. కేవలం వందల కోట్లను మాత్రమే కాకుండా, వేల కోట్ల వసూళ్లను టార్గెట్ చేసుకుని ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. హాలీవుడ్ యాక్షన్ చిత్రాల తరహాలో ఉండబోయే ఈ సినిమా, తెలుగు సినిమా మేకింగ్ స్టైల్‌ను పూర్తిగా మార్చేస్తుందని చిత్ర దర్శకుడు ధీమా వ్యక్తం చేస్తున్నారు. వీఎఫ్ఎక్స్ విభాగంలో అనుభవం ఉండడంతో టాలీవుడ్‌లో మొట్టమొదటిసారిగా ఈ చిత్రాన్ని ఐమాక్స్ 8కె ఫార్మాట్‌లో రూపొందించాలని నిర్ణయించుకున్నారు. సాధారణంగా హాలీవుడ్ సినిమాలకు మాత్రమే పరిమితమైన ఈ ఫార్మాట్‌ను ఇక్కడ పరిచయం చేయడం ద్వారా ప్రేక్షకులకు ఒక వినూత్నమైన థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వబోతున్నారు. టెక్నాలజీ పరంగా రాజీ పడకుండా, ప్రతి ఫ్రేమ్‌ను ఒక విజువల్ పోయెట్రీలా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ చిత్ర కాన్సెప్ట్ గురించి దర్శకుడు బీఎస్ రావు మాట్లాడుతూ, మానవత్వం విఫలమైనప్పుడు 'మానిటీ' ఏం చేస్తుంది అనే ఒక విలక్షణమైన పాయింట్‌తో ఈ కథ సాగుతుందని వివరించారు. తాజాగా ఈ చిత్రం నుంచి రెండు అదిరిపోయే పోస్టర్లను విడుదల చేశారు.

# 'ది మానిటి.ఇన్' చిత్రం పట్టాలెక్కడానికి సిద్ధమైంది: డైరెక్టర్ బిఎస్ రావు

అందులోని ఓ పోస్టర్‌లో "When humanity is neglected... Manity arises" అనే ట్యాగ్‌లైన్ సినిమా ప్రధాన ఇతివృత్తాన్ని ఆసక్తికరంగా రివీల్ చేస్తోంది. సమాజంలో మనిషి విలువలు తగ్గినప్పుడు ప్రకృతి లేదా ఒక అదృశ్య శక్తి ఏ విధంగా స్పందిస్తుందనే అంశాన్ని సైన్స్ ఫిక్షన్, సోషల్ ఎలిమెంట్స్ కలగలిపి అద్భుతంగా రాసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ కాన్సెప్ట్ నచ్చే ఏ హీరో అయినా ముందుకు వస్తే వారితో కలిసి పని చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని, ఈ కథలో ఉండే ఎమోషన్స్, విజువల్స్ ఏ స్టార్ హీరోకైనా ఒక కెరీర్ మైల్‌స్టోన్ లాంటి సినిమా అవుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. పోస్టర్‌లో కనిపిస్తున్న ఇంటెన్స్ ఐస్ (కళ్లు) సినిమాలోని గాంభీర్యాన్ని, నిగూఢమైన రహస్యాలను సూచిస్తున్నాయి. కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు మేకింగ్ లో క్వాలిటీ ఉంటే ప్రేక్షకులు బ్రహ్మరథం పడతారనే నమ్మకంతో దర్శకనిర్మాత బీఎస్ రావు ఉన్నారు. పోస్టర్ డిజైన్ లోని రిచ్‌నెస్ ఈ సినిమా గ్లోబల్ అప్పీల్‌ను ప్రతిబింబిస్తోంది. ఈ ప్రాజెక్టులో భాగమయ్యే టెక్నీషియన్లు, నటీనటులకు ఇది ఒక అద్భుతమైన అవకాశం అని చెప్పవచ్చు. హాలీవుడ్ టెక్నీషియన్లతో సమానంగా ఇక్కడి వారు కూడా ప్రతిభ చూపేలా వర్క్ షాప్స్ నిర్వహిస్తున్నారు.

# 'దూరదర్శిని' ట్రైలర్ విడుదల



సువిక్షిత్, గీతికా రతన్ జంటగా ఓ యదార్థ సంఘటన ఆధారంగా రూపొందుతోన్న ఫీల్‌గుడ్ లవ్ ఎంటర్‌టైనర్ 'దూరదర్శిని'. కలిపింది ఇద్దరిని ఉపశీర్షిక. కార్తికేయ కొమ్మి దర్శకత్వంలో వారాహ మూవీ మేకర్స్ పతాకంపై జయ శంకర్ రెడ్డి.ఎం, పాటిమీది సంతోష్ ఈ చిత్రాన్ని నిర్మించారు. అన్ని పనులను పూర్తిచేసుకున్న ఈ చిత్రం మే 15న విడుదల కాబోతుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్, దర్శకుడు మాట్లాడుతూ "అందరి మనసులను హత్తుకునే సినిమా ఇది. అందరూ పల్లెటూరులో విహరించిన అనుభూతి కలుగుతుంది. అందరికి పాత జ్ఞాపకాలు గుర్తుకుతెస్తుంది. ఈ చిత్రంలో తల్లిదండ్రులకు, యూత్‌కు, సమాజానికి నచ్చే అంశాలు ఉన్నాయి. అందరికి 90వ దశకం రోజులను గుర్తుకు తెస్తుంది.ఈ సినిమాలో మంచి ఎమోషన్ ఉంది. అందరి హృదయాలను హత్తుకుంటుంది. సువిక్షిత్‌కు హీరోగా మంచి పేరును తీసుకొస్తుంది.అందరూ మే 15న విడుదలవుతున్న మాసినిమాను ఆదరించాలని కోరుకుంటున్నాను అన్నారు. ఈ సినిమా పతాక సన్నివేశాలు అందర్ని ఆలోచింపజేస్తాయి. సినిమా చూసిన వచ్చిన తరువాత ఆ ఫీల్ మిమ్ములను వదిలివెళ్లదుఖి అన్నారు. హీరో సువిక్షిత్ మాట్లాడుతూ " అరుణాచలంలో గిరి ప్రదక్షిణ చేస్తున్నప్పుడు ఓ పెద్దాయన బిక్షాటన చేస్తూ కనిపించాడు. ఆయనతో మాట్లాడినప్పుడు ఆయన చెప్పిన లైఫ్ స్టోరియే సినిమా ఇది. ఆయన సొంత కొడుకు వల్ల ఆ పెద్దాయన బిక్షాటన చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది అనేది ఈ కథ. యదార్థ సంఘటన చుట్టు అల్లుకున్న కథ ఇది. ఈ సినిమా చూసి ఏడవకుండా ఉన్నా వాళ్ల లైఫ్‌ను నేను సెటిల్ చేస్తాను. దూరదర్శిని ఓ జంటను ఎలా కలిపింది అనేది కథ.ఓ తండ్రికి మానసిక పరిస్థితి ఎందుకు అలా అయ్యింది? కొడుకు వల్ల బిక్షాటన ఎందుకు చేయాల్సి వచ్చింది? అనేది ఈ చిత్ర కథ. ఈ సినిమా టికెట్‌తో పాటు ఖర్చీఫ్ కూడా ఫ్రీగా ఇస్తాం. ఎందుకు ఈ సినిమా చూసి ఎద్వకుండా ఎవరూ ఉండలేరు' అన్నారు.



# ఎఫ్‌డిసి చైర్మన్‌గా భరత్ భూషణ్

## అభినందించిన సిఎం చంద్రబాబు

ఆంధ్ర ప్రదేశ్ ఎఫ్‌డిసి చైర్మన్‌గా నియమింపబడ్డ భరత్ భూషణ నారా చంద్రబాబు నాయుడు గారిని కలవగా ఆయన భరత భూషణ్‌కు అభినందనలు తెలిపారు. అందరినీ కలుపుకుంటూ ఆంధ్రప్రదేశ్‌లో సినీ, టీవీ మరియు నాటక రంగ అభివృద్ధి కోసం ముందుకు సాగాలని చంద్రబాబు సూచించారు..సినిమాలపై మక్కువతో 20 సంవత్సరాలుగా సినిమాలు డిస్ట్రిబ్యూషన్ చేస్తూ ఎన్నో విజయవంతమైన సినిమాలను ప్రేక్షకులకు అందిస్తూ వచ్చారు భరత్ భూషణ్. అలాగే భరత్ ఇన్ఫ్రా అనే కంపెనీ స్థాపించి తద్వారా ఎంతో మందికి ఉద్యోగ అవకాశాలు అందించారు. తెలుగు ఫిలిం ఛాంబర్ ప్రెసిడెంట్‌గా తనదైన శైలిలో అటు పరిశ్రమ తరపున ప్రభుత్వానికి అలాగే ఇటు చిత్ర పరిశ్రమలో ఉన్న చిన్న స్థాయి సమస్యల నుండి కార్మికుల సమస్యల వరకు ప్రతి సమస్యను తీరుస్తూ వచ్చారు.ఇది ఇలా ఉండగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భరత్ భూషణ్ గారిని రాష్ట్ర చలన చిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమించడం హర్షించదగిన విషయం. చలన చిత్ర, టీవీ, నాటక రంగాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఇప్పుడు భరత్‌భూషణ్ గారిని చైర్మన్‌గా నియమించి ఈ సంస్థ అభివృద్ధి బాధ్యతలను ఆయనకు అప్పగించడం జరిగింది.



# 'వీరభద్రుడు' 14న గ్రాండ్‌గా రిలీజ్

సూర్య తన మాగ్నమోపస్ మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ 'వీరభద్రుడు' కోసం దర్శకుడు ఆర్జే బాలాజీతో చేతులు కలిపారు. ఈ మోస్ట్ ఎవైటెడ్ మూవీని అనేక విజయవంతమైన చిత్రాలను నిర్మించడం ద్వారా పేరును తెచ్చుకున్న నిర్మాణ సంస్థ డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తోంది.ఈ చిత్రం ప్రతిష్టాత్మక అన్నపూర్ణ స్టూడియోస్ ద్వారా ఆంధ్రప్రదేశ్ తెలంగాణలో గ్రాండ్ గా రిలీజ్ కానుంది. తమిళం, తెలుగు, హిందీ పరిశ్రమలలో పాపులర్ కంటెంట్‌ను అందించిన డ్రీమ్6 వారియర్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని స్కేల్, కంటెంట్ రెండింటినీ దృష్టిలో ఉంచుకుని ప్రతిష్టాత్మకగా తెరకెక్కిస్తోంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్, సాంగ్స్ భారీ అంచనాలని సృష్టించాయి. ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా నటిస్తోంది. ఇంద్రన్స్, నట్టి, స్వసిక, అనఘ మాయ రవి కీలక పాత్రలు పోషిస్తున్నారు.సాయి అభ్యంకర్ మ్యూజిక్ అందిస్తున్న ఈ చిత్రానికి జికె విష్ణు సినిమాటోగ్రఫీ. 2026 మే 14న ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ గ్రాండ్ గా రిలీజ్ కానుంది.

## లెక్క సరిపోయిందా?

**ఉర్విల్ పటేల్..** ఈ అన్‌క్యాప్డ్ ప్లేయర్ చెన్నైలో విధ్వంసం సృష్టించాడు. సంజూ శాంమ్సన్ అవుటైనపుడు క్రీజ్‌లోకి వచ్చిన ఉర్విల్... సంజూ ప్లేస్‌ను సక్సెస్‌ఫుల్‌గా భర్తీ చేశాడు. ఎదురుగా బౌలింగ్ ఎండ్‌లో అవేష్ ఖాన్. వస్తూనే మొదటి బంతికి సిక్స్. అవేష్ తేరుకునే లోపే ధనాధన్ మరో రెండు సిక్స్‌లు. ఎదుర్కొన్న తొలి మూడు బంతుల్లోనే సిక్స్‌ల హోరు. దీంతో అవేష్ 25 పరుగులిచ్చుకున్నాడు. ఆ తర్వాత కూడా అవేష్ సిక్స్‌లతో ఎంఎ చిదంబరం స్టేడియం హోరెత్తింది. దిగ్వేష్ రాఠీ ఓవర్లోనూ బ్యాక్ టు బ్యాక్ సిక్స్‌లు, ఆ తర్వాత ఫోర్, మరో సిక్స్... ఇలా బెదంగొడుతూ మరో 25 రన్స్ పిండుకున్నాడు. షమీ బంతిని స్టాండ్స్‌లోకి పంపిన ఉర్విల్.. ఐపీఎల్ చరిత్రలో రెండో వేగవంతమైన హాఫ్ సెంచరీ నమోదుచేశాడు.

కేవలం 13 బంతుల్లోనే ఓ ఫోర్, ఏడు సిక్స్‌లతో అర్ధ సెంచరీ కంప్లీట్ చేశాడు. 2023లో కేకేఆర్‌పై రాజస్థాన్ రాయల్స్ ప్లేయర్ యశస్వీ జైస్వాల్ కూడా 13 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేశాడు. ఇప్పటివరకు యశస్వీ పేరిట ఉన్న ఐపీఎల్ ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ రికార్డును ఉర్విల్ సమం చేశాడు. ఇక షాబాజ్ వేసిన మరో ఓవర్లో బ్యాక్ టు బ్యాక్ ఫోర్, సిక్స్ బాదిన ఉర్విల్...షాబాజ్ వేసిన మరో ఓవర్లో అవుటయ్యాడు. క్రీజ్‌లోకి వచ్చింది మొదలు ఆకాశమే హద్దుగా చెలరేగుతూ మెరుపు ఇన్నింగ్స్ ఆడిన ఉర్విల్ 23 బంతుల్లో 2 ఫోర్లు, 8 సిక్స్‌లతో 65 పరుగులు చేశాడు. రెండో వికెట్‌కు రుతురాజ్ గైక్వాడ్‌తో 34 బంతుల్లోనే 81 రన్స్ జోడించాడు. ఐపీఎల్‌లో ఉర్విల్‌కు ఇది తొలి హాఫ్ సెంచరీ. ఉర్విల్‌కు ఇది రెండో ఐపీఎల్ సీజన్. గత సీజన్‌లో మూడు మ్యాచ్‌లు మాత్రమే ఆడే అవకాశం లభించగా, ఈ సీజన్‌లో ఇది నాలుగో మ్యాచ్. ఈసారి వచ్చిన అవకాశాన్ని చక్కగా ఉపయోగించుకుంటున్నాడు.




ఉర్విల్ పటేల్ 65 రన్స్

# ప్లే ఆఫ్ ఆశలు సజీవం

# చెన్నై హ్యాట్రిక్ విజయం

**చెన్నై:** సొంతగడ్డపై చెన్నై సూపర్ కింగ్స్ చెలరేగింది. 203 పరుగుల లక్ష్యాన్ని విజయవంతంగా ఛేధించింది. లక్నో సూపర్ జెయింట్స్‌పై 5వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. వరుసగా మూడో విజయంతో హ్యాట్రిక్ సాధించింది. మొత్తానికి ఆరో విజయంతో రాజస్థాన్ రాయల్స్‌ను కిందికి నెట్టి పాయిట్ల పట్టికలో అయిదో స్థానానికి చేరింది. ప్లే ఆఫ్ ఆశలను సజీవంగా నిలుపుకుంది. మిగతా మూడు మ్యాచ్‌ల్లో చెన్నై గెలిస్తే ప్లేఆఫ్ బెర్త్ ఖాయం. ఇక లక్నో సూపర్ జెయింట్స్ ఖాతాలో మరో ఓటమి చేరింది. 6పాయింట్లతో అట్టడుగున నిలిచింది. ఇప్పటికే ప్లే ఆఫ్‌కు దూరమైంది.

భారీ లక్ష్య ఛేదనకు సీఎస్‌కే ధాటిగానే ఆరంభించింది. తొలి ఓవర్లో సంజూ(28), గైక్వాడ్(42) చెరో బౌండరీ బాదారు. ప్రిన్స్ యాదవ్ తొలి ఓవర్లోనూ ఒకే సిక్స్ సాధించారు. ఇక మొదట బౌండరీ, ఆ తర్వాత సిక్స్ బాదిన సంజూను తర్వాతి బంతికి రాఠీ క్లీన్ బౌల్డ్ చేశాడు. వన్‌డౌన్‌లో వచ్చిన ఉర్విల్ పటేల్(65) పూనకం వచ్చినట్లు ఊగిపోయాడు. కేవలం 13 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసి, విజయానికి గట్టి పునాది వేశాడు. మధ్యలో సీఎస్‌కే కాస్త తడబాటుకు లోనైంది. సునాయాసంగా గెలుస్తుందనుకుంటే, మ్యాచ్‌ను చివరి వరకు తీసుకొచ్చింది. చివరి ఓవర్ తొలి రెండు బంతులకు శివమ్ దూబే (15 నాటౌట్) సిక్సర్లు బాది సీఎస్‌కేను గెలుపందించాడు. ఈ మ్యాచ్‌లో లక్నో చాలా క్యాచ్‌లు జారవిడిచి మూల్యం చెల్లించుకుంది. లక్నో బౌలర్లలో దిగ్వేష్, షాబాజ్ రెండేసి వికెట్లు తీశారు.



ఇంగ్లిస్ 85 రన్స్



అంతకుముందు మొదట బ్యాటింగ్‌కు దిగిన లక్నో సూపర్ జెయింట్స్ భారీ స్కోర్ చేసింది. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. ఓపెనర్ జోష్ ఇంగ్లిస్(33 బంతుల్లో 85; 10 ఫోర్లు, 6 సిక్స్‌లు).. మిచల్ మార్ష్(10)తో కలిసి ఆదిరే ఆరంభం ఇచ్చాడు. నాలుగో ఓవర్లోనే 50 మార్కు దాటించాడు. గత మ్యాచ్ సెంచరీ హీరో మిచెల్ మార్ష్ ఈసారి నిరాశపరిచినా, అతని స్థానంలో వచ్చిన నికోలస్ పూరన్(1)తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరినా... జోష్ ఇంగ్లిస్ జోరు తగ్గలేదు. బంతులను స్టాండ్స్‌ల్లోకి పంపిస్తూ చెన్నై బౌలర్లను బెంబెలెత్తించాడు. అతని ధాటికి పవర్ ప్లే మొదటి ఆరు ఓవర్లలోనే 91 రన్స్ వచ్చాయి. ఈ క్రమంలో 17 బంతుల్లోనే 6 ఫోర్లు, నాలుగు సిక్స్‌లతో మెరుపు హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. అంతే ధాటిగా ఆడుతూ సెంచరీ చేసే ఊపులో కనిపించాడు. చివరకు ఇంగ్లిస్ జోరుకు ఓవర్టన్ అడ్డుకట్ట వేశాడు. కీపర్ క్యాచ్ ద్వారా పెవిలియన్‌కు పంపాడు. 112 పరుగుల వద్ద జోష్ ఇంగ్లిస్ అవుటైన తర్వాత లక్నో మిడిల్ ఆర్డర్ ఒక్కసారిగా తడబడింది. ఓవర్టన్, అన్షుల్ కంబోజ్.. లక్నో సూపర్ జెయింట్స్ మిడిలార్డర్‌కు బ్రేకులు వేశారు. కెప్టెన్ రిషబ్ పంత్(15), మార్క్‌రమ్(6), రఘు వంశీ(18) నిరాశపరిచారు.

డెత్ ఓవర్లలో షాదాబ్ అహ్మద్(43 నాటౌట్), హిమ్మత్ సింగ్(17) డెత్ ఓవర్లలో ధనాధన్ ఇన్నింగ్స్ ఆడారు. ఓవర్టన్ వేసిన 19వ ఓవర్లో రెచ్చిపోయిన ఈ లెఫ్ట్ హ్యాండర్ 4, 6, 4 కొట్టాడు. హిమ్మత్ సింగ్(17)తో కలిసి షాదాబ్ ఏడో వికెట్ అర్ధ శతకం భాగస్వామ్యం నమోదు చేశాడు. కంబోజ్ వేసిన చివరి ఓవర్లో ఆఖరి బంతిని షాదాబ్ సిక్సర్‌గా మలవగా లక్నో స్కోర్ రెండొందలు దాటింది. చెన్నై బౌలర్లలో ఓవర్టన్ మూడు వికెట్లు, అన్షుల్ కంబోజ్ రెండు వికెట్లు, నూర్ ఆహ్మద్ ఓ వికెట్ పడగొట్టారు.

# చివరి ఓవర్ ఉత్కంఠ - ఆర్సీబీ గెలుపు



నాలుగు వికెట్లు తీసిన భువీ

**రాయ్‌పూర్:** ఆర్సీబీ ఒడుతూ ఒడుతూ నెగ్గింది. చివరి ఓవర్ వరకు ఉత్కంఠ రేపిన ఈ మ్యాచ్‌లో ఆర్సీబీ రెండు వికెట్ల తేడాతో ముంబై ఇండియన్స్‌పై గెలుపొందింది. 167పరుగుల లక్ష్య చేధనలో టాప్ ఆర్డర్ మరోసారి తడబడింది. కృనాల్ పాండ్యా(73) ఒంటరిపోరాటంతో మ్యాచ్ చివరి ఓవర్ వరకు ఉత్కంఠ రేపింది. చివరి ఓవర్లో 15 పరుగులు చేయాల్సిన దశలో రాజ్‌భవా ఒత్తిడికి లోనయ్యాడు. అయితే మూడో బంతికి షెఫర్డ్‌ను అవుట్ చేశాడు. 3బంతుల్లో 9 పరుగులు ఈదశలో వస్తూనే భువనేశ్వర్ సిక్స్ బాదాడు. తరువాతి బంతికి సింగిల్ తీశాడు. చివరి బంతికి రెండు రన్స్ చేయాల్సిన దశలో రసిఖ్ బౌలర్‌దిశగా ఆడి వేగంగా పరుగులు పూర్తి చేసి ఆర్సీబీకి అద్భుత విజయాన్ని అందించాడు. ఈ విజయంతో ఆర్సీబీ ఖాతాలో ఏడో గెలుపు చేరింది. 14 పాయింట్లతో నిలిచింది.

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ముంబై ఇండియన్స్... బెంగళూర్ బౌలర్ల ధాటికి ఆరంభం నుంచే తడబడింది. ముఖ్యంగా భువనేశ్వర్ కుమార్ ముంబైను దెబ్బతీశాడు. తొలి ఓవర్ చివరి బంతికి రికల్టన్(2)ను అవుట్ చేసి ముంబైకు మొదటి ఝలక్ ఇచ్చాడు. మరో ఎండ్‌లో రోహిత్ శర్మ(22) రెండు ఫోర్లు, రెండు సిక్సులతో ఊపుమీదున్నట్లు కనిపించాడు. అయితే భువీ తన రెండో ఓవర్ అయిదో బంతికి రోహిత్‌ను కీపర్ క్యాచ్‌ద్వారా పెవిలియన్ చేరాడు. క్రీజ్‌లోకి వచ్చున కెప్టెన్ సూర్యకుమార్ ను తరౌతి బంతికే డకౌట్‌గా ఔట్‌చేశాడు. దీంతో ముంబై 28 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది.

**ఆదుకున్న నమన్, తిలక్**

కష్టాల్లో పడ్డ ముంబైను నమన్ ధీర్(32 బంతుల్లో 47), తిలక్ వర్మ(42 బంతుల్లో 57) ఆదుకున్నారు. ఇద్దరూ ఆచితూచి ఆడుతూ మధ్యమధ్యలో బౌండరీలతో స్కోరును ముందుకు నడిపారు. నాలుగో వికెట్‌కు 82 రన్స్ జోడించడమే గాక స్కోరును వంద దాటించారు. ఆ తర్వాత ముంబై వేగంగా వికెట్లు కోల్పోయింది. నమన్‌ధీర్‌ను రసిఖ్ క్లీన్ బౌల్డ్ చేయగా, విల్ జాక్స్(10)ను షెపర్డ్ పెవిలియన్ చేర్చాడు. మరోవైపు అర్ధసెంచరీతో ఊపు మీదున్న తిలక్ వర్మను భువనేశ్వర్ అద్భుత బంతితో ఔట్ చేసి భారీ దెబ్బకొట్టాడు. దీంతో ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 166 పరుగులే చేయగలిగింది. ఆర్సీబీ బౌలర్లలో భువనేశ్వర్ 4 వికెట్లు తీయగా... హేజిల్ వుడ్ , సలామ్ దర్, షెఫార్డ్ తలా ఒక వికెట్ పడగొట్టారు.



తిలక్ 57రన్స్



## ఆసియా క్రీడలకు లాహిరి, ఈశ్వా క్వాలిఫై

హైదరాబాద్, మే 10(వార్త క్రీడా ప్రతినిధి): ఆసియా క్రీడలకు తెలంగాణ సెయిలర్లు కొమరవెల్లి లాహిరి, సురగాని ఈశ్వా అర్హత సాధించారు. భారత యాటింగ్ సమాఖ్య నిర్వహించిన ఆసియా క్రీడల సెలక్షన్ ట్రయల్స్‌లో లాహిరి, ఈశ్వా.. ఈఆర్‌ఎస్ యూత్ కేటగిరిలో అగ్రస్థానంలో నిలిచారు. లాహిరి, ఈశ్వా అంతర్జాతీయ ట్రైనింగ్ సర్క్యూట్‌కు ఎంపికయ్యారని.. జులైలో ప్రకటించే భారత తుది జట్టులో చోటు దక్కించుకోవడం లాంఛనమని హైదరాబాద్ సెయిలింగ్ క్లబ్ అధ్యక్షుడు సుహీమ్ షేక్ చెప్పారు. లాహిరి స్వస్థలం సిద్ధిపేట, ఈశ్వా సొంత ఊరు చిలుకూరు. లాహిరిది పేద కుటుంబం. కొవిడ్ సమయంలో లాహిరి తల్లి.. సెయిలింగ్ క్లబ్‌లో వంట చేసేది. ఆ సమయంలోనే లాహిరికి సెయిలింగ్‌పై ఇష్టం ఏర్పడింది. మరోవైపు ఈశ్వాకు తండ్రి లేడు. ఆమె తల్లి మాధవి ఒక కర్మాగారంలో రోజు కూలీగా పని చేస్తోంది. సెయిలింగ్‌ను ఇష్టపడడంతో ఆమె కుమార్తెను హైదరాబాద్ క్లబ్‌కు తీసుకొచ్చింది. ఎంతోమంది పేద క్రీడాకారులను సెయిలర్లుగా మలిచిన హైదరాబాద్ సెయిలింగ్ క్లబ్.. ఈశ్వాకు కూడా అవకాశం ఇచ్చింది. కొన్నాళ్లుగా జాతీయ స్థాయిలో లాహిరి, ఈశ్వా స్థిరంగా రాణిస్తున్నారు.

# నాలుగు కంపెనీల్లో లక్ష కోట్లు ఆవిరి




**ముంబయి, మే 10:** ఈక్విటీ మార్కెట్లలోని టాప్ పది కంపెనీల్లో నాలుగుకంపెనీల మార్కెట్ విలువలు రూ.1 లక్షకోట్లు క్షీణించాయి. వీటిలో స్టేట్‌బ్యాంకు ఎక్కువ నష్టపోయింది. ఎస్‌బిఐ మార్కెట్ క్యాప్ రూ.44,722.34 కోట్లు క్షీణించి రూ.9,41,107.62కోట్లకుచేరింది. భారతి ఎయిర్‌టెల్ విలువలు కూడా 31,167.1 కోట్లు క్షీణించి రూ.11,18,055.03 కోట్లకు చేరింది. టిసిఎస్ విలువలు కూడా రూ.28,456.26 కోట్లు తగ్గి రూ.8,66,477.69కోట్లకు చేరాయి. ఎల్అండ్‌టి కూడా రూ.5371.84కోట్లు క్షీణించి రూ.5,46,621.21 కోట్లకు చేరింది. ఇక హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు మార్కెట్‌క్యాప్ రూ.15,425.09 కోట్లు పెరిగి రూ.12,02, 699.26 కోట్లకు చేరింది. బజాజ్‌ఫైనాన్స్ మార్కెట్ విలువలు కూడా రూ.11,486.89 కోట్లు పెరిగి రూ.5,94,610 కోట్లకు చేరితే హిందూస్థాన్ యూనిలీవర్ రూ. 8763.97 కోట్లు పెరిగి రూ.5,37,562.98 కోట్లకు చేరింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ 6563.28 కోట్లు పెరిగి రూ.19,42, 866.58 కోట్లకు పెరిగింది. ఎల్ఐసి సంస్థ కూడా రూ.2751.37 కోట్లుపెరిగి రూ.5,07,549.44 కోట్లుగా ఉంది. ఐసిఐసిఐబ్యాంకు మార్కెట్ విలువలు కూడా రూ.1694.61 కోట్లుపెరిగి రూ.9,06,675.39 కోట్లుగా ఉంది. రిలయన్స్ టాప్ సంస్థల్లో అగ్రగామిగా నిలిస్తే వరుసగా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, భారతి ఎయిర్‌టెల్, ఎస్‌బిఐ, ఐసిఐసిబ్యాంకు, టిసిఎస్, బజాజ్‌ఫైనాన్స్, ఎల్అండ్‌టి, హిందూస్థాన్ యూనిలీవర్, ఎల్ఐసి సంస్థలు నిలిచాయి.

# మార్కెట్‌లోకి ఒకేసారి పది కొత్త ఫండ్స్

**ముంబయి, మే 10:** ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో ఒకేసారి 10 కొత్త పథకాలు ప్రారంభం అయ్యాయి. న్యూ ఫండ్ ఆఫర్ ద్వారా 7 కొత్త స్కీమ్స్ లాంచ్ కాగా మరో 3 స్పెషలైజ్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్‌లు ఉన్నాయి. మ్యూచువల్ ఫండ్ హౌస్‌లు తమ పోర్ట్ ఫోలియోలోని ఖాళీలను పూరించేందుకు ఎప్పటికప్పుడు కొత్త కొత్త ఫండ్స్ లాంచ్ చేస్తున్నాయి.

ఈసారి తీసుకొచ్చిన కొచ్చిన కొత్త ఫండ్స్‌లో నాలుగు ఈక్విటీ ట్రేడెడ్ ఫండ్స్, రెండు ఇండెక్స్ ఫండ్స్, ఒక కాంట్రా ఫండ్ ఉన్నాయి. ఇక ఎస్ఐఎఫ్ ఫండ్స్ రెండు వేరు వేరు కేటగిరీల నుంచి వస్తున్నాయి. ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ నుంచే రెండు కొత్త స్కీమ్స్ లాంచ్ అయ్యాయి. ఈక్విటీ ట్రేడెడ్ ఫండ్స్ కేట గిరీ నుంచి నాలుగు కొత్త ఫండ్స్ ఉన్నాయి. ఇందులో ఎడెల్వాయిస్ నిఫ్టీ నెక్ట్స్ 50 ఈటీఎఫ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఈనెల 14వ తేదీతో ముగు స్తుంది. ఎస్‌బిఐ నిఫ్టీ 200వాల్యూ 30ఈటీఎఫ్ ఎస్‌బిఐ నిఫ్టీ స్మాల్ క్యాప్ 250 ఈటీఎఫ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఈనెల 18వ తేదీతో ముగుస్తుంది. ఇక గ్రో నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ ఈటీఎఫ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ 20వ తేదీతో ముగుస్తుంది.

యాక్సిస్ నిఫ్టీ క్యాపిటల్ మార్కెట్స్ ఇండెక్స్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ 15వ తేదీతో ముగుస్తుంది. గ్రో నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ ఇండెక్స్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ మే 20తో ముగుస్తుంది. మోతీలాల్ ఓస్వాల్ మ్యూచువల్ ఫండ్ నుంచి కాంట్రాఫండ్ పేరుతో న్యూ ఫండ్ ఆఫర్ లాంచ్ అయింది. మోతీలాల్ ఓస్వాల్ కాంట్రా ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఇప్పటికే ఓపెన్ అవగా 22వ తేదీ వరకు కొనసాగనుంది. టాటా మ్యూచువల్ ఫండ్ నుంచి టైటానియం ఈక్విటీ లాంగ్‌షార్ట్ ఫండ్ లాంచ్ అయింది. ఈ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ 11వ తేదీతో ముగుస్తుంది. యూనియన్ మ్యూచువల్ ఫండ్ నుంచి అర్థాయ ఈక్విటీ లాంగ్ షార్ట్ ఫండ్ రాగా ఈ స్కీమ్ సబ్‌స్క్రిప్షన్ 18వ తేదీ వరకు ఉంటుంది. క్యూ ఎస్ఐఎఫ్ సెక్టార్ రొటేషన్ లాంగ్‌షార్ట్ ఫండ్ అనే ఎస్ఐఎఫ్ స్కీమ్‌ని క్వాంట్ మ్యూచువల్ ఫండ్ లాంచ్ చేసింది. ఈ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ కొనసాగుతోంది. ఈనెల 11వ తేదీతో ముగుస్తుంది.




# ఎక్కువ దిగుమతుల వల్లే రూపాయి క్షీణత

**న్యూఢిల్లీ, మే 10:** ఐదేళ్లక్రితం డాలరుతో రూపాయి మారకం విలువలు రూ.80గా ఉన్నపుడే విస్తృతంగా జరిగిన చర్చలు ఇపుడు పశ్చిమాసియా ఉద్రిక్తతలతో డాలర్ విలువలు పటిష్టం అయి రూపాయి మారకం విలువలు 100కు చేరుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరల పెరుగుదల, విదేశీ పెట్టుబడుల ఉపసంహారణ, అమెరికా వడ్డీ రేట్ల పెంపు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు రూపాయి బలహీనతకు కారణాలుగా చెబుతున్నారు. అంతర్జాతీయ వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థల్లో డాలర్ ప్రభావం అంతగా బలంగా ఉండటంతో భారత్ వంటి దేశాలు దానిపై ఆధారపడుతూనే, అదే ఆధారాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నాయి. ప్రపంచ మొత్తం సరుకు వాణిజ్యంలో అమెరికా వాటా సుమారు 15 శాతమే అయినప్పటికీ, గ్లోబల్ ట్రేడ్ ఇన్వాయిస్‌లలో దాదాపు 54శాతం డాలర్లలోనే ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా జరిగే విదేశీ మారక లావాదేవీల్లో సుమారు 88శాతం ట్రేడ్లలో డాలర్ ఒక భాగంగా ఉంటుంది. ప్రపంచ విదేశీ మారక నిల్వల్లో దాదాపు 58 శాతం ఇప్పటికీ డాలర్ ఆస్తుల రూపంలోనే ఉన్నాయి. రూపాయి దీర్ఘకాలిక గమనం పరిశీలిస్తే డాలర్ ప్రభావం ఎంత బలంగా ఉందో అర్థమవుతుంది. 2011 ప్రారంభంలో 1 డాలర్ విలువ సుమారు 44 ఉండేది. 2013లో టేపర్ టాంట్రమ్ సమయానికి 60 సమీపానికి చేరింది. కరోనా మహమ్మారి నాటికి రూపాయి విలువ 70 దాటింది. 2022లో ఉక్రెయిన్ యుద్ధ ప్రభావంతో రూపాయి 80నుంచి 85 మధ్య ట్రేడ్ అయింది. 2026 నాటికి ఆఫ్‌షోర్ మార్కెట్లో రూపాయి 100కు చేరుతుందనే చర్చలు పెరిగాయి.



భారత్ వద్ద ప్రస్తుతం సుమారు 700 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వలు ఉన్నాయి. వృద్ధి పెరిగే కొద్దీ డాలర్‌పై ఆధారపడటం కూడా పెరుగుతోంది ఈ ఏడాదిలో భారత్ 100 బిలియన్లకు పైగా ఎలక్ట్రానిక్స్ దిగుమతి చేసుకుంది. 2030 నాటికి సెమీకండక్టర్ దిగుమతులు కూడా 100 బిలియన్లు దాటే అవకాశం ఉంది. టెలికమ్యూనికేషన్ మౌలిక వసతులు, పారిశ్రామిక యంత్రాలు, సోలార్ మాడ్యూల్స్, లిథియమ్ అయాన్ బ్యాటరీలు, అడ్వాన్స్‌డ్ తయారీ రంగానికి అవసరమైన పరికరాల కోసం భారత్ ఇప్పటికీ దిగుమతులపై అధికంగా ఆధారపడుతోంది. దీంతో ఒక ఆసక్తికరమైన విరుద్ధ పరిస్థితి ఏర్పడుతోందని ఆర్థిక విశ్లేషకుల అంచనా.

## కెవైసి పాటించని సంస్థలపై ఆర్బీఐ జరిమానా

**ముంబయి, మే 10:** కెవైసి నిబంధనలు పాటించకుండా కొనసాగుతున్న బ్యాంకులపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వేటువేస్తోంది. తాజాగో మరో బ్యాంకుపై చర్యలు తీసుకుంది. నో యువర్ కస్టమర్ కెవైసీకి సంబంధించిన నిబంధనలు పాటించడంలో విఫలమైనట్లు గుర్తించిన క్రమంలో ప్రముఖ ప్రైవేట్ బ్యాంకుల్లో ఒకటైన యెస్ బ్యాంకు పై చర్యలు తీసుకుంది. రూ.31.80 లక్షల మేర పెనాల్టీ విధించింది. మరో ఫైనాన్స్ సంస్థకు సైతం భారీగా పెనాల్టీలు వేసింది. కస్టమర్లతో ఖాతా ఆధారిత సంబంధాన్ని ఏర్పరచుకునేందుకు, సెంట్రల్ కేవైసీ రికార్డ్స్ రిజిస్ట్రీ కేటాయించిన కేవైసీ ఐడెంటిఫైయర్‌ను ఉపయోగించే వ్యవస్థను ఏర్పాటు చేయడంలో బ్యాంకు విఫలమైందని ఆర్‌బీఐ తెలిపింది. గతంలో, 2025 మార్చి 31 నాటి బ్యాంకు ఆర్థిక స్థితికి సంబంధించి పర్యవేక్షక మూల్యాంకనం కోసం ఆర్‌బీఐ ఒక చట్టబద్ధమైన తనిఖీని నిర్వహించింది. ఈ క్రమంలోనే కేవైసీ వ్యవస్థను ఏర్పాటు చేయడంలో బ్యాంక్ విఫలమైందని తెలిపింది. ఇందుకు సంబంధించి నోటీసులు జారీ చేసింది.

## 1000 మంది ఉద్యోగులపై వేటు

**న్యూఢిల్లీ, మే 10:** నైతిక ప్రవర్తన, ఉద్యోగ నియమావళి ఉల్లంఘనల కింద గడచిన మూడేళ్లలో ఎయిరిండియా వెయ్యిమందికిపైగా ఉద్యోగులను తొలగించింది. అలాగే ఉద్యోగులకు ఇచ్చిన విరామప్రయాణ వ్యవస్థను దుర్వినియోగంచేసిన వారిపైనా వేటు వేసినట్లు ఎయిర్‌లైన్ క్యాంప్‌బెల్ విల్సన్ వెల్లడించారు. ప్రతిఏటా వందలాదిమంది ఉద్యోగులు ఈ నిబంధనలు పాటించనం దుకు ఉద్వాసన పలకాల్సి వస్తోందని, ఉద్యోగులు తమ నైతిక నియమావళిని పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు.

# కేంద్రానికి సిఐఐ 5 పాయింట్ల అజెండా



## పారిశ్రామికరంగం ఇంధన సంరక్షణ పాటించాల్సిందే

## ధరల స్థిరత్వంతో సుంకాలను పునరుద్ధరించుకోవచ్చు

**న్యూఢిల్లీ, మే 10:** ముడిచమురుధరల్లో స్థిరత్వం నెలకొంటున్నందున కేంద్రం ఇప్పటివరకూ తగ్గించిన అదనపు సుంకాలనుపునరుద్ధరించవచ్చని సిఐఐ కేంద్రానికి సూచించింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా పెట్రోలు, డీజిల్‌పై ప్రత్యేకించి రూ.10 అదనపు సుంకాన్ని తగ్గించిన సంగతి తెలిసిందే. ఇందుకోసం సిఐఐ ఐదు పాయింట్ల అజెండానుప్రతిపాదించింది. ప్రస్తుత గ్లోబల్ అనిశ్చితుల్లో ఈ అజెండా అమలు అనివార్యం అవుతున్నదని స్వచ్ఛందంగా ఇంధన సంరక్షణ అనివార్యమని పేర్కొంది. ప్రైవేటు ఇన్వెస్ట్‌మెంట్ కార్యాచరణ మెరుగుపడుతోందని చెప్పిన సిఐఐ 1200 కంపెనీలుమాత్రమే కేంద్రం కొత్తగాప్రకటించిన సిఎంఐఇ పథకాన్ని వినియోగించుకున్నాయని అంతకుముందున్న రూ.4.6 లక్షలకోట్లనుంచి ప్రైవేటు మూలధన వ్యయం రూ.7.7 లక్షలకోట్లకు చేరిందని అన్నారు. సిఐఐ డైరెక్టర్‌జనరల్ చంద్రజిత్ బెనర్జీ మాట్లాడుతూ ప్రైవేటు మూలధన వ్యయం ఇన్వెస్ట్‌మెంట్ సైకిల్‌లో కీలకమని పేర్కొంటూ పరిశ్రమలు కూడా ఇంధన సంరక్షణ పాటించాలని, ఇంధనం, విద్యుత్ వినియోగంలో వచ్చే రెండుత్రైమాసికాల్లో మూడు నుంచి ఐదుశాతం వినియోగం తగ్గించుకోవాలని సూచించారు. అలాగే భారీ కార్పొరేట్ సంస్థలు ఎంఎస్‌ఎంఇలకు చెల్లింపుల్లో కూడా స్పష్టత ఇవ్వాలని 45రోజుల్లోపు చెల్లించాలని సూచించారు. ట్రెడ్స్ ప్లాట్‌ఫామ్, సప్లయిచైన్ ఫైనాన్సింగ్ యంత్రాంగాలను వినియోగించి మూలధన సమస్యలను కూడా ఎంఎస్‌ఎంఇలకు పరిష్కరించాలని అభిప్రాయపడ్డారు. ఇంధన ధరలు స్థిరంగా ఉన్న తరుణంలో ప్రభుత్వం విధించిన సుంకాలను ఆరునుంచి తొమ్మిదినెలల్లో దశలవారీగా తగ్గించే వీలుంటుందన్నారు. ఉత్పత్తి రంగం ప్రైవేటు మూలధన వ్యయంలో రూ.3.8 లక్షలవరకూ ఉందని, మెటల్స్, ఆటోమొబైల్స్, రసాయనాలు కీలకమని అలాగే సేవలరంగం రూ.3.1 లక్షల కోట్లు కాగా 40శాతం వాటాతో ఉంది. ట్రేడింగ్ కమ్యూనికేషన్స్, ఐటి, ఐటిఇఎస్ రంగాలు వీటిలోకీలకమన్నారు. ఆర్డర్‌బుక్స్ కూడా 10.3శాతంపెరిగిందని, బ్యాంకు క్రెడిట్ గ్రోత్ 10శాతం పెరిగిందని, ఈ ఏడాది రెండో అర్థభాగంలో పదినుంచి 14శాతానికి పెరుగుతుందన్నారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.